thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 311 కరీంనగర్ శనివారం, 17 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించను న్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్య త వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదా లు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు.




## ఆదిలాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ వరాల జల్లు

ఆదిలాబాద్, జనవరి16 : ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతీఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు.

రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు.

**సరైన న్యాయం జరగలేదు..** పోరాటం, పౌరుషాల గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరైన న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి చేస్తామని వివరించారు.

ఆదిలాబాద్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధికి నిధులు ఇస్తామని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి.

**నిధులు మంజూరు చేశాం..** చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన టీజీ బీజేపీ




ఢిల్లీ, జనవరి16 : తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

**మూడు నెలల్లో నిర్ణయం..** పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ(జశీఅ్‌వఎజ్‌ శీట జశీబతీ) కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు.

**పిటిషన్‌లోని అంశాలు...** కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటిషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. ఈ పిటిషన్‌లో మరో కీలక అంశాన్ని కూడా చేరుస్తూ.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలను పొందుపరిచింది. దానం నాగేందర్ తాను ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ మారలేదని మీడియాలో వ్యాఖ్యానించినట్లు పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు ఏలేటి. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దుమారం రేపుతోంది.

**ప్రజాస్వామ్య విలువలపై ప్రభావం...** పార్టీ ఫిరాయింపులపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని, రాజ్యాంగ విరుద్ధ పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు ఏలేటి. ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఎలాంటి పరిణామాలు ఉండవనే భావన పెరుగుతుందని బీజేపీ తన పిటిషన్‌లో రాసుకొచ్చింది.

**సుప్రీంకోర్టు స్పందనపై ఉత్కంఠ..** ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్వీకరిస్తుందా? స్పీకర్‌కు నోటీసులు జారీ అవుతాయా?ఈ నిర్ణయానికి స్పష్టమైన గడువు విధిస్తుందా?. అనే అంశాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. కోర్టు ఆదేశాల ఉల్లంఘన రుజువైతే స్పీకర్ న్యాయస్థానానికి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

**బీజేపీ వ్యూహాత్మక అడుగుగా..** ఈ పిటిషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహంగా రాజ్యాంగ సంస్థల బాధ్యతను గుర్తుచేసే ప్రయత్నంగా పార్టీ ఫిరాయింపులపై ప్రజల్లో చర్చించే చర్యగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశం రాష్ట్ర రాజకీయాల్లో ఎప్పటి నుంచో హాట్ టాపిక్‌గా ఉంది. ఇప్పుడీ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుతో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో.. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.




## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు.. సుప్రీం కోర్టులో విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 16: బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన ప్రక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే నాలుగు వారాల సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈరోజు (శుక్రవారం) ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది కోరారు.

స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున ప్రక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. గత ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది.




## అంచనాలకు అందుతుందా నిర్మలమ్మ పొద్దు?

### ఈ బడ్జెట్‌లో ఈ రంగాల వారికి కీలక ప్రకటన రానుందా?

# కేంద్రం ప్లానేంటి?

మోదీ 3.0 ప్రభుత్వం మూడవ పూర్తి బడ్జెట్ ఫిబ్రవరి 1, 2026న సమర్పించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణ గణాంకాల దృష్ట్యా ఈ బడ్జెట్ ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ప్రభుత్వం సాధారణ ప్రజలకు అనేక ముఖ్యమైన ప్రకటనలు చేస్తుందని ఆశిస్తున్నారు. రైతుల నుండి పని చేసే నిపుణుల వరకు ప్రతి ఒక్కరికీ ఈ బడ్జెట్లో ప్రధాన ప్రకటనలు ఉంటాయని భావిస్తున్నారు.. అనేక ముఖ్యమైన ప్రకటనలు దేశ ఆర్థిక వ్యవస్థను పెంచుతాయని మరియు తయారీని పెంచుతాయని కూడా భావిస్తున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అనేక ముఖ్యమైన ప్రకటనల గురించి సూచనలు ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రవేశపెట్టవచ్చు. 64 ఏళ్ల నాటి ఆదాయపు పన్ను చట్టాన్ని సవరించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇంకా రైతులకు ఉపశమనం కలిగించడానికి ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద అందించే మొత్తాన్ని రెట్టింపు చేయవచ్చు. ప్రాణాలను రక్షించే మందులు, ఔషధ రంగానికి సంబంధించి కూడా కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంతలో దేశంలోని మౌలిక సదుపాయాల కోసం దాని మూలధనాన్ని రూ.11 లక్షల కోట్ల నుండి రూ.15 లక్షల కోట్లకు పెంచాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత బడ్జెట్ రూ.50.65 లక్షల కోట్లు. ఈసారి రూ.60 లక్షల కోట్లు దాటవచ్చని తెలుస్తోంది. బడ్జెట్ చరిత్ర 165 సంవత్సరాల నాటిది. స్వాతంత్ర్యం తర్వాత ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటలకు పార్లమెంటులో బడ్జెట్ చదివేది. 1999 నుండి సమయం ఉదయం 11 గంటలకు మార్చారు. 2014లో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. గతంలో బడ్జెట్‌ను బ్రీఫ్‌కేస్‌లో సమర్పించేవారు. తర్వాత దానిని తోలుతో తయారు చేసిన బ్రీఫ్ కేసుగా మార్చారు. ఇప్పుడు డిజిటల్‌గా మార్చేశారు.

**బడ్జెట్ 2026కి సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలు:** ప్రశ్న - 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఎప్పుడు సమర్పిస్తారు?
సమాధానం - 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఫిబ్రవరి 1, 2026న పార్లమెంటులో ప్రవేశపెడతారు.
ప్రశ్న - మోడీ 3.0 కోసం ఇది ఏ పూర్తి బడ్జెట్ అవుతుంది? రెండవదా లేదా మూడవదా?
సమాధానం - మోడీ 3.0 కి ఇది మూడవ పూర్తి బడ్జెట్ అవుతుంది. మొదటి పూర్తి బడ్జెట్ జూలై 2024లో సమర్పించారు.
ప్రశ్న - బడ్జెట్‌లో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం ఏవైనా ప్రకటనలు చేయగలదా?
సమాధానం - ప్రభుత్వం, ఆర్బీఐ ద్రవ్యోల్బణంపై పని చేశాయి. ఈసారి కూడా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి అనేక ప్రకటనలు చేయవచ్చు.
ప్రశ్న - బడ్జెట్‌లో ఆదాయపు పన్నుకు సంబంధించి ప్రకటన వచ్చే అవకాశం ఉందా?
సమాధానం - బడ్జెట్‌లో కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది సాధారణ పన్ను చెల్లింపుదారులకు గణనీయమైన ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.
ప్రశ్న - రైతులకు సంబంధించి బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటనలు చేయవచ్చు?
సమాధానం - ఈసారి రైతులకు ప్రధాన ప్రకటనలు చేసే అవకాశం ఉంది. పీఎం కిసాన్ నిధిని రెట్టింపు చేసే ప్రకటన చేయవచ్చు.
ప్రశ్న - బడ్జెట్‌కు ముందు హల్వా వేడుక ప్రాముఖ్యత ఏమిటి?
సమాధానం - ఏదైనా శుభ కార్యక్రమానికి ముందు స్వీట్లు తినే సంప్రదాయం ఉంది. అందువల్ల బడ్జెట్‌కు ముందు హల్వా వేడుక జరుగుతుంది.
ప్రశ్న - బడ్జెట్‌లో పన్ను శ్లాబులలో మొదటి మార్పు ఎప్పుడు జరిగింది?
సమాధానం - భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పన్ను శ్లాబులలో మొదటి మార్పు 1949-50 దశాబ్దంలో కనిపించింది.
ఓప్రశ్న - చివరిసారిగా ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
సమాధానం - దేశంలో చివరి రైల్వే బడ్జెట్‌ను రైల్వే మంత్రి సురేష్ ప్రభు సమర్పించారు. ఆ తర్వాత సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను విలీనం చేశారు.



# రిటర్న్ జర్నీ.. ట్రాఫిక్‌లో చిక్కొద్దంటే ఇలా వచ్చేయండి..

నల్లగొండ, జనవరి 16: సంక్రాంతి రిటర్న్ జర్నీకి నల్గొండ జిల్లా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు. హైదరాబాద్ వెళ్లే వాహనాల రద్దీని నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ కంట్రోల్‌లో భాగంగా వాహనాలను దారి మళ్లించాలని డిసైడ్ అయ్యారు. 65వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చిట్యాల, పెద్దకాపర్తిలో బ్లాక్ స్పాట్స్ వద్ద నిర్మాణ పనులతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉందని.. ఈ కారణంగా ఆయా రూట్లలో వాహనాలను దారి మళ్లించనున్నట్లు పోలీసులు ప్రకటించారు. సొంతూళ్ల నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకునే ప్రయాణికులు సురక్షితంగా, సాఫీగా ప్రయాణించాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పవార్ వెల్లడించారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు:** గుంటూరు –మిర్యాలగూడ – హాలియా – చింతపల్లి – మాల్ మీదుగా హైదరాబాద్. మాచర్ల – నాగార్జునసాగర్ – పెద్దఊర – చింతపల్లి – మాల్ మీదుగా హైదరాబాద్. నల్లగొండ – మార్రిగూడ బైపాస్ – మునుగోడు – నారాయణపూర్ – చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్

**విజయవాడ నుంచి..:** కోదాడ – హుజూర్‌నగర్ – మిర్యాలగూడ – హాలియా – చింతపల్లి – మాల్ మీదుగా హైదరాబాద్ ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను మళ్లించే ఏర్పాట్లు చేశారు. కాగా.. సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రజలు తమ తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగింది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్ ప్లాజా వంటి చోట్ల భారీ రద్దీ నెలకొంది. కేవలం 5 రోజుల్లోనే 3 లక్షలకు పైగా వాహనాలు హైవే మీదుగా ప్రయాణించాయి.

అందులో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు సుమారు 2.04 లక్షల వాహనాలు ప్రయాణించాయి. గత శనివారం ఒక్కరోజులోనే 71 వేలకు పైగా వాహనాలు ఆ మార్గం గుండా వెళ్లాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరినప్పటికీ.. ఫాస్టాగ్ స్కానింగ్ వేగవంతం చేయడం, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సాఫీగా సాగింది.



# వేములవాడ ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. "వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు.

పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని సీతక్క తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తా: రేవంత్‌రెడ్డి

నిర్మల్: పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ర తీవసుఎ)హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ. జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాలి. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తా.



ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగింది. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క–సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారింది. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారు" అని సీఎం అన్నారు.



# హైదరాబాద్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

హైదరాబాద్: గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ల శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బెలూన్ అప్పాజీగూడ శివారులో దిగింది.

# వనదేవతలను దర్శించుకునేందుకు మేడారానికి పోటెత్తిన భక్తులు





ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో భక్తుల రద్దీ భారీగా పెరిగింది.తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం మార్గమధ్యలో గట్టమ్మ తల్లివద్ద పూజలు చేస్తున్నారు. సమ్మక్క–సారలమ్మకు నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తున్నారు.




# ధరణి, భూ భారతి స్కామ్.. 15 మంది అరెస్ట్

వరంగల్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. "ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయి. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు.

నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి– భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముంది" అని సీపీ తెలిపారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి16 : రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025–2026 సీజన్‌లో MSP ద్వారా కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో మీరా కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల.

**కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..** వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 మీరా నిర్ణయించామన్నారు.

అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో




మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు.

జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.

**మధ్యవర్తులకు పంటను అమ్మొద్దు..** వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# ఎన్నికలప్పుడే కాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడూ వస్తాం: మంత్రి పొంగులేటి



ఖమ్మం: ఎన్నికలప్పుడే కాదు, ప్రజలు ఎప్పుడు కష్టాల్లో ఉన్నప్పుడూ వస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పాలేరులో పర్యటించిన మంత్రి మీడియాతో మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని చెప్పారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, మద్దులపల్లి వద్ద కొత్త మార్కెట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. సీపీఐ పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో సీఎం పాల్గొంటారని వెల్లడించారు. ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సీఎం సమావేశమవుతారని, ఈ సమావేశానికి కార్పొరేషన్ పరిధిలోని కార్యకర్తలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.




# పోలీసులను ఆశ్రయించిన అనసూయ

హైదరాబాద్ : ప్రముఖ నటి, టీవీ యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం సినీ, సోషల్ మీడియా వర్గాల్లో సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్, వ్యక్తిత్వ హననం, అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. గతేడాది డిసెంబర్ 23వ తేదీ నుంచి తనపై ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**కేసు వివరాలు, నిందితుల జాబితా..** నిందితుల పేర్లతో పాటు సోషల్ మీడియా లింకులు ఫిర్యాదుతో జత చేశారు అనసూయ. సోషల్ మీడియాలో తనపై క్యాంపెయిన్ తరహాలో దాడి జరిగిందని చెప్పుకొచ్చారు. ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయం చెప్పిన తర్వాతే ఈ వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక దూషణలు, బెదిరింపులు జరిగాయని ఫిర్యాదులో వెల్లడించారు. క్రిమినల్ డెఫమేషన్, వ్యక్తిగత వేధింపులు, ఏఐ ఫోర్జరీ వంటి నేరాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. అనసూయ ఫిర్యాదుతో మొత్తం 42 మందిపై కేసు నమోదైంది. కొందరు వ్యక్తులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఖాతాదారులపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

**ఎవరివెవరిపై కేసులు..** సీనియర్ నటి కరాటే కల్యాణి, ప్రముఖ రేడియో జాకీ(=జీ) శేఖర్ బాషా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని, పావని, రజిని, నటి విజయలక్ష్మి, ఒక ప్రముఖ ఛానల్ యాంకర్ రోహిత్, మరికొందరు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు, యాంకర్లు ఉన్నారు. వీరు వివిధ సోషల్ మీడియాల వేదికగా విమర్శలు చేశారని అనసూయ ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదుకు కారణాలు..** తన ఫొటోలను మార్ఫింగ్ చేయడం, తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు రూపొందించడం, తన వృత్తిని, వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని కొందరు కంటెంట్ క్రియేటర్లు వ్యూస్ కోసం కించపరిచేలా మాట్లాడుతున్నారని అనసూయ ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో గ్రూపులుగా ఏర్పడి తనను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో తనపై అభ్యంతరకర పదజాలం వాడటం, వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు, మహిళగా తన గౌరవాన్ని కించపరిచేలా పోస్టులు పెట్టడం, వీడియోలు చేయటం, ట్రోలింగ్ పేరుతో మానసిక వేధింపులకు గురిచేయటం, ఉద్దేశపూర్వకంగా పరువు నష్టం కలిగించే ప్రచారం చేయడం వంటి చర్యలు తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఫిర్యాదులో రాసుకొచ్చారు అనసూయ.

**చట్టపరమైన చర్యలు..** సైబరాబాద్ పోలీసులు ఐటీ యాక్ట్(×ుాావ్), సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది. డిజిటల్ సాక్ష్యాలను(వీడియోలు, పోస్టులు, స్క్రీన్‌షాట్లు) పోలీసులు ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తోంది. నేరం రుజువైతే జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో పలువురు ప్రముఖుల పేర్లు ఉండటం ఇప్పుడు సంచలనంగా మారింది.

# అలనాటి మేటి నటి శాంత కుమారి - జనవరి 17...శాంత కుమారి వర్ధంతి



తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి. తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్‌టి రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు. ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించి వందకు పైగా సినిమాల్లో నటించారు. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాసులో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె.పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిండియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక - నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట - గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్టపాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసుకొన్న తరువాతకూడ ఆమె నట జీవితం సాఫీగా కొన సాగింది. శాంతకుమారి పి.పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు. శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేబీ లక్ష్మి, ఆరణి సత్యనారాయణ మొదలైన వారు నటించారు. హను మంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు. పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయోగించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), మరియు ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధంగి 'జయభేరి, ప్రేమ్‌నగర్ణ ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించడం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు. మాయాబజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937), భక్త జయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహాత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్ట బుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957), జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968), అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు. 1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు. తెలుగు వెండి తెర బామ్మ 86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006 న స్వగృహంలో మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పరిపాలనా సంస్కరణా, రాజకీయ వ్యూహమా?


## జీహెచ్‌ఎంసీ పునర్విభజనపై భిన్న స్వరాలు, విస్తృత చర్చలు

హైదరాబాద్ నగరం భారతదేశ పట్టణ వికాస చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రాజ్యాంగానంతర కాలంలో ఒక ప్రాంతీయ రాజధానిగా ప్రారంభమైన ఈ నగరం, కాలక్రమేణా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మెట్రోపాలిటన్ నగరంగా రూపాంతరం చెందింది. జనాభా విస్తరణ, వలసల పెరుగుదల, సమాచార సాంకేతిక రంగ విప్లవం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి వంటి అంశాలు హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చేశాయి. ఈ విస్తరణతో పాటు నగర పాలన ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంశం కేవలం పరిపాలనా చర్యగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను నిర్ణయించే కీలక అంశంగా మారింది. హైదరాబాద్ మున్సిపల్ పాలన చరిత్రను పరిశీలిస్తే, 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ఏర్పడినప్పటి నుంచి నగరం అనేక దశల్లో విస్తరించింది. అప్పట్లో నగర విస్తీర్ణం సుమారు 175 చదరపు కిలోమీటర్లు కాగా, జనాభా 12 నుంచి 15 లక్షల మధ్యే ఉండేది. పరిమిత పరిధిలో పరిపాలన సాగిన ఆ దశలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నగర సమస్యలపై పట్టు ఉండేది. కానీ 1990ల తరువాత హైదరాబాద్ ఐటీ హబ్‌గా ఎదగడం ప్రారంభమైనప్పటి నుంచి నగర ముఖచిత్రం వేగంగా మారింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి ప్రాంతాలు ప్రపంచ స్థాయి కార్పొరేట్ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. ఈ వేగవంతమైన విస్తరణకు పరిపాలనా రూపం కల్పించాల్సిన అవసరంతో 2007లో అప్పటి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చుట్టుపక్కల ఉన్న 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయతీలతో విలీనం చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఈ విలీనంతో నగర విస్తీర్ణం సుమారు 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అప్పటి అంచనాల ప్రకారం జనాభా 75 లక్షలకు పైగా చేరింది. పట్టణ ప్రణాళికను సమగ్రంగా అమలు చేయడం, మౌలిక వసతుల అభివృద్ధిని ఒకే పాలనా పరిధిలో సమన్వయం చేయడం ఈ విలీనానికి ప్రధాన ఉద్దేశంగా ప్రకటించారు. అయితే, విస్తీర్ణం పెరిగిన కొద్దీ పరిపాలనా అసమానతలు కూడా స్పష్టమయ్యాయి. కొన్ని ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని ప్రాంతాలు మౌలిక వసతుల కొరతతోనే కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2016లో జీహెచ్‌ఎంసీలో మరోసారి డీలిమిటేషన్ చేపట్టి, అప్పటివరకు ఉన్న 72 డివిజన్లను 150 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డుకు సగటున 40 నుంచి 50 వేల జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఆ సమయంలో ఈ నిర్ణయం పరిపాలనా సమర్థతకు దోహదపడుతుందని భావించారు. కానీ గణాంకాలు చెబుతున్న వాస్తవం మరోలా ఉంది. 2011 జనగణన ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ జనాభా సుమారు 77 లక్షలు. అయితే పట్టణాభివృద్ధి శాఖ, నగర ప్రణాళిక సంస్థల తాజా అంచనాల ప్రకారం 2024--25 నాటికి ఈ సంఖ్య కోటిన్నరకు చేరింది. కొన్ని అంచనాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 800 నుంచి 1000 మంది వలస దారులు స్థిరపడు తున్నారు. ఐటీ, నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ వలసల ప్రభావంతో కొన్ని వార్డుల్లో జనాభా లక్ష నుంచి లక్షన్నర దాటింది. జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 30 వేల నుంచి 35 వేల వరకు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 2016 డీలిమిటేషన్ లక్ష్యాలు చాలావరకు నిర్వీర్య మయ్యాయి. ఒక్కో కార్పొరేటర్ పరిధిలో జనాభా విపరీతంగా పెరగడంతో ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పర్యవేక్షణ కష్టమైంది. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక అంశాలపై ఫిర్యాదులు పెరిగినా, వాటిని సమయానికి పరిష్కరించే సామర్థ్యం పరిమితమైంది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మౌలిక సూత్రమే ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ పునర్విభజన లేదా తాజా డీలిమిటేషన్ అవసరం తెరపైకి వచ్చింది. డీలిమిటేషన్ అంటే కేవలం వార్డుల సంఖ్య పెంచడం కాదు. జనాభా సమతుల్యత, భౌగోళిక సౌలభ్యం, సామాజిక అనుసంధానం, రహదారి నెట్‌వర్క్ సహజ హద్దులు వంటి అంశాల ఆధారంగా పరిపాలనా సరిహద్దులను పునః రూపకల్పన చేయడం. దీని ప్రధాన ఉద్దేశం ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం. డీలిమిటేషన్ ప్రయోజనాలు అనేకం. చిన్న వార్డులు ఏర్పడితే ప్రజా ప్రతినిధికి తన పరిధిలోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పగలుగుతారు. అధికార యంత్రాంగానికి కూడా పనిభారం సమంగా పంచ బడుతుంది. వార్డు స్థాయి కమిటీలు సమర్థంగా పనిచేసే అవకాశం ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరాల ఆధారంగా సముచితంగా జరిగే వీలుంటుంది. ముఖ్యంగా పట్టణ పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం పెరుగుతుంది. అయితే డీలిమిటేషన్‌కు లోపాలు కూడా ఉన్నాయి. హద్దుల పునర్విభజన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగితే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. కొన్ని కాలనీలు సామాజికంగా ఒకటిగా ఉన్నప్పటికీ వేర్వేరు వార్డుల్లోకి చీలిపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. ప్రజలకు తమ కార్పొరేటర్ ఎవరో తెలియని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అదనంగా, కొత్త వార్డుల ఏర్పాటుతో పరిపాలనా వ్యయాలు పెరుగుతాయి. సిబ్బంది నియామకాలు, కార్యాలయాలు, మౌలిక వసతుల ఏర్పాటు కోసం అదనపు ఖర్చు అవసరం అవుతుంది. ఈ అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అధికార పార్టీల నేతలు డీలిమిటేషన్‌ను పరిపాలనా అవసరంగా చిత్రీకరిస్తూ, నగర అభివృద్ధికి ఇది తప్పనిసరి అంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పరిపాలనా యూనిట్లు మారాల్సిందేనని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు డీలిమిటేషన్ వెనుక రాజకీయ లెక్కలున్నాయంటూ ఆరోపిస్తున్నాయి. వార్డుల హద్దుల మార్పుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమే దీనికి కారణమని వారు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తమ బలాన్ని తగ్గించేలా హద్దులు మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. నగరానికి చెందిన కొంతమంది సీనియర్ రాజకీయ నేతలు మాత్రం డీలిమిటేషన్ అవసరమేనని అంగీకరిస్తూనే, దాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. జనాభా గణాంకాలు, భౌగోళిక అంశాలు, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జరిగే పునర్విభజన నగర పాలనను మరింత గందరగోళానికి గురి చేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజలతో సంప్రదింపులు, అభ్యంతరాల స్వీకరణ, నిపుణుల సూచనలు వంటి ప్రక్రియలు లేకుండా డీలిమిటేషన్ చేస్తే న్యాయపరమైన వివాదాలు తప్పవని అభిప్రాయ పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ పునర్విభజన అంశాన్ని విస్తృతంగా పరిశీలిస్తే, ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల వరకే పరిమితం కాదని స్పష్టమవుతుంది. నగర ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య బలోపేతం వంటి అంశాలతో ఇది ముడిపడి ఉంది. ప్రపంచంలోని ఇతర మెట్రో నగరాల అనుభవాలు చూస్తే, పరిపాలనా యూనిట్లను కాలానుగుణంగా సవరించుకుంటూ వెళ్లిన నగరాలే స్థిరమైన అభివృద్ధిని సాధించాయి. హైదరాబాద్ లాంటి వేగంగా విస్తరిస్తున్న నగరానికి డీలిమిటేషన్ ఒక అవసరం. కానీ అది ప్రజా హితం కేంద్రంగా, పారదర్శకంగా, శాస్త్రీయంగా జరగాలి. కేవలం సంఖ్యల మార్పుతో కాకుండా, డిజిటల్ గవర్నెన్స్, జియో-మ్యాపింగ్ ఆధారిత సేవలు, ప్రజల భాగస్వామ్యం వంటి సంస్కరణలతో అనుసంధానించి నప్పుడే పునర్విభజనకు అర్థం ఉంటుంది. లేకపోతే, హద్దులు మారినా సమస్యలు అదే స్థాయిలో కొనసాగుతాయి. మొత్తంగా చెప్పాలంటే, జీహెచ్‌ఎంసీ పునర్విభజన హైదరాబాద్ నగర భవిష్యత్తును నిర్దేశించే కీలక మలుపు. ఇది పరిపాలనా సమర్థతకు దోహద పడాలంటే రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా అమలు కావాలి. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి తగిన పరిపాలనా రూపాన్ని ఇవ్వడమే ఈ ప్రక్రియ యొక్క నిజమైన లక్ష్యంగా ఉండాలి. అప్పుడు మాత్రమే జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్ నగరాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# స్థానిక ప్రజాస్వామ్య పరీక్ష : మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల పాత్ర

## కుర్చీల కేటాయింపుతో కదిలిన రాజకీయాలు

పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మరో నిర్ణాయక దశను దాటింది. ఓటరు జాబితా తుదిరూపు దాల్చిన తర్వాత తాజాగా మున్సిపల్ శాఖ రిజర్వేషన్లను పూర్తిగా ఖరారు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికల వాతావరణంలోకి ప్రవేశించాయి. రాష్ట్రంలో ఉన్న 131 పట్టణ స్థానిక సంస్థలు-10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు-అన్నింటికీ మేయర్, చైర్పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిల్లో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నిర్ణయాలు కేవలం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియగానే కాకుండా, రాబోయే రాజకీయ సమీకరణలకు దిశానిర్దేశం చేసే అంశంగా మారాయి. ముఖ్యంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలు, మహిళలకు పెద్ద ఎత్తున చైర్పర్సన్, మేయర్ స్థానాల కేటాయింపు, 'డెడికేటెడ్ కమిషన్ల నివేదిక ఆధారంగా సంఖ్యల నిర్ణయం-ఈ మూడు అంశాలు ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా మార్చాయి. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో గత అనుభవాలను పరిశీలిస్తే, రిజర్వేషన్ల అంశమే అత్యంత వివాదాస్పదంగా మారిన సందర్భాలు అనేకం. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై న్యాయస్థానాల జోక్యం కారణంగా గతంలో ఎన్నికలు వాయిదా పడిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ప్రత్యేకంగా 'డెడికేటెడ్ కమిషన్లను ఏర్పాటు చేసి, జనాభా గణాంకాలు, సామాజిక--ఆర్థిక పరిస్థితులు, పట్టణ ప్రాంతాల్లో వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయించింది. ఆ నివేదిక ఆధారంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ ఖరారు చేయడం ద్వారా ప్రభుత్వం ఒకవైపు సామాజిక న్యాయాన్ని ప్రతిపాదిస్తూనే, మరోవైపు న్యాయపరమైన అడ్డంకులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ నిర్ణయం ఆ అసమతుల్యతను సరిచేసే దిశగా కీలక అడుగుగా భావించ బడుతోంది. మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలుస్తోంది. మొత్తం మున్సిపాలిటీల్లో 60 చైర్పర్సన్ స్థానాలు, కార్పొరేషన్లలో 5 మేయర్ స్థానాలు మహిళలకు కేటాయించ బడటం పట్టణ పాలనలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడాలి. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళా రిజర్వేషన్లు విస్తృత ప్రభావం చూపిన నేపథ్యం ఉంది. అదే తరహాలో పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెరగడం వల్ల పాలనలో కొత్త దృక్పథం, ప్రజా సంబంధాలపై ఎక్కువ శ్రద్ధ, సామాజిక సమస్యల పట్ల సున్నితత్వం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే, మరోవైపు కుటుంబ రాజకీయాలు, ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా అధికారాన్ని వినియోగించే పరిస్థితులు కొనసాగు తాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందన్న వాదనకు ఈ నిర్ణయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ సహా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్ కావడం వల్ల ఇప్పుడు రాజకీయ దృష్టి పూర్తిగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపైకి మళ్లింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా భావించ బడతాయి. హైదరాబాద్ నగరం రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక కేంద్రంగా ఉండటం వల్ల ఇక్కడి ఫలితాలు మిగతా ప్రాంతాలపై ప్రభావం చూపుతాయి. గత ఎన్నికల్లో జీహెచ్‌ఎంసీ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఈసారి కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట వంటి కార్పొరేషన్ల లోనూ పట్టణ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, యువత ఓటింగ్ తీరు కీలకంగా మారనుంది. ప్రభుత్వం ఆరు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ఎన్నికల నిర్వహణపై తన సంకల్పాన్ని స్పష్టంగా చాటింది. వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు కలెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు పంపించడంతో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు వేగవంత మయ్యాయి. కేబినెట్ భేటీ అనంతరం ఎవరికీ ఏ స్థానం అన్న స్పష్టత రావడంతో ఆశావహుల్లో కదలిక మొదలైంది. ఒకే పార్టీ టికెట్ కోసం పలువురు పోటీ పడుతున్న పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ, మహిళా రిజర్వేషన్ వచ్చిన స్థానాల్లో పోటీ తీవ్రంగా మారే సూచనలు ఉన్నాయి. ఇది పార్టీలకు అంతర్గత అసంతృప్తులను ఎదుర్కొనే పరిస్థితిని కూడా తెచ్చిపెట్టవచ్చు. ప్రభుత్వ వ్యూహాన్ని గమనిస్తే, ఈ ఎన్నికలను ఒక రకంగా ప్రజాభిప్రాయ సేకరణగా మలచు కోవాలన్న ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయాన్ని, మహిళా రిజర్వేషన్ల ద్వారా ప్రగతిశీల పాలనను ప్రతిబింబించేలా ప్రభుత్వం తన వాదనను నిర్మిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అమలు చేసిన అభివృద్ధి పనులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు ఓటర్లను ఎంతవరకు ఆకర్షిస్తాయన్నది ఫలితాల్లో తేలనుంది. మరో వైపు ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా చూస్తున్నాయి. పట్టణాల్లో పెరిగిన జీవన వ్యయం,



ఇంధన ధరలు, ఆస్తి పన్నులు, ట్రాఫిక్ సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రాలుగా చేసుకోవాలని భావిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియలో కొన్ని చోట్ల అసమతుల్యత ఉందన్న ఆరోపణలు, వార్డు పునర్విభజనలో రాజకీయ లాభనష్టాల కోణం ఉందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, స్థానిక సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యంగా చూస్తారని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. గణాంకాల పరంగా చూస్తే, 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలవడం వల్ల వేలాది మంది కొత్త నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేసే అవకాశం ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లతో కలిపి మొత్తం పట్టణ స్థానిక సంస్థల పాలనలో విస్తృత సామాజిక ప్రాతినిధ్యం కనిపించనుంది. ఇది స్థానిక సమస్యల పరిష్కారంలో విభిన్న వర్గాల స్వరాలు వినిపించే అవకాశాన్ని పెంచుతుంది. అయితే, అదే సమయంలో అనుభవం లేని నాయకత్వం వల్ల పరిపాలనా సామర్థ్యం తగ్గుతుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. దీనికి సమాధానం ఎన్నికల అనంతరం పాలనలోనే తేలనుంది. వచ్చే నెల రెండో వారంలోపే ఎన్నికలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రచారం మరింత ఉధృతం కానుంది. తక్కువ సమయంలో ఓటర్లను చేరుకోవడానికి పార్టీలన్నీ సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం, వార్డు స్థాయి సమావేశాలపై ఎక్కువగా ఆధారపడ నున్నాయి. యువత ఓటింగ్ శాతం పెరిగే అవకాశముండటంతో వారి సమస్యలు, ఆశలు కూడా ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారతాయి. పట్టణ ఓటర్లు కేవలం పార్టీ అనుబంధంతో కాకుండా, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే పరిస్థితి పెరుగుతోంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఇది సామాజిక న్యాయం, మహిళా సాధికారత, పట్టణ పాలనలో సమగ్రత అనే మూడు మూల స్తంభాలపై ఆధారపడి ముందుకు సాగుతున్న ప్రక్రియగా చూడాలి. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలనకే పరిమితం కాకుండా, రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే సూచనలు ఉన్నాయి. పట్టణ ఓటర్లు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయ దిశను ఎంతవరకు మార్చగలదన్నది త్వరలో తేలనుంది. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలే పునాది అన్న భావనను మరోసారి గుర్తుచేస్తూ, ఈ మున్సిపల్ ఎన్నికలు ఒక కీలక అధ్యాయంగా చరిత్రలో నమోదు కానున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


చురకలు

# సంపాదకీయం

## మేలురకం పోయే, నాసిరకం మిగిలే.. చందనం మార్కెట్ లో భారత్ కు ఏమైంది?

ఎర్ర చందనంపై 'పుష్ప'ల ప్రభావం ఓ రేంజ్ లో ఉందని అంటారు. ఇదే క్రమంలో చందన మార్కెట్ లో భారత ప్రాభవం కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం నియమించిన శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. దీనికి గల ప్రధాన కారణం ఈ వృక్షజాతిని విపరీతంగా నరికేయడమేనని అంటున్నారు. ఫలితంగా మేలురకం జాతులు అంతరించిపోతున్నాయని చెబుతున్నారు. అవును... దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో అత్యధికంగా పెరిగే చందనం మొక్కలను విపరీతంగా నరికేయడం వల్ల మేలురకం జన్యురకాలు అంతరించి, నాసిరకం జాతులు మిగిలినట్లు శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ వెల్లడించింది. ఒకవైపు సరఫరా తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ లో చందనానికి డిమాండ్ విపరీతంగా పెరిగిందని పేర్కొంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చందనం మార్కెట్ లో ఓ వెలుగు వెలిగిన భారత ప్రభావాన్ని పునరుద్ధరించాలంటే, మన ప్రభుత్వాలు జోక్యం చేసుకుని దేశంలో చందన మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా 70% మార్కెట్ వాటాను గుప్పిట్లో ఉంచుకున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. వాస్తవానికి ఒకప్పుడు ప్రధాన చందన తైలం ఉత్పత్తిదారుగా ఉన్న భారత్.. క్రమంగా భారీ దిగుమతిదారుగా మారింది. తాజా ఘణాంకాలు ఆ పరిస్థితిని క్లియర్ గా చూపిస్తున్నాయి. ఇందులో భాగంగా... 2023–24లో మనదేశం నుంచి 0.62 మిలియన్ డాలర్ల విలువైన చందనం ఎగుమతి జరిగితే దిగుమతులు మాత్రం 5.59 మిలియన్ డాలర్లు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా చందన మార్కెట్ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా... 2023లో 265.8 మిలియన్ డాలర్ల మేర ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 502.2 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఈ ఏడేళ్లలో 9.4% మేర వార్షిక వృద్ధిరేటు నమోదు చేస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. దేశంలో అమూల్యమైన ఈ వనరుపై దృష్టిసారించాలని చెబుతున్నారు! ఈ నేపథ్యంలో... కేంద్ర పర్యావరణ, అటవీశాఖ భారత అటవీచట్టం 1927ని సవరించి, పంట పొలాల్లో పెంచిన చందన మొక్కలను అటవీ ఉత్పత్తుల నుంచి తొలగించాలని.. ఆర్థిక సంస్థలు ఈ మొక్కల పెంపకానికి అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటు, బీమా సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు. ఇదే క్రమంలో... చందన మొక్కల పెంపకం కోసం సంస్థాగతంగా రుణ సౌకర్యం, ప్రోత్సాహకాలు, బీమా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర పర్యావరణం, అటవీ, ఆయుష్ మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకోవాలని.. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలయ్యేలా చూడాలని చెబుతున్నారు. వాస్తవానికి.. చందనం చెట్లు ప్రధానంగా కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో ఎక్కువగా పెరుగుతాయి. అయితే.. ఈ వనరుకున్న ప్రాధాన్యాన్ని గుర్తించకుండా విపరీతంగా కొట్టేయడంతో నాణ్యమైన జాతులన్నీ అంతరించిపోయి, నాసిరకం సరుకు మిగిలిపోయింది. ఈ లోపాన్ని అధిగమించాలంటే మళ్లీ మేలురకం మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. దీనికోసం ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో చాలా ప్రైవేటు సంస్థలు, సంఘాలు, రైతులు వాణిజ్యపరంగా పెద్దసంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టారు. దీనివల్ల పంటపొలాల్లో ఈ మొక్కల పెంపకం 30,000 హెక్టార్ల దాకా చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి రతన్ పి.వాటాల్ నేతృత్వంలో శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఇప్పుడున్న విధానాలు, న్యాయపరమైన నిబంధనావళిలో మార్పులు సూచిస్తూ సిఫార్సులు చేసింది.

## సాహితీ వేత్తలకు స్ఫూర్తి దాయకం...మడిపెల్లి భద్రయ్య రచనా వ్యాసంగం - జనవరి 17...మడిపెల్లి భద్రయ్య జయంతి



మడిపెల్లి భద్రయ్య తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక రచయిత, సమాజ సేవకుడు. ఆయన తన రచనలతో, ఉపాధ్యాయ వృత్తిలోని అంకిత భావంతో, తెలంగాణ ఉద్యమంలో చేసిన విశేష సేవలతో తెలుగు భాషా ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన జీవితం, రచనలు, సేవలు తెలుగు భాషాభివృద్ధికి, తెలంగాణ ప్రజాస్వామిక చైతన్యానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తాయి. మడిపెల్లి భద్రయ్య 1945, జనవరి 17న నిర్మల్ పట్టణంలో మడిపెల్లి వీరయ్య, గంగమ్మ దంపతులకు జన్మించారు. వీరయ్య స్వయంగా ఒక ప్రతిభావంతుడు, వేములవాడ రాజరాజేశ్వరునిపై సీసపద్యాల రూపంలో శతకాన్ని రచించారు. తన తండ్రి నుంచి భద్రయ్య పద్యాల ఆలాపనకు ప్రేరణ పొందారు. చిన్ననాటి నుంచే తెలుగుపై ఆయనకు ఉన్న ఆసక్తి అద్భుతమైనది. విద్యాభ్యాసంలో తెలుగులో ఉన్నత విద్యను అభ్యసించి, 1968లో బి.ఎ. పట్టాను పొందారు. 1963లో లక్షెట్టిపేట పాఠశాలలో ఉపాధ్యాయునిగా తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత భైంసా, దిలావర్‌పూర్, ఇచ్చోడ, ఉట్నూరు, ఆసిఫాబాద్ వంటి ప్రదేశాల్లో పని చేసి, 2001లో కుంటాల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అంకితభావం, విద్యార్థుల క్షేమం పట్ల చూపిన శ్రద్ధకు అనేక ప్రశంసలు లభించాయి. భద్రయ్య ఒక సాహితీ వేత్త మాత్రమే కాదు, సమాజానికి మార్గదర్శకులు కూడా. ఆయన రచనలు కేవలం సాహిత్య కళాత్మకతను మాత్రమే కాకుండా, ప్రజలలో చైతన్యం రేకెత్తించే సామర్థ్యాన్ని కలిగించాయి. ఆయన 1300 కంద పద్యాలను ఏకఛందంలో రచించారు. ఆయన రచనలలో దేశభక్తి, ఆధ్యాత్మికత, సామాజిక అంశాలు ప్రాధాన్యత కలిగినవి. ప్రధాన రచనలలో... శ్రీ షిర్డీ సాయి త్రిశతి, శ్రీ జ్ఞాన సరస్వతీస్తవం, శ్రీ సత్యసాయి స్తుతి, నిరసన గొంతుకలు (తెలంగాణ ఉద్యమ పాటలు), మన ఆదిలాబాద్ (జిల్లా సమగ్ర దర్శిని), శ్రీహరి లీలలు (పద్య. కావ్యం), శ్రీ శివలీలలు (ఏకఛంద చంపూ కావ్యం) మున్నగునవి. భద్రయ్య తొలి తెలంగాణ ఉద్యమంలో మరియు మలి తెలంగాణ ఉద్యమంలో కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తన రచనల ద్వారా ఉద్యమానికి మద్దతు తెలిపి, ప్రజలలో స్వాతంత్ర్య భావనను పెంపొందించారు. తెలంగాణ సంస్కృతిని, వ్యావహారిక భాషను ప్రపంచానికి తెలియ జేయడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది. భద్రయ్య సాహితీ సంస్థలను స్థాపించి ప్రాంతీయ సాహిత్య చైతన్యానికి దోహదపడ్డారు. 'ప్రత్యూష' అనే లిఖిత పత్రికను నడిపి పలు సాంఘిక అంశాలను ప్రజల్లో చర్చనీయాంశాలుగా మార్చారు. నాటక రంగంలో కూడా భద్రయ్య ప్రభావవంతమైన పాత్రలు పోషించారు. భద్రయ్యకు అనేక పురస్కారాలు లభించాయి...1983: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు,1988: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు, 1997: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు, 2011: తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, 2015: తెలంగాణ రాష్ట్ర అవతరణ పురస్కారం (ఉత్తమ సాహితీవేత్తగా), 2015: భారత కల్చరల్ అకాడమీ వారి కళాశిరోమణి అవార్డు. మడిపల్లి భద్రయ్య 18 సెప్టెంబర్ 2021న ఈ లోకం నుండి నిష్క్రమించారు. మడిపెల్లి భద్రయ్య ఒక ఉపాధ్యాయుడు, సాహితీవేత్తగా మాత్రమే కాకుండా, ఉద్యమకారుడిగా, ఆధ్యాత్మికవేత్తగా ఎన్నో రంగాలలో తన ప్రతిభను చాటారు. ఆయన జీవిత చరిత్ర తెలంగాణ ప్రజలకే కాకుండా, సమస్త భారతీయులకు స్ఫూర్తిదాయకం. భద్రయ్య రచనలు, విద్యారంగ సేవలు, ఉద్యమ చరిత్ర సాహిత్య ప్రియులకు చక్కని మార్గదర్శనం. ఆయన సాధించిన విజయాలు, సమాజానికి అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచి పోతాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు జ్యోతిబసు - నిబద్ధత కలిగిన నేత జ్యోతిబసు - జనవరి 17... జ్యోతిబసు వర్ధంతి




భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవహర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహరించారు.1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్ - జనవరి 17... ఎల్.వి. ప్రసాద్ జయంతి


భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకు డుగా, నటుడుగా సినీ నిఘంటువు లో తనకంటూ కొన్ని పేజిలు సృష్టిం చుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్ణ, తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహేబ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లోద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం','ద్రోహి','సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకా ల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్టులో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లోదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లోద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948),



మన దేశం (1949), సంసారం (1950), షావు కారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ణ దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు. ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## ఆంధ్ర ప్రదేశ్‌లో జనసంఘ్ వ్యవస్థాపక బాధ్యులు వి.రామారావు - జనవరి 17... దివంగత సిక్కిం గవర్నర్ వెంట్రప్రగడ రామారావు వర్ధంతి




వి.రామారావుగా సుపరిచితులైన వెంట్రప్రగడ రామారావు (12 డిసెంబర్ 1935 – 17 జనవరి 2016) నిబద్ధత కలిగిన రాజకీయ నేత. 1956లో భారతీయ జన సంఘ్‌లో 21 ఏళ్ల ప్రాయంలో 1956లో రామారావు జనసంఅబశ్రీశ్రీఘ్‌లో సభ్యునిగా చేరి, జాతీయ కార్యవర్గ సభ్యునిగా కొన్ని సంవత్సరాలు పని చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సంఘ్ విస్తరణకు కృషి చేశారు. జన సంఘ్ పేరుని 1980లో భారతీయ జనతాపార్టీగా మార్చగా, అనంత రం బీజేపీలో చేరారు. భార తీయ జనతా పార్టీ జాతీయ నాయకుడిగా ఎదిగి తన రాజకీయ జీవి తాన్ని ప్రారంభించి, వరుసగా నాలు గు సార్లు హైదరాబాద్ పట్ట భద్రుల నియోజకవర్గం నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి ఎన్నికయ్యారు. ఆయన తన చివరి టర్మ్‌లో కౌన్సిల్‌లో పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 1935 డిసెంబరు 12న ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారు పూడి మండలం వెంట్రప్రగడలో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి అప్పారావు హోమియో వైద్యుడు కావడంతో కొంత కాలం పాటు మండవల్లిలో ఉన్నారు. మచిలీ పట్నంలో గ్రాడ్యు యేషన్ పూర్తయ్యాక హైదరా బాద్ ఉస్మానియాలో ఎల్ఎల్‌బీ చేశారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాదిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. తమ కెరీర్ ప్రారంభంలో, ట్రేడ్ యూని యన్ కార్య క్రమాలలో చురుకుగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొ రేషన్, స్టేట్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్, సౌత్ సెంట్రల్ రైల్వేస్ వంటి అనేక రాష్ట్ర మరియు సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లు, కార్పొరేషన్‌ల ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్‌లకు అధ్యక్షు లుగా పని చేశారు. ఉస్మానియా యూని వర్సిటీ సెనేట్ మెంబర్‌గా కూడా ఉన్నారు. 1966, 1972, 1978లో మూడు పూర్తి పర్యా యాలు, శాసన మండలి సభ్యునిగా పని చేయగా, 1984లో పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎన్నికైన తర్వాత నాలుగవ సారి శాసన మండలి రద్దు చేయబడింది. 1956లో జన్‌సంఘ్‌లో చేరిన రామారావు ఎమర్జెన్సీ సమయంలో కూడా జైలు పాలయ్యారు. 1992 - 96 మధ్య రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు. సిక్కిం గవర్నర్‌గా భారత రాష్ట్ర పతిచే నియమించ బడ్డారు. అక్టో బర్ 25, 2002 నుండి అక్టోబర్ 25, 2007 వరకు సిక్కిం గవర్నర్‌గా పని చేశారు. పదవీ విరమణ తర్వాత హైదరాబాద్‌లో స్థిర పడ్డారు. రామారావు దీర్ఘకాలంగా అనా రోగ్యంతో 2016, 17 జనవరిన చికిత్స పొందుతూ మరణించారు.


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు



# శాశ్వత కల సాకారం..!

కొత్తగూడెం : సింగరేణిలో బదిలీ వర్కర్ల ఎదురుచూపులు ఎట్టకేలకు ఫలించాయి. వీరిని జనరల్ అసిస్టెంట్లుగా గుర్తిస్తూ సర్వీసును యాజమాన్యం క్రమబద్ధీకరించింది. ఇప్పటివరకు తాత్కాలిక ఉద్యోగులుగా కొనసాగిన బదిలీ వర్కర్లు ఇకపై శాశ్వత ఉద్యోగులుగా మారారు. ఒక సంవత్సరంలో భూగర్భ గనుల్లో 190 రోజులు, గని బయట పలుచోట్లు 240 రోజులు విధులు నిర్వర్తిస్తే చట్టపరంగా ఆయా ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి. ఈమేరకు పలువురి సర్వీసును సింగరేణి యాజమాన్యం ఇటీవల క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి వ్యాప్తంగా 1,258 మంది జనరల్ మజ్దూర్లు జనరల్ అసిస్టెంట్లుగా నియమితులయ్యారు. వీరిలో ఖమ్మం, భద్రాద్రి



జిల్లాలకు చెందినవారు 66 మంది ఉన్నారు. ఇకనుంచి ఏ సంవత్సరంలోనైనా భూగర్భ గనుల్లో 190 రోజులు, గని బయట పలుచోట్లు 240 రోజులు విధులు నిర్వర్తిస్తే సదరు బదిలీ వర్కర్లు జనరల్ అసిస్టెంట్లుగా మారేలా నిర్మాణాత్మక సమావేశాల్లో ఒప్పందం కుదిరిందని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఉద్యోగ భద్రతతో పాటు మెరుగైన సదుపాయాలు

బదిలీ వర్కర్ అనేది సింగరేణిలో అన్నింటికన్నా ప్రాథమిక స్థాయి ఉద్యోగం. దీని నుంచి జనరల్ అసిస్టెంట్లుగా మారిన వారికి ఉద్యోగ భద్రత ఉంటుంది. ఉద్యోగం శాశ్వతమవటంతో కేటగిరీ-1 వేతనాలు వర్తిస్తాయి. అలవెన్సులు పెరుగుతాయి. క్వార్టర్ల సదుపాయం లభిస్తుంది. విద్యార్హతలు, నైపుణ్యాలతో అంతర్గత నియామకాల్లో ఉద్యోగోన్నతులు, సెలవులు, లీవ్ ట్రావెలింగ్ కన్సెషన్ (ఎల్‌టీసీ), లాంగ్ లీవ్ ట్రావెలింగ్ కన్సెషన్ (ఎల్‌ఎల్‌టీసీ) పొందేందుకు అర్హత సాధిస్తారు.

# ఆనవాళ్లు గుర్తించేలా.. ఆకృతులు మైమరిపించేలా..

నేలకొండపల్లి బౌద్ధమహాస్తూపం వద్ద క్రీ.శ. 2వ శతాబ్దం నాటి బౌద్ధభిక్షువుల విహారాలను అభివృద్ధి చేసే దిశగా పురావస్తుశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహాస్తూపం వద్ద 50ఏళ్ల క్రితమే తవ్వకాలు చేపట్టారు. అప్పట్లోనే బౌద్ధ విహారాలు, ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినల కాలం నాటి మృణ్మయ పాత్రలు, పూసలు, నాణేలను గుర్తించారు. గార్లగడ్డ వద్ద విగ్రహాల తయారీ కేంద్రం ఉన్నట్లు నిర్ధారించారు. నిదానం కత్తువ వద్ద విలువైన పంచలోహ బుద్ధుని విగ్రహం ఓ జాలరికి దొరికింది. వీటిని హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో భద్రపరిచారు.

ఆసియాలో అతిపెద్దదైన ఈ బౌద్ధమహాస్తూపం అభివృద్ధిపై ప్రభుత్వం తాజాగా బృహత్తర ప్రణాళిక రూపొందించింది. సుమారు రూ.2 కోట్ల పనులను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో చేపట్టనుంది.

50 ఏళ్ల అనంతరం మళ్లీ తవ్వకాలు

పురావస్తుశాఖ అధికారులు భూగర్భంలోని బౌద్ధ భిక్షువుల వసతిగృహాలు, విహారాలను 50ఏళ్ల తరువాత మళ్లీ గుర్తించే పనులు చేపట్టారు. నెల రోజులుగా సాగుతున్న పనుల్లో విహారాలు, వసతిగృహాల పునాదులను గుర్తించారు. కొన్ని గోడలకు మూడు వరుసల ఇటుకలు, మరికొన్ని గోడలకు చివరి దశ పునాదిలో ఒక్క వరుస ఇటుక గోడలు మాత్రమే మిగిలాయి. వీటన్నింటినీ మార్కింగ్ చేసి అప్పుడు ఎలా ఉండేవో అదేమాదిరి ఆకృతికి తీసుకురానున్నారు. విహారం పునర్నిర్మాణం దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. శంఖువులు, పూసలు, రోలు, రుబ్బురాయి, భారీ మట్టికుండ, మట్టి



ప్రమిదలు, మట్టిపై బౌద్ధుని విగ్రహ చిత్రంలో చేయి భాగం లభ్యమయ్యాయి. వీటిని అధికారులు భద్రపరిచారు. ఇక్కడి పనుల్ని పురావస్తుశాఖ ఇంజనీరింగ్ డీడీ నర్సింగ్ యగ్ , టెక్నికల్ డీడీ రాములునాయక్ పర్యవేక్షిస్తున్నారు.

**భారీ విహారం చుట్టూ గదులు**

బౌద్ధ మహాస్తూపానికి తూర్పు దిశలో భారీ విహారం, దానిచుట్టూ గదులను గుర్తించారు. అప్పట్లో దీని నిర్మాణంలో 10ఐ17ఐ3 సైజు ఇటుకలు వాడారు. చతురస్రాకారంలో అడ్డువరుసలో సుమారు 14 గదులు, నిలువు వరుసలో 15 గదులు ఉన్నాయి. వీటి మధ్యలో పెద్ద విహారం (సమావేశ మందిరం), దీనికి ఓవైపు ప్రవేశమార్గం నిర్మించినట్లు అంచనా వేస్తున్నారు. సమావేశ మందిరం చుట్టూ పదకొండు గదులు ఉన్నాయి. సమావేశ మందిరానికి, బయటి గదులకు మధ్యలో నాలుగువైపులా హోమగుండాలు ఏర్పాటుచేసినట్లు సమాచారం. వీటికి అర్ధచంద్రాకారపు రాళ్లు అమర్చగా అవన్నీ అక్కడే ఉన్నాయి.

నేలకొండపల్లిలోని బౌద్ధ మహాస్తూపం వద్ద 50ఏళ్ల క్రితమే పురావస్తుశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. అప్పట్లో బయల్పడిన వాటిని పూర్వ ఆకృతుల్లోకి మార్చేందుకు డెబ్రింగ్ క్లియరింగ్ పనులు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బౌద్ధ విహారాన్ని పునర్నిర్మిస్తాం. – అర్జున్‌రావు, పురావస్తుశాఖ, డైరెక్టర్

# అనుమతుల్లేకున్నా నడిపిస్తున్నారు



హైదరాబాద్: నగరంలో అనుమతులు లేని ఆసుపత్రులు యథేచ్ఛగా నడిపించేస్తున్నారు. సరోగసీ, అక్రమంగా కిడ్నీల మార్పిడికి ఇవే కేంద్రంగా మారుతున్నాయి. తాజాగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా ఏకంగా 224 ఆసుపత్రులు అనుమతులు తీసుకోక పోవడం చూసి అధికారులే షాక్ తిన్నారు. వాటికి ఒకట్రెండు రోజుల్లో నోటీసులు ఇవ్వనున్నారు. తొలిసారి అనుమతులు తీసుకోని వాటికి రూ.50 వేల జరిమానా విధించనున్నారు. ఇప్పటికే ఒకసారి పట్టుబడి తాజా తనిఖీల్లో దొరికితే రూ.2 లక్షలు, మూడోసారి జాబితాలో ఉన్నవాటికి రూ.5 లక్షల జరిమానా విధించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల నగరంలోని పలు కాలనీలు, బస్తీలు అడ్డాగా ఇళ్లను అద్దెకు తీసుకొని అందులో అనుమతుల్లేని క్లినిక్‌లను నడిపిస్తున్నారు. ఎలాంటి వైద్య పట్టా లేకున్నా ఎవరైనా ఒక వైద్యుని వద్ద కొంతకాలం పనిచేసి ఆ అనుభవంతో క్లినిక్‌లు తెరుస్తున్నారు.

**నిరంతర పర్యవేక్షణతోనే అడ్డుకట్ట...**

నగరంలో వైద్యారోగ్య శాఖ అనుమతులున్న 3,200 చిన్నాపెద్దాసుపత్రులున్నాయి. ఇవికాకుండా మరో 224 ఆసుపత్రులకు ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు గుర్తించారు. త్వరలో వీటిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు.

ఆసుపత్రి లేదా క్లినిక్, నర్సింగ్‌హోం నడిపించాలంటే ఎంబీబీఎస్ డిగ్రీతో పాటు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు ప్రకారం వెద్యారోగ్యశాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి. అయితే కొందరు 20-50 పడకల ఆసుపత్రుల నుంచి క్లినిక్‌లు, డెంటల్, ఆయుష్ ఆసుపత్రులు, ఫిజియోథెరపీ కేంద్రాలు అనుమతులు లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. డయోగ్నోస్టిక్ సెంటర్లు సైతం నడిపిస్తున్నారు. వీటిలో తప్పనిసరిగా పీసీ పీఎన్‌డీటీ యాక్టు అమలు చేయాలి. తద్వారా లింగ నిర్ధారణ లాంటి పరీక్షలు నిషేధం. వీటికి సంబంధించి బోర్డులు, రికార్డులు నిర్వహణ తప్పనిసరి.

ఒకసారి క్లినిక్ లేదా ఆసుపత్రికి అనుమతులు తీసుకున్న తర్వాత ప్రతి అయిదేళ్లకొకసారి రెన్యువల్ చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. మందుల దుకాణాలు నిర్వహించే అనుమతులు లేకపోయినా ఈ క్లినిక్‌లకు అనుసంధానంగా వాటిని కొనసాగిస్తున్నారు. సర్వే ద్వారా అనుమతులు లేని వాటిని గుర్తించి భారీ ఎత్తున జరిమానాలు విధించడానికి వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది.

# పుర బరి.. బలవంతులపై గురి!



తాండూరు: జిల్లాలోని నాలుగు పురపాలిక ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా పోటీ చేసే అభ్యర్థుల విషయంలో ఇంకా రిజర్వేషన్ల ఖరారు కాలేదు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నేతలు మాత్రం అన్ని కేటగిరీల వారీగా అభ్యర్థులను సిద్ధ చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పోటీ చేయాలనుకుంటున్న వారిలో స్థానికంగా ప్రజాబలానికితోడు ఆర్థికంగా ఉన్న వారెవరు అనే విషయాన్ని అంతర్గత సమీక్షల్లో చర్చించుకుంటున్నారు. ఆ మేరకు అభ్యర్థుల వైపు మొగ్గు చూపేందుకు తొలి ప్రాధాన్యమిస్తున్నారు. ఇదే సమయంలో రిజర్వేషన్ల ప్రకారం ప్రత్యర్థి పార్టీ నుంచి బరిలో దిగేది ఎవరనే దానిపై మాట్లాడుకుంటున్నారు. మరో పక్క టికెట్ లభించకుంటే ప్రత్యర్థి పార్టీలోకి వెళ్లే వారు, రెబల్స్‌గా పోటీ చేసే వారూ ఉంటారనే విషయాల్లోనూ లోతుగా చర్చిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఇలాంటి అంశాలను నేతలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో కొన్నిచోట్ల పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. మరికొన్ని చోట్ల రెబల్స్ విజయం సాధించారు. దీంతో పుర ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటున్నారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల చర్చలు..**

తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి వారి పురపాలికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి బాధ్యతలు భుజాలపై వేసుకున్నారు. వికారాబాద్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తరపున ముఖ్య అనుచరులు కసరత్తు చేస్తున్నారు.


**భారాసలో మాజీ ఎమ్మెల్యేలు..**

తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, నరేందర్‌రెడ్డి ఎంపిక వ్యవహారాలు చూసుకుంటున్నారు. భారాస తరపున పోటీ చేసేవారు ప్రత్యర్థి కాంగ్రెస్‌కి దీటుగా ఉండేలా వెతుకుతున్నారు. గట్టి పోటీనిచ్చే వారికి టికెట్లు ఇవ్వాలని ఆయా నేతలు చర్చించుకుంటున్నారు.

**భాజపాలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ**

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు, వికారాబాద్, పరిగి పురపాలికల్లోని అభ్యర్థుల ఎంపికపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ మేరకు స్థానిక నేతలు వార్డుల వారీగా సూచించే అభ్యర్థుల పేర్లను పరిగణనలోకి తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కొండగల్‌పై దృష్టి సారిస్తున్నారు. **ఎంఐఎం నుంచి అసదుద్దీన్ సూచించిన వారే..** హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సూచించే అభ్యర్థులనే స్థానిక నేతలు ఖరారు చేయనున్నారు. మేరకు తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్‌లోని పార్టీ అధ్యక్షులు రిజర్వేషన్ కేటగిరీల వారీగా అభ్యర్థులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# ముప్పు ఉందని తెలిసినా తప్పులే



హైదరాబాద్ : చిత్రంలో కనిపిస్తున్న ప్రాంతం సురారం గ్రామంలోని శ్వాసవాయుపార్కు...కానీ పేరుకు భిన్నంగా ఇక్కడి వాతావరణం ఉంటుంది. పార్కు పరిసరాల్లో గడువు తీరిన ఔషధాలు, మున్సిపల్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడే కనిపిస్తున్నాయి. సమీప ప్రాంతాల్లోని క్లినిక్‌లు, గోదాములు, ఆసుపత్రుల నుంచి వ్యర్థాలన్నీ ఇక్కడికే వచ్చి చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగరవాసులు ఫిర్యాదు చేస్తే తప్ప జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిని తొలగించడం లేదు.

ఆటోనగర్ డంపింగ్‌యార్డును ఎత్తేసి ఏళ్లు గడుస్తున్నా ఇక్కడే ఇదే పరిస్థితి. సమీప పారిశ్రామిక ప్రాంతంలోని ఫార్మా పరిశ్రమల్లో గడువు తీరిన ఔషధాలను ఇక్కడే వేసున్నారు. ఈ రెండు ప్రాంతాలే కాదు నగరంలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి..ముప్పును గుర్తించకుండా తప్పు చేస్తున్నారు. మూటగట్టి మూసీ పరీవాహక ప్రాంతాల్లో గుట్టల కొద్దీ పారేస్తున్నారు.

కాలం చెల్లిన మందులు, ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థాలు కొత్త సమస్యలను తీసుకొస్తున్నాయ్.. వీటిని సక్రమంగా నిర్వీర్యం చేయకపోవడంతో ప్రజారోగ్యం, పర్యావరణం దెబ్బతింటోంది. వ్యాపారులు, మందుల షాపులతో పాటు నగరవాసులు ఇళ్లలోనుంచి రకరకాల మాత్రలు, సిరప్‌లు, ఆయింట్‌మెంట్లు మున్సిపాలిటీ చెత్త డబ్బాలు, మురుగు కాల్వల్లో పడేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు రోగుల నుంచి వెలువడే ఫ్లూయిడ్‌లను శుద్ధి చేయకుండానే డ్రైనేజీలోకి వదులుతున్నారు. 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో నిర్వీర్యం చేయాల్సిన మందులు డంపింగ్‌యార్డుల్లో కుళ్లిపోతే అనేక దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

**వచ్చే సమస్యలివి..**

యాంటీ బయోటిక్స్ మందులు కుళ్లిపోవడంతో ఆ వ్యర్థాల నుంచి కొత్త రకం బ్యాక్టీరియా పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది. కొత్తరకం జబ్బులు సోకడంతో పాటు సామర్థ్యం కలిగిన యాంటీ బయోటిక్స్ వాడినా ప్రయోజనం ఉండదు. మందుల్లోని రసాయనాలు నేలలో కలిసి, వర్షాలతో కరిగిపోయి నదులు, చెరువులు, భూగర్భ జలాల్లో చేరుతాయి. ఇది నీటి కాలుష్యానికి దారి తీస్తుంది. జలచరాలకు హానికరంగా మారుతుంది.

యాంటీబయోటిక్స్ కాలుష్యంతో బ్యాక్టీరియాలో నిరోధకత పెరుగుతుంది.

నివారించేదెలా..?

ఫార్మసీ కంపెనీలు లేదా ప్రభుత్వం డ్రగ్ టేక్ బ్యాక్ కార్యక్రమాలకు ప్రోత్సాహాన్ని అందించాలి. డ్రగ్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటుచేసి గడువు తీరిన మందులను అక్కడ ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేయాలి.

మందులు కొనే సమయంలో అవసరమైన వాటినే కొనాలి.

కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

ఇంట్లో ఉన్న మందులు లేదా ఔషధాలను పారేయాలనుకుంటే వైద్యుడి లేదా ఫార్మసిస్ట్ సలహా తీసుకోవాలి.

# పదేళ్ల తరువాత పలకరించే'నిధి'!

కొత్తగూడెం : అటకెక్కిన బ్యాంకు ఖాతాపుస్తకం పలకరించింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సంయుక్తంగా చేపట్టిన 'మీ డబ్బు- మీ హక్కు' కార్యక్రమం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సత్ఫలితాలు ఇస్తోంది. చిరునామా మారటం, వారసుల వివరాలు సరిగ్గా లేకపోవటం.. ఇలా కారణమేదైనా పదేళ్లకు పైగా బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లను పొందటానికి చక్కని అవకాశం కల్పిస్తోంది.

**1,669 ఖాతాలు.. రూ.12.90కోట్లు**

కాలంతో పాటు పరుగులు పెట్టే జీవితంలో అనేక విషయాలను వదిలేస్తుంటాం. కష్టపడి దాచుకున్న సొమ్ము సైతం కొన్నిసార్లు బ్యాంకు ఖాతాల్లో మూలుగుతుంటుంది. ఉభయ జిల్లాల్లో పదేళ్లకుపైగా క్లెయిమ్ చేయని 4.80లక్షల బ్యాంకు ఖాతాల్లో రూ.101.83కోట్లు పేరుకుపోయాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో ఉభయ జిల్లాల్లో 1,669 ఖాతాల్లోని రూ.12.90కోట్లను వారి వారసులు పొందటం విశేషం. క్లెయిమ్ చేసుకోని ఖాతాల సంఖ్య ఇంకా భారీగా ఉన్నప్పటికీ.. కేంద్రం కల్పించిన ఈ అవకాశం వందలాది కుటుంబా



లకు ఆర్థికంగా ఆసరాగా నిలిచింది.

**ఉద్గమ్ పోర్టల్ ద్వారా..**

ఆర్‌బీఐ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్- గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్(ఉద్గమ్) పేరిట కేంద్రం పోర్టల్ ఏర్పాటుచేసింది. ఇందులో వివరాలు నమోదుచేయటం ద్వారా అన్‌క్లెయిమ్డ్ ఖాతాదారుల వివరాలు పొందవచ్చు. సదరు బ్యాంకుల్లో ఖాతాదారులకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించి సొమ్మును క్లెయిమ్ చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం 2025 డిసెంబర్ 31 వరకు ఆరు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆయా జిల్లాల్లోని అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్లు అన్‌క్లెయిమ్డ్ ఖాతాలపై ప్రజల్లో అవగాహన కల్పించటంతో పాటు డబ్బులు పొందే విధానాన్ని వివరించారు.

ఎవరి కష్టార్జితం వారిని వదిలి ఎక్కడికీ పోదనే నమ్మకాన్ని ఈకార్యక్రమం నిరూపించింది. ఎవరైనా తమ పాత ఖాతాల వివరాలు సరిచూసుకోకపోతే వెంటనే స్పందించండి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మీ కుటుంబానికి చెందాల్సిన సొమ్మును క్లెయిమ్ చేసుకోండి. ఈప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

– రాంరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, భద్రాద్రి కొత్తగూడెం

# నీరుంది.. పారనంది!

నారాయణఖేడ్ : రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు మంజీరా నది పరీవాహకంలో నిర్మించిన సాగు నీటి పథకాలు దశాబ్దాలుగా నిరుపయోగంగా మారాయి. ఫలితంగా అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి మనూరు మండలంలో సుమారు రూ.38 కోట్ల వ్యయంతో 6,500 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో అయిదు ఎత్తిపోతల పథకాలు గతంలో నిర్మించారు. వీటిలో ఏ ఒక్కటీ ప్రస్తుతం వినియోగంలో లేదు. పథకాలు నిరుపయోగంగా మారడంతో పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఆయకట్టు బీడుగానే ఉంటోంది.

సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో..

పుల్కల్ మండలంలో 35 ఏళ్ల కిందట సింగూరు ప్రాజెక్టు నిర్మించడంతో బ్యాక్ వాటర్ కారణంగా ఉమ్మడి మనూరు మండలంలో వేలాది ఎకరాల సారవంతమైన భూములు నీటిలో మునిగిపోయాయి. ఉపాధి లేక రైతులు, కూలీలు రోడ్డున పడ్డారు. మునగకుంటా ఉన్న భూములకు నీటి ఆధారం కరవైంది. అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తమ సమస్యను విన్నవించారు. అప్పటి ప్రభుత్వం స్పందించి మంజీరా నది పరీవాహకంలో పుల్‌కుర్తి, షాపూర్, కారాముంగి, తోర్నాల్ శివారుల్లో ఎత్తిపోతల పథకాలు నిర్మించింది. 3380 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు.

ఇకనైనా దృష్టి సారించాలి

ఉమ్మడి మనూరు మండలంలో వృథగా ఉన్న కారాముంగి, పుల్‌కుర్తి, తోర్నాల్, షాపూర్ ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు 2017లో ప్రభుత్వం రూ.7.19 కోట్లు మంజూరు చేసింది. అక్కడక్కడా మరమ్మతులు చేపట్టారు. పనుల్లో నాణ్యత పాటించక పోవడంతో లీకేజీలు షరామామూలుగానే మారాయి. దీంతో మళ్లీ పథకాలు నీరందించలేని స్థితికి చేరాయి. బోరంచ పథకానికి మరమ్మతులు చేపట్టాలని ఏడాది క్రితం రూ. 6.89 కోట్లు మంజూరయ్యాయి. ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసినా.. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ నీటి పథకాలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

చుక్క నీరైనా పారకుండానే..

నాలుగు ఎత్తిపోతల పథకాలు వినియోగంలోకి తీసుకురాకుండానే ప్రభుత్వం 2009లో మనూరు మండల పరిధిలోని బోరంచలో మరో ఎత్తిపోతల పథకం రూ.20 కోట్లతో నిర్మించి.. 2900 ఎకరాలకు నీరందించాలని సంకల్పించింది. 2013లో పనుల పూర్తి చేయగా.. అప్పటి ప్రజాప్రతినిధులు నీటి పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన తొలిరోజే లీకేజీలు ఏర్పడటంతో మోటార్లన్నీ మునిగిపోయాయి. మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరైనా.. ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. ఒక్క ఎకరానికైనా నీరు పారకుండానే పథకం నిరుపయోగంగా మారింది.

చురకలు



## ఆస్తులు.. అప్పులు.. పంచేదెలా?

హైదరాబాద్: జీహెచ్ఎంసీని మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు చేస్తే.. ఆస్తులు, అప్పులను ఆయా సంస్థలకు ఎలా పంచాలనే విషయమై జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. నగరంలో జీహెచ్ఎంసీకి చెందిన ఆస్తులు ఎక్కడెక్కడున్నాయి, వాటి పరిస్థితి ఏంటి, బల్దియా నెత్తిపై ఉన్న అప్పులు, వాటికి ప్రతి నెలా చెల్లిస్తోన్న కిస్తీల గురించి ఉన్నతస్థాయిలో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా.. అప్పులు, ఆస్తులను సమానంగా పంచుకోవాల్సిన పరిస్థితే వస్తే.. అతి తక్కువ ఆదాయ వనరులున్న మల్కాజిగిరి మహానగరపాలక సంస్థకు ఏ విధంగా న్యాయం చేస్తారని సంబంధిత అధికారులు ప్రశ్న లేవనెత్తారు. ఆస్తిపన్ను నామమాత్రంగా వచ్చే



ప్రాంతాలతో గ్రేటర్ మల్కాజిగిరిని ఏర్పాటు చేస్తున్నారని.. ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తతంగాన్ని చూస్తే.. డివిజన్ల పునర్విభజన, సర్కిళ్లు, జోన్ల పునర్వ్యవస్థీకరణ చకచకా పూర్తయినప్పటికీ.. ఆస్తులు, అప్పులు, నిధుల పంపకాలు మాత్రం తేలిగ్గా పూర్తయ్యేట్లు కనిపించడం లేదు.ప్రభుత్వం కలుగజేసుకుని.. ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తేనే సమస్య కొలిక్కి వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**సిద్ధమవుతున్న జాబితా..**

ఎస్టేట్స్ విభాగం ఆధ్వర్యంలోని మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్సులను జోన్ల వారీగా విభజించి.. మూడు నగరపాలక సంస్థలకు తగ్గట్టు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు.విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని ఆస్తిపన్ను వివరాలను జీహెచ్ఎంసీ సమాచారంతో అనుసంధానం చేసి.. జోన్లవారీగా విభజించే ప్రక్రియ పురోగతిలో ఉంది. మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధి నుంచి ఏడాదికి రూ.550 కోట్ల ఆస్తిపన్ను వసూలయ్యే అవకాశం ఉందని అధికారుల అంచనా.

## ధరలు పెంచి.. స్టిక్కర్లు అంటించి

సిరిసిల్ల : రెండేళ్ల కాలపరిమితితో మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతులు పొందిన వారికి పంచాయతీ ఎన్నికలతో తొలి అమ్మకాల్లోనే జోరు పెరిగింది. అదే ఊపులో మరో అడుగు ముందుకేశారు. లైసెన్సు పొందిన మద్యం దుకాణదారులు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో కాలనీలను పంచుకున్నారు. ఇలా.. వీరి పరిధిలో మద్యం గొలుసు దుకాణాలకు అక్కడి నుంచే కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టారు. దీనికోసం మద్యం సీసాలపై ఆ దుకాణం పేరుతో స్టిక్కర్లు అంటించి.. ధరలు పెంచి గొలుసు దుకాణదారులకు విక్రయిస్తారు. దీనికోసం లైసెన్సు దారులంతా సిండికేటుగా మారారు.

**ముడుపులు ముడితే కన్నెత్తి చూడరు**

కొత్తగా ప్రారంభమైన ప్రతి దుకాణానికి ఎక్సైజ్‌శాఖ ఒక రిజిస్టర్‌ను అందిస్తుంది. రోజువారీగా విక్రయాలు, నిల్వలు నమోదు చేయాలి. ఎక్సైజ్‌శాఖ అధికారులు ఈ రిజిస్టర్‌కు ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేశారు. బుక్‌స్టాల్‌లో రూ.50కి వచ్చే రిజిస్ట్రర్‌కు ఇంత భారీగా వసూలు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు ఇలా.. అందరి నెలవారీ మామూళ్ల మొత్తం రూ.11 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరిగాయి. దీనికి ఈ సారి గ్రామాల్లో గొలుసు దుకాణాలు పెరగడమూ.. వారి విక్రయాల జోలికి వెళ్లకుండా ఎక్కడికక్కడ సిండికేటు నిర్వాహకులు రెండు శాఖలను ముడుపులతో కళ్లు మూయిస్తున్నారు.

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో ఈ నెల 6న మద్యం గొలుసు దుకాణం నిర్వహణకు వేలం పాట జరిగింది. పాల్గొన్నవారిలో ఒకరు అత్యధికంగా రూ.3.57 లక్షలతో అవకాశం చేజిక్కించుకున్నారు. జిల్లాలో ఇలాంటివి చాలా జరిగాయి.

ఎల్లారెడ్డిపేట మండలంలో నాలుగు మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 500 గొలుసు దుకాణాలు వెలిశాయి. వీటిలో ఇటీవలే 150 కొత్తగా దుకాణాలు ఏర్పాటవడం గమనార్హం.




ఉమ్మడి జిల్లాలో 2012లో ఇలానే సిండికేటుతో రూ.కోట్ల అవినీతి వ్యవహారం బయటపడింది. అప్పుడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మద్యం సిండికేటుదారుల మధ్య సంబంధాలు వెలుగుచూశాయి. అనిశా అధికారులు జిల్లాలో మద్యం సిండికేటు దందాపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో 48 దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లలో రోజుకు సగటున రూ.2 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గొలుసు దుకాణాలకు విక్రయించే ఒక్కో మద్యం సీసాపై కంపెనీని బట్టి రూ.10 నుంచి రూ.30కి పెంచారు. దీనికి గొలుసు దుకాణాల దారులు మరో రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నారు. ఇదంతా ఎక్సైజ్, పోలీసుశాఖల కనుసన్నల్లోనే పకడ్బందీగా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

# వ్యాధులపై సమాచారం అందించాల్సిందే



హైదరాబాద్: ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చే రోగుల సమాచారం ఇక నుంచి తప్పకుండా వైద్యారోగ్యశాఖతో పంచుకోవాల్సిందే. ఓపీ, ఐపీతో పాటు ఐసీయూల్లో ఉన్న రోగుల సంఖ్య, ఇతర వివరాలను తప్పకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అందించాలి. ఏరోజుకారోజు ఈ వివరాలను ఒక ఫార్మట్ రూపంలో పంపాలి. ఈ మేరకు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నుంచి ఆదేశాలు అందాయి. వాస్తవానికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి ఈ వివరాలను తప్పకుండా ప్రభుత్వంతో పంచుకోవాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. హృద్రోగం, మలేరియా, డెంగీ, టీబీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక, అంటు వ్యాధుల సమాచారం ప్రభుత్వ దృష్టికి తేవడం ద్వారా ఆ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక రూపొందించడానికి అవకాశం ఉంటుంది. డెంగీ కేసులు పెరిగినప్పుడు కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వకపోవడంతో ఎన్ని కేసులున్నాయో తెలియడం లేదు. ఏ ప్రాంతం నుంచి కేసులు ఎక్కువ వస్తున్నాయో తెలిస్తే అక్కడ దోమల నియంత్రణకు జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం అలా జరగక పోవడంతో డెంగీ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నా సమస్య ఒకచోట.. మందుల మరోచోట అన్న చందంగా తయారైంది.

**గోప్యంగా రోగుల ఆరోగ్య వివరాలు**

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 3,200 అనుమతులు పొందిన చిన్నపాటి క్లినిక్‌ల నుంచి పెద్దాసుపత్రుల వరకు న్నాయి. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పకుండా రోజు వారీ సమాచారం ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ప్రైవేటు ఆసుపత్రులు అందించిన సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. కేవలం రోగాల నియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ తీసుకునే జాగ్రత్తల కోసమే వాడుకుంటుందని హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటి తెలిపారు.సమాచారం పంచుకోని ఆసుపత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం జరిమానా విధించడం లేదంటే ఆసుపత్రి అనుమతులు సైతం రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

## కరోనాతో నాంది.. నేరాలకు పునాది



హైదరాబాద్: శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు సైన్యంలో చేరాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. నగరానికి వచ్చి కొంతకాలం డ్రైవర్‌గా పనిచేశాడు. కొవిడ్ సమయంలో ఉద్యోగం కోల్పోవటంతో సంపాదనకోసం మిత్రుడి నుంచి గంజాయి కొని అధిక ధరకు అమ్మేవాడు. క్రమంగా ఏవోబీలోని ముఠాలతో పరిచయాలు పెంచుకుని 300 మందికి సరకు చేరవేసేంతగా ఎదిగాడు. ఇటీవల హెచ్‌న్యూ పోలీసులకు చిక్కాడు.బోడుప్పల్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి. కరోనా వేళ కొలువు పోగొట్టుకున్నాడు. లాక్‌డౌన్ ముగిశాక కిరాణం ప్రారంభించాడు. చాలీచాలని సంపాదన నుంచి బయటపడేందుకు మల్టీలెవల్ స్కీమ్‌లో చేరాడు. సభ్యులను చేర్పిస్తూ కమీషన్ తీసుకున్నాడు. రెండేళ్లుగా సైబర్ ముఠాలకు ఖాతాలు సమకూర్చుతూ రూ.లక్షలు సంపాదించాడు. కొద్దిరోజుల క్రితం అరెస్టయి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా మహమ్మారి ఎన్నో కుటుంబాలను వీధి పాల్జేసింది. ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దూరం చేసింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా, కొందరు తప్పటడుగులు వేశారు. డ్రగ్స్, సైబర్‌నేరాలు, మోసాల్లో భాగస్వాములుగా మారి జైలు పాలయ్యారు. బయటకొచ్చాక కొందరే తప్పులు సరిదిద్దుకున్నారు. అధికశాతం నేరాలనే వృత్తిగా మలచుకున్నారు. గతేడాది నగర పోలీసు కమిషనరేట్‌లో దొంగతనాలు, దోపిడీలు, డ్రగ్స్ సరఫరా, సైబర్ నేరాలపై 30,690 కేసులు నమోదయ్యాయి. వీటిలో 90% పాత నేరస్థులే ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించారు. 20%మంది కొవిడ్ వేళలో తొలిసారి నేరాలకు పాల్పడి పోలీసు రికార్డుల్లోకి చేరిన వారే కావటం గమనార్హం. అప్పటి సమస్యలను అధిగమించేందుకు నేరంచేసిన వీరు క్రమంగా ఆ మార్గంలో నడుస్తున్నట్టు అంగీకరించారు. ఇటీవల సంచలనం రేకెత్తించిన సినిమా పైరసీ సూత్రధారి ఇమంది రవి కొవిడ్‌ను అనువుగామలచుకున్నాడు. ఉచితంగా కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్ వీక్షించేందుకు ఐ బొమ్మను వేదికగా చేశాడు. పైరసీమాటున ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ నిర్వాహకులనుంచి వచ్చిన రూ.30 కోట్లలో రూ.21 కోట్లు 2019-21 మధ్య సంపాదించినట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధారించారు.

**మారాలన్నా.. మారకున్నారు**క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయిన కుర్రాడు ఏజెంట్‌గా మారాడు. క్రమంగా బుకీ అవతారమెత్తాడు. కరోనా కష్టాలతో ఇలా మారానంటూ చెప్పాడు. పోలీసుల కౌన్సెలింగ్‌లో మారతానంటూ ప్రమాణం చేసినా పలుమార్లు పట్టుబడుతున్నాడని ఓ పోలీసు అధికారి తెలిపారు. జేబు దొంగతనాలతో మొదలై ముఠాగా ఏర్పడి దోపిడీలు, బెదిరింపులకు పాల్పడుతున్న వారున్నారని తెలిపారు. నేరాలను వృత్తిగా మలచుకున్న వారిని బయట పడేయటం అనుకున్నంత తేలిక కాదని పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వెలిబుచ్చారు.

## పేదోడి కల.. మోసగాళ్ల వల



హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమార్కులు లబ్ధిదారులను మోసం చేస్తున్నారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో మాట్లాడతామని నమ్మిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు ముందుగా రూ.5వేలు ఇవ్వాలంటూ దండుకుంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టరేట్ల వద్ద కొన్నిరోజులుగా ఈ తంతు కొనసాగుతోంది. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న వారిలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. డబ్బు ఇచ్చాక రెండు రోజుల్లో ఓటీపీ వస్తుందని చెబుతున్నారు. బాధితులకు నమ్మకం కలిగేందుకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు పత్రాలను చూపిస్తున్నారు. డబ్బు ఇచ్చినా ఓటీపీ రాకపోవడంతో బాధితుల్లో కొందరు కలెక్టరేట్‌లో వాకబు చేస్తుండడంతో ఈ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామంటూ ఎవరికీ డబ్బులివ్వవద్దని అధికారులు చెబుతున్నారు.

**మంజూరు చేయిస్తాం.. రుణం ఇప్పిస్తాం..**

ఇందిరమ్మ ఇళ్లను వారం, పదిరోజుల్లో మంజూరు చేయిస్తాం. బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామంటూ కలెక్టర్ కార్యాలయాల వద్ద కొందరు వ్యక్తులు కాపుకాస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమం హాలు వెలుపల, క్యాంటిన్ వద్ద వీరుంటున్నారు. దరఖాస్తులు ఇచ్చిన వారితో మాటలు కలిపి తాము ఇక్కడే ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్నామని మాట కలుపుతున్నారు. ఒకట్రెండు నెలల్లో ఇళ్లు మంజూరవుతాయని, తొలి జాబితాలో మీ పేరు ఉండేలా చూస్తామని నమ్మిస్తున్నారు. ఆర్నెల్ల క్రితం యాభైమందికి ఇళ్లు ఇప్పించామని, బ్యాంక్ రుణం కూడా వచ్చిందని కొన్ని ఫొటోలు చూపిస్తున్నారు. వీరి మాటలను నమ్మిన బాధితులు నగదు ఇస్తున్నారు. జీపే చేస్తామంటే.. అధికారులకు డబ్బులే ఇవ్వాలంటూ నగదు తీసుకుంటున్నారు. ఇల్లు మంజూరైనట్టు ఓటీపీ వచ్చాక కలుసుకుందామని చెప్పి వెళ్లిపోతున్నారు.

**వాకబు చేస్తే.. ఫోన్లు స్విచ్ఛాఫ్..**

డబ్బులిచ్చిన వారికి ఓటీపీలు రాకపోవడంతో బాధితులు కలెక్టర్ కార్యాలయాలకు వస్తున్నారు. ప్రజావాణి కేంద్రం వద్ద వారి గురించి వాకబు చేస్తున్నారు. కాగా వారు అసలిక్కడ ఉద్యోగులేకాదు.. అని సిబ్బంది చెబుతున్నారు. బాధితులు వారికి ఫోన్లు చేయగా.. స్విచ్ఛాఫ్ వస్తున్నాయి. ఈ విషయాన్ని హౌసింగ్ అధికారులకు తెలపగా.. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. మూడు కలెక్టరేట్ల పరిధుల్లో వారానికి 70 నుంచి వంద మంది వరకు మోసపోతున్నారని రెవెన్యూ అధికారుల అంచనా. ఇకపై ప్రజావాణి హాల్ వద్ద ఎవరికీ డబ్బు చెల్లించవద్దంటూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు.

## అన్నదాతకు ఆదరవు.. అతివకు ఆర్థిక వనరు

రాచర్ల : జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జలు, గోధుమ, పప్పు దినుసులు వంటి పంటలు పండుతున్నాయి. ప్రతి సీజన్‌లో సాగు విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. సమృద్ధిగా సాగునీరు లభిస్తుండటంతో సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పంటల దిగుబడులను నిల్వ చేసుకునేందుకు తిప్పలు తప్పడం లేదు. నిల్వ ప్రదేశాలు కరవై ఆరుగాలం శ్రమను తక్కువ ధరలకే అమ్ముకుంటూ నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. గోదాంలు అందుబాటులోకి వస్తే కర్షకుల కష్టాలు తీరనున్నాయి. పంట ఉత్పత్తులేవైనా గోదాంలలో భద్రపరచుకుంటారు. ఆశించిన మంచి ధర పలికినప్పుడే విక్రయాలు జరిపి, లాభాలను ఆర్జిస్తారు. అలాగే మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం భారీగా ఆదాయం సమకూరనుంది.

జిల్లాలో ఉన్నవి అయిదు గోదాంలు

తంగళ్లపల్లి మండలంలో రెండు, ముస్తాబాద్ మండలంలో ఒకటి, కోనరావుపేట మండలంలో ఒకటి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఒకటి.. ఇలా గతంలో అయిదు ఐకేపీ గోదాంలను నిర్మించారు. వీటి ద్వారా ఏటా పంట సీజన్‌లను బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దె వస్తోంది. ఆ డబ్బులను గ్రామైక్య సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ గోదాములు గ్రామైక్య సంఘాలకు ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా పంట ఉత్పత్తుల కొనుగోలు సమయంలో ధాన్యం బస్తాలను నిల్వ చేయడం, గన్నీ సంచులు, టార్పాలిన్‌లు తదితర వాటిని భద్రపరిచేందుకు ఉ



పయోగపడుతున్నాయి. అయినప్పటికీ ఐకేపీ ఆధ్వర్యంలో ఉన్న గోదాంల సంఖ్య తక్కువే. ఇలాంటి గోదాములను ఊరికొకటి చొప్పున మరిన్ని నిర్మిస్తే అన్నదాతకు ఆదరవుగా నిలవడంతోపాటు అతివకు ఆర్థిక వనరుగా మారనున్నాయి.

**తొలుత మండలానికి ఒకటి..**

ఊరూరా గోదాములను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇది కార్యరూపం దాల్చితే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో వీటిని నిర్మించనున్నారు. వాటిని అద్దెకు ఇవ్వడం వల్ల మహిళా సంఘాలకు ఆదాయం చేకూరనుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా 444 చదరపు గజాల స్థలంలో వంద టన్నుల నిల్వ సామర్థ్యం ఉండేలా వీటిని నిర్మించాలని సర్కారు నిర్దేశించింది. ఒక్కో దానికి రూ.30 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా వేములవాడ అర్బన్, తంగళ్లపల్లిలో ఒక్కోటి గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ మాసం తర్వాత జిల్లాలోని ప్రతి మండలానికి ఒకటి చొప్పున నిర్మించాలని సంకల్పించారు. మున్ముందు గ్రామానికి ఒకటి చొప్పున ఐకేపీ గోదాములను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## 'ఆమె'కు భద్రత

పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో పోలీస్‌శాఖ భరోసా కేంద్రాల తరహాలో పల్లెల్లో అతివలకు జెండర్ రిసోర్స్ సెంటర్లు(జీఆర్‌సీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పర్యవేక్షణలో పోలీస్, మహిళా, శిశుసంక్షేమ, ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. ప్రయోగాత్మకంగా జిల్లాలో మండలాల ఎంపిక పూర్తయింది.

**వారానికోసారి సమావేశం**

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, వారి పిల్లలకు భవితకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. గ్రామ స్థాయిలో ముగ్గురు, మండల స్థాయిలో అయిదుగురు సభ్యులతో సామాజిక కార్యాచరణ కమిటీ(ఎస్ఏసీ) ఏర్పాటు చేస్తారు. ప్రతీ జీఆర్‌సీ కేంద్రాల్లో ఎస్ఏసీ సభ్యులు గృహహింస, లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, వరకట్న వేధింపులపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామ స్థాయిలో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కలిగిస్తారు. షీటీం, సఖి, బాలిక సాధికారత కేంద్రాల నిర్వాహకులతో చైతన్యం కల్పిస్తారు.



ఆడపిల్లలకు 21 ఏళ్లునిండాకే వివాహం, బాలికలు అందరినీ చదివించడం, కుల మత భేదాలు లేకుండా, అంటరానితనాన్ని నిర్మూలించడం అనే అంశాలపై సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు అరికట్టడం, తక్షణ పోలీస్ సహాయం అందించడం, లైంగిక దాడి బాధితులకు వైద్యం, న్యాయం, పోలీసు సేవలను ఒకే చోట తీసుకొచ్చారు.

తొలి దశలో ప్రయోగాత్మక మండలాల్లో

ఉమ్మడి జిల్లాలో 49 వేల స్వశక్తి సంఘాల్లో 5 లక్షలకుపైగా సభ్యులు కొనసాగుతున్నారు. తొలి విడతలో ప్రయోగాత్మకంగా పెద్దపల్లి జిల్లాలో కమాన్‌పూర్, సుల్తానాబాద్, జగిత్యాలలో కోరుట్ల, కరీంనగర్‌లో హుజురాబాద్, గన్నేరువరం, ఇల్లందకుంట, కరీంనగర్ రూరల్, రాజన్న సిరిసిల్లలో తంగళ్లపల్లి మండలాలు ఎంపికయ్యాయి.

మండలానికో జీఆర్‌సీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ముందుగా ఎస్ఏసీ సభ్యులకు శిక్షణ ఇస్తారు. సహచర మహిళలే ఎస్ఏసీ సభ్యులు కావడంతో బాధితులు తమ బాధలను నిర్భయంగా చెప్పుకొని న్యాయం పొందనున్నారు. మహిళలకు సత్వర న్యాయం

- కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, లింగ వివక్ష, వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలపై తక్షణ సాయం లభించనుంది. తమ సమస్యలను ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్న మహిళలకు భరోసా కలగనుంది.

## పీలిస్తే చిత్తు.. తరలిస్తే ఉచ్చు

వికారాబాద్ :ఈ ఏడాది ఫిబ్రవరి 12న కర్ణాటక నుంచి హైదరాబాద్ నగరానికి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా.. పరిగి పట్టణ పరిసరాల్లో 3.25 కిలోల గంజాయి పట్టుకొని ఎక్సైజ్ పోలీసులు ఇద్దర్ని రిమాండ్‌కు పంపారు.

పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గేటు సమీపంలో పరిగికి చెందిన ఒకరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన మరో యువకుడి వద్ద కలిపి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఏపీ రాష్ట్రం విశాఖ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న రైలులో గతనెల 9న గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో అబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు. వికారాబాద్ రైల్వే ఆసుపత్రి సమీపంలో 26 కిలోల ఎండు గంజాయిని అధికారులు స్వాధీనపర్చుకున్నారు.

యువత చెడు అలవాట్లకు బానిసవుతోంది. క్షేత్రస్థాయిలో సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో ప్రభావం ఆయా కుటుంబాలపై పడుతోంది. ముఖ్యంగా 20–25 ఏళ్ల వయసువారే గంజాయి తరలిస్తూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల మాటున దందా సాగిస్తున్నారు. ఇటీవల ఒక్క పరిగి ప్రాంతంలోనే మూడు కేసులు నమోదయ్యాయి. అయిదుగురి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని 23 మందిపై కేసులు పెట్టారు.

**జిల్లా, రాష్ట్ర సరిహద్దుల నుంచి..**

గంజాయి చాలావరకు కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాకు సరఫరా అవుతోంది. కొం దరు స్మగ్లర్లు అమాయకులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షి



స్తున్నా విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు. పరిగి, వికారాబాద్, మోమిన్‌పేట, ధారూరు, బషీరాబాద్ తదితర ప్రాంతాల్లో తరచూ కేసులు నమోదవుతున్నాయి. రైలు సదుపాయం ఉండటంతో తాండూరు, వికారాబాద్ మీదుగా రవాణా అవుతోంది. పొరుగు జిల్లా సంగారెడ్డిలోనూ కేసులు కలకలం రేపుతున్నాయి. రంగారెడ్డి జిల్లా బాలానగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. పరిగికి తక్కువ దూరం కావడంతో అక్కణ్నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**చాక్లెట్ల రూపంలోనూ..**

గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. నాలుగు నెలల కిందట రంగారెడ్డి జిల్లా కొందుర్గు నుంచి తెచ్చి పరిగిలో విక్రయిస్తున్నట్లు అనుమానం రావడంతో కొందరు కట్టడికి కృషి చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు వెనక్కి తగ్గారు. పోలీసు, అబ్కారీ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఆ మలుపుల్లో.. పిలుపులే..!

భువనగిరి: ప్రధాన రహదారుల్లో ఉండే మూల మలుపుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించక పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రమాదకర మూలమలుపులను పరిశీలించింది.

భువనగిరి మండలం వడపర్తి వద్ద పదేళ్ల క్రితం గజ్వేల్ నుంచి భువనగిరి వైపు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న నలుగురిని ఫంక్షన్ హాలు సమీపంలోని మలుపు వద్ద లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గత పదేళ్లలో మండలంలోని పలు మలుపుల వద్ద మొత్తం 76 రోడ్డు ప్రమాదాలు జరిగి 28 మంది మృతి చెందగా 49 మంది తీవ్ర గాయాలపాలయ్యారు.

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట–గౌరాయిపల్లి, మాసాయిపేట–సైదాపురం, పాతగుట్ట–గొల్లగూడెం మధ్య ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పదేళ్లలో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

తుర్కపల్లి మండలం భువనగిరి జాతీయ రహదారిపై సంగ్యతండా, జేతురాంతండా, వాసాలమర్రి, తిర్మలాపురం వద్ద ఉన్న మలుపులు ప్రాణాలు తీస్తున్నాయి. కీసర–యాదగిరిగుట్ట రోడ్డులో మల్యాపురం, ఐద్దుతండా, వెంకటాపురం శివారులోని మలుపు రోడ్డులో ప్రయాణికు



లు ఇబ్బందులు పడుతున్నారు.

వలిగొండ మండల కేంద్రంలోని వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల మూల మలుపు వద్ద అనేక సార్లు లారీలు అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలు చోటు చేసుకున్నాయి. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామ పరిధిలో మూలమలుపు వద్ద సుమారు పదేళ్ల క్రితం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు.

బొమ్మలరామారం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలోని మైసిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న మలుపు వద్ద నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి చెందారు. ప్యారారం – సోలీపేట గ్రామాల మధ్యలో మలుపు వద్ద ప్రమాదం జరిగి పలువురు మృతి చెందారు.

# శివారు..సమస్యలతో బేజారు



పెద్దపల్లి : మురుగు కాలువల నిర్మాణం ప్రధాన వీధులకే పరిమితం కావడంతో శివారు కాలనీవాసులకు కష్టాలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రతీ కాలనీలో మురుగు కష్టాలు వెంటాడుతున్నాయి. శాంతినగర్ నుంచి రంగంపల్లి రాజీవ్ రహదారి వెంట విస్తరించిన కాలనీలన్నింటిలో మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్యే నీటి గుంతలు ఏర్పడుతున్నాయి.

రోడ్ల ఉద్ధృతం, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించడమే పురపాలిక బాధ్యతగా భావిస్తుండటంతో పట్టణంలోని పలు కాలనీవాసులు మురుగు, దుర్గంధంతోనే సహవాసం చేస్తున్నారు. వివిధ కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించి, మురుగు కాలువలు నిర్మించకపోవడంతో కాలనీల్లోని ఓపెన్ ప్లాట్లు మురుగు కూపాలవుతున్నాయి. ఎవరి ఇంటి ముందు వారే మురుగు కాలువ నిర్మించకోవడంతో ఇళ్లు కట్టుకోనివారి ప్లాట్లలోని నీరు చేరుతోంది. అక్కడి నుంచి కచ్చా కాలువ తీసినా నీటిని ఎటు పంపించాలో తెలియని పరిస్థితి మున్సిపాలిటీకి ఏర్పడింది. టీచర్స్‌కాలనీ రైల్వే ట్రాక్‌వైపు ఉన్న వ్యవసాయ భూముల్లోకి మురుగు రాకుండా భూముల యజమానులు అడ్డుకోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ఈ కాలనీలో కొన్ని వీధులకు సరైన రహదారి లేకపోవడంతో రాత్రిళ్లు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంతినగర్‌లో మురుగు నీటి కాలువల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా ఐటీఐ వెనక వైపు, ఎఫ్‌సీఐ గోదాంల ప్రాంతంలోని వీధుల్లో సీసీరోడ్లు నిర్మించిన పురపాలిక అధికారులు మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగంతా ఇళ్ల మధ్య ఖాళీ ప్రాంతాల్లోకి చేరుతోంది. ఇక్కడ రైల్వేట్రాక్‌కు సమాంతరంగా భారీ మురుగు కాలువ నిర్మించి నీటిని మంథని పాత గేటు సమీపంలోని కల్వర్టులోకి మళ్లిస్తే సమస్య తొలగిపోనుంది

రైల్వే ట్రాక్ వెంట విస్తరించిన భూంనగర్, నారాయణస్వామి నగర్‌లలో స్థానికులకు మురుగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో కొన్ని వీధులకు సరైన రహదారులు లేవు.

వైష్ణవి కాలనీ, చైతన్య కాలనీ, లక్ష్మీ నగర్, ఆర్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో మురుగు కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి.

# సాగు సుస్థిరం.. సేవలు విస్తృతం



జగిత్యాల : భారత 5వ ప్రధాని, రైతు నాయకుడు చౌదరీ చరణ్‌సింగ్ వ్యవసాయ రంగానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని పురస్కరించుకొని డిసెంబరు 23న ఏటా జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకొంటున్నారు. ఈ ఏడాది 'సుస్థిర వ్యవసాయం.. రైతులను శక్తిమంతం చేయడం' అన్న అంశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగంలో తక్షణ అవసరాలపై కథనం.

**ఈ–నామ్ విస్తరణతో గిట్టుబాటు**

తొమ్మిదేళ్ల కిందట ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్నింటినీ ఎఫ్‌పీవోల(రైతు ఉత్పాదక సంస్థలు)గా మార్చి కేంద్ర, రాష్ట్ర నిధులతో సేవలు విస్తృతం చేయాలి.

ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు చేస్తే ప్రకృతి విపత్తులతో మామిడి, వరి తదితర పంటలకు నష్టం వాటిల్లినప్పుడు అన్నదాతకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తన శుద్ధి కర్మాగారం పనులు పూర్తి చేసి వరి విత్తనోత్పత్తి చేపట్టి రైతులకు అందుబాటులోకి తేవాలి.

జాతీయ వ్యవసాయ మార్కెట్లతో స్థానిక మార్కెట్లను అనుసంధానించే ఈ–నామ్‌ను ఉమ్మడి జిల్లాలోని దాదాపు 25 మార్కెట్లకు విస్తరిస్తే అన్నదాతలకు గిట్టుబాటు ధరలు అందుతాయి.

ఉమ్మడి జిల్లాలో 1.93 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నా ఉద్యాన పరిశోధన స్థానం లేక రైతులకు సలహాలు అందడం లేదు. జగిత్యాల లేదా కరీంనగర్ జిల్లాల్లో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలి.

ఐసీఏఆర్, రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాలు, జగిత్యాల జిల్లా మల్యాలలో ఉద్యాన కేవీకే, పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం ఏర్పాటుతో అన్నదాతకు మేలు చేకూరుతుంది.

**అనుబంధం.. బలోపేతం**

నాలుగు జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఫుడ్ పార్కులు ఏర్పాటు చేయాలి. గతంలో మాదిరిగా అన్ని రకాల కూరగాయలు, ఆరుతడి పంటల విత్తనాలు, యంత్ర పరికరాలను రాయితీపై సరఫరా చేస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది. మార్కెట్లో ధరలు తగ్గినపుడు పంట ఉత్పత్తులను ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేసేలా వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తే అండగా ఉంటుంది. రైతులు అన్ని రకాల పంటలు సాగు చేసేలా మద్దతు ధరల కల్పన, పంట కాలనీల ఏర్పాటు, బోనస్ వర్తింపు తదితర పథకాలతో ఊతమివ్వాలి. ఉపాధిహామీ అనుసంధానంతో కూలీల కొరత సమస్య తీరుతుంది. పాడి, పట్టు, కోళ్లు, జీవాలు, చేపలు, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ పరిశ్రమలకు రాయితీ పథకాలు వర్తింపజేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

# న్యాక్ గ్రేడింగ్‌కు ఆచార్యుల అవసరం




హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించేందుకు అవసరమైన న్యాక్ గ్రేడింగ్‌కు కేంద్ర విద్యాశాఖ సహకరించాలని నగరంలోని వర్సిటీల ఉన్నతాధికారులు కోరారు. ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక ఆచార్యుడు చొప్పున ఉండాలన్న నిబంధనను పాటించాలంటే అవసరమైన సంఖ్యలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు లేరని అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ వచ్చిన న్యాక్(నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్) ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధేను కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. న్యాక్ గ్రేడింగ్ తక్కువగా ఉంటే భవిష్యత్తులో ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రభుత్వ రంగ సంస్థలు, బహుళజాతి సంస్థలు పరిశోధనలపై సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రావని వివరించారు.**పరిశోధనలు..** ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం.. జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాలకు గుర్తింపు, న్యాక్‌గ్రేడింగ్ లేకపోతే వాటిలో చదువుకుంటున్న విద్యార్థులకు, పీహెచ్‌డీ పరిశోధకుల ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సైన్స్ విభాగాల్లో శాశ్వత అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు తక్కువమంది ఉండటంతో బహుళజాతి సంస్థలు వీరితో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఓయూలో ఒక బహుళజాతి సంస్థ రూ.10 కోట్లతో పరిశోధన ప్రాజెక్టు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ... ఆ విభాగంలో ప్రొఫెసర్లు లేకపోవడంతో చివరి నిమిషంలో మరో వర్సిటీని ఎంపిక చేసుకుంది. జేఎన్‌టీయూలో సంయుక్త పరిశోధనలకు ఒక విదేశీ వర్సిటీ ముందుకొచ్చినా.. సాంకేతిక కారణాలతో ఆ పరిశోధనలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

న్యాక్ గ్రేడింగ్ లభించాలంటే విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లనూ పరిగణనలోకి తీసుకుంటామని న్యాక్ అధికారులు కొంత భరోసా ఇచ్చారని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు న్యాక్ బృందాలు వర్సిటీల్లో పర్యటించనున్నాయి.

వర్సిటీల వారీగా ఒప్పంద సహాయ ప్రొఫెసర్ల ఖాళీలు

ఉస్మానియా 220 మహిళా 120

జేఎన్‌టీయూ 140

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 21

సురవరం ప్రతాపరెడ్డి 15

## అనగనగా ఓ కోతి.. చెప్పింది నీతి

మిర్యాలగూడ : 'ప్లీజ్ సేవ్ ద ట్రీ'.. అని రాసి ఉన్న ప్లకార్డును చేతులతో పట్టుకుని ప్రదర్శిస్తున్న కోతిని చూసి రోడ్డుపై వెళ్లే వారందరూ నవ్వుతూ ఉంటారు. దీంతో లాభం లేదని..ఆ కోతి రోజుకో మొక్క చొప్పున నాటుతూ.. ఒక అడవినే సృష్టించి..అందులోనే ఓ చెట్టు కింద సేద తీరుతుండగా...కొందరు వచ్చి ఆ కోతిని లోయలో పడేసి.. చెట్లు మొత్తం నరికి తీసుకెళ్తారు. అడవి మొత్తం ఎడారిలా మారిపోతుంది. కొన్నేళ్ల తర్వాత ప్రజలందరూ ఆక్సిజన్ మాస్కులు, సిలిండర్లతో తిరుగుతుంటారు. ఏఐ ద్వారా రూపొందించి ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఓ వీడియో సారాంశమిది. జిల్లా ఉన్నతాధికారుల నుంచి.. సాధారణ ప్రజలు ఎంతో మంది ఈ వీడియోనే షేర్ చేస్తున్నారు.

ఇది కేవలం వీడియో మాత్రమే కాదు. పర్యావరణం పట్ల నేటితరం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంతో పాటు.. ఇది ఇలాగే కొనసాగితే భావితరాల పరిస్థితి ఏమిటనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో సైతం ఇటీవలి కాలంలో అభివృద్ధి, రహదారుల విస్తరణ, పరిశ్రమల నిర్మాణం పేరుతో భారీ వృక్షాలను నిమిషాల్లో నరికి పారేస్తున్నారు. నరికిన చెట్ల స్థానంలో ఎటువంటి ప్రత్యామ్నాయ



చర్యలు చేపట్టకపోవడం.. జనాభా విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలకు ప్రాణ వాయువు అందే పరిస్థితులు దూరమవుతున్నాయి.

**జిల్లాలో ఆందోళనకరం**

ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. ఈ నెలలో 20 రోజుల క్రితం ఉన్న నాణ్యత సూచీ(ఏక్యూఐ)లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సాధారణంగా శీతాకాలంలో గాలి నాణ్యత క్షీణిస్తుంది కానీ.. ఈ స్థాయిలో క్షీణించడానికి వాతావరణ కాలుష్యమే ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. చెట్లను పెంచకపోవడం.. ప్లాస్టిక్ విచ్చల విడిగా వాడటం..పంట పొలాలకు అధికంగా రసాయనాలు పిచికారీ చేయడం, భూగర్భ జలాలు పరిమితికి మించి తోడేయ్యడం, వాహనాల అధిక వినియోగం, అధికంగా ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం, పంట కొయ్యలు కాల్చివేత తదితర కారణాలతో పర్యావరణం కలుషితం అవుతుందని పర్యావరణ వేత్తలు వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతున్నారు.

## తర'గని'.. సిరుల వేణి

గోదావరిఖని: 136 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. కార్మికుల పని నైపుణ్యంతో మరో వందేళ్ల భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకుంటోంది. ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక ప్రగతికి దారులు, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సామాజిక బాధ్యతను విస్మరించకుండా తనదైన శైలిలో సంస్థ సాగుతోంది. 137వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కథనం.

**100 మిలియన్ టన్నుల లక్ష్యం**

అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్న సింగరేణి.. రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే దిశగా ప్రణాళికలు చేసుకుంటోంది. అందుకు అవసరమైన గనులను విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకుతోపాటు రామగుండంలో మెగా ఓసీపీ ఏర్పాటు ద్వారా లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకుంది.

**విద్యుత్తు ఉత్పత్తి రంగంలో..**

ఇప్పటికే 1200 మెగావాట్ల థర్మల్, 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి కొత్తగా ఒడిశా రాష్ట్రంలోని నైనీలో 2000, రాజస్థాన్‌లో 2000 మెగావాట్ల థర్మల్, మరో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసింది. జైపూర్‌లో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణ పనులు సాగుతున్నాయి. పర్యావరణహితమైన పంపుడ్‌స్టోరేజ్, జియోథర్మల్ విద్యుత్తు కేంద్రాలపై దృష్టి సారించింది.

**మహిళలకు ప్రత్యేకం**



బొగ్గు ఉత్పత్తి రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు ఒక గనిని పూర్తిగా వారికే అప్పగించి పనులు చేయిస్తోంది. అధికారి నుంచి ఉద్యోగి స్థాయి వరకు పూర్తిగా మహిళలతోనే బొగ్గును వెలికితీసే పనులు కేటాయించింది.

**రెస్క్యూ సేవలు**

రెస్క్యూ సేవలను సామాజిక బాధ్యతగా ఇతర ప్రాంతాల్లో అందిస్తుంది. ఇటీవల ఎస్ఎల్‌బీసీలో జరిగిన ప్రమాదంలో సింగరేణి రెస్క్యూ బృందం సేవలందించింది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో తొలిసారిగా హాజరైన మహిళా జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకొంది.

**ఖనిజాల అన్వేషణ**

సంస్థ తాజాగా ఖనిజాల అన్వేషణపై దృష్టి సారించింది. మట్టిలో లభించే కీలక ఖనిజాలను గుర్తించి వాటిని పరిశోధన చేసేందుకు ఎన్ఎఫ్‌టీసీ, ఐఎంటీ సంస్థతో ఒప్పందం చేసుకుంది. కర్ణాటకలో రాగి, బంగారం అన్వేషణకు అనుమతి దక్కించుకొంది. ఖనిజాల అన్వేషణ ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలతో అవగాహన చేసుకొంది. సింగరేణి ఉపరితల గని మట్టిలో 10 రకాల ఖనిజాలను గుర్తించారు. కోల్‌బెల్టు ప్రాంతాల్లో కొత్తగా 62 చెరువులను నిర్మించింది. మరో 45 చెరువుల్లో పూడికతీత చేపట్టింది.

చురకలు



# ఇదే సందు.. దోచెయ్ ముందు!

అమరావతి :సంక్రాంతి ప్రయాణమంటే ప్రయాణికులకు వెన్నులో వణుకు పుడుతోంది.. సొంతూళ్లకు వచ్చేందుకు ప్రైవేటు ట్రావెల్స్ దెబ్బకు జేబులు ఖాళీ కాగా తిరుగు ప్రయాణంలోనూ దోపిడీ తప్పేలాలేదు. ఆర్టీసీ నుంచి అరకొర సర్వీసులు ఉండడం, పర్యవేక్షణ విషయంలో అధికారులు కాడి వదిలేయడంతో ఈ దుస్థితి కనిపిస్తోంది.

**అందిన కాడికి బాదెయ్...**

విజయవాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సూర్య హైదరాబాద్ నుంచి పండగ కోసం భార్యతో కలిసి రూ.3,500 ఖర్చు చేసి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఇంటికి వచ్చారు. మళ్లీ 18న తిరుగు ప్రయాణానికి ఆన్‌లైన్‌లో చూస్తే ఒక్కో టిక్కెట్ రూ.1,888 చూపించింది. అదీ నాన్ ఏసీ బస్సులో సీటు. ఇద్దరికీ కలిపి రూ.3,776. తప్పక బుక్ చేసినట్లు వాపోయారు. జనవరి14 నుంచి పండగ మొదలుకానున్న వేళ ఇప్పటికీ సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య భారీగానే ఉంది. ఓవైపు వారి జేబులు ఖాళీ చేస్తూనే 16, 17, 18 వరకు తిరుగు ప్రయాణాల్లోనూ దోపిడీకి తెరదీశారు. ఈ మూడు రోజులకు కలిపి విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు సాధారణ సర్వీసులతో కలిపి 120 మాత్రమే ఉన్నాయి. దీంతో వేలాదిగా వచ్చిన ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ వైపు చూస్తున్నారు. ఆన్‌లైన్ ధరలు చూస్తే బెదిరిపోవాల్సిందే.



అధిక ధరల వసూలుకు అనువుగా నాన్ ఏసీ బస్సులు ఒకటీ అర పెట్టి అన్నీ ఏసీ స్లీపర్లే చూపిస్తున్నారు. ఆర్టీసీలో ఒక్కో టికెట్ రూ.436 ఉంది. ప్రైవేటు ట్రావెల్స్‌లో నాన్ ఏసీ సీటు రూ.1,200–1800 ఉంది. ఏసీ స్లీపర్లు, సెమీ స్లీపర్లకు రూ.1500–2,000పైగా సమర్పించాల్సిందే. ఈ బాదుడు భరించలేక వందల మంది యువకులు.. నేరుగా ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో దోపిడీ బహిరంగ రహస్యమైనా అధికారులేమో ఫిర్యాదులొస్తే కదులుదాం అన్నట్లు ఉన్నారు. క్షేత్రంలో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న, అధిక వసూళు చేస్తున్న బస్సుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ దందా మరింత హద్దు మీరుతోంది.

# మామూళ్లకు.. బరి గీసి కూర్చొన్నారు..

ఏలూరు : అది ఏలూరుకు సమీపంగా ఉండే మండలం. ఓ ప్రజాప్రతినిధికి ఆ మండలంలో అన్నీ తానై వ్యవహరించే ఓ నాయకుడు ఏకంగా ప్రభుత్వ భూమిలోనే బరి ఏర్పాటు చేశా రు. అధికారులు దాన్ని ధ్వంసం చేయకుండా రూ.లక్షలు తీసుకుని మౌనంగా ఉండిపోయారు. మెట్ట ప్రాంతంలో ఓ స్టేషన్ పరిధిలో ఎన్నారైలు 2–3 గ్రామాల్లో ఎక్కువగా ఉన్నారు. వారంతా గ్రామాలకు వచ్చిన విషయం తెలుసుకుని పందేల వద్ద వారు పట్టుబడితే కేసు నమోదు చేసి పాస్‌పోర్టు సీజ్ చేస్తామని హెచ్చరించి బరుల నిర్వాహకుల నుంచి అడిగింది తీసుకున్నారు.

అది రెండు నియోజకవర్గాలకు సరిహద్దు పోలీస్‌స్టేషన్. అక్కడ నాలుగు పెద్ద బరులు, 20 వరకు చిన్నవి ఏర్పాటు చేశారు. పండగ మూడు రోజులకు కలిపి పెద్ద బరుల నుంచి ఒక్కో దానికి రూ.5–6 లక్షలు, చిన్న వాటి నుంచి ఒక్కో దానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకున్నారు. ఆ స్టేషన్ అధికారిపై అక్కడి ప్రజాప్రతినిధికి సదాభిప్రాయం లేక ఆ మధ్య బదిలీ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. సంక్రాంతి మామూళ్లపై కన్నేసిన ఆ అధికారి బదిలీ కాకుండా ఆపుకొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కోడి పందేలు, జూదాలు పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయి. గతంలో కన్నా ఈసారి మామూళ్లు బాగా పెంచేశారు. బరుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని భయపెట్టి పలు




స్టేషన్ల అధికారులు రూ.లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు.

**ఉంచమనేది అందుకే..** సంక్రాంతికి జూద శిబిరాల నిర్వాహకుల నుంచి భారీగా మామూళ్లు వస్తాయి. వాటిపై కన్నేసి కొందరు పోలీసు అధికారులు లాబీయింగ్ చేసుకుని బదిలీ వచ్చినా ఆపుకొంటారని వినికిడి. వీఆర్, లూప్‌లైన్‌లో ఉన్నోళ్లు ఇదే సమయంలో పోస్టింగ్ కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారని సమాచారం.

గొలుసు దుకాణాల నుంచి అధనం.. ఆ బరులు, జూద శిబిరాల వద్ద మద్యం గొలుసు దుకాణాలు, పాన్ మసాలాలు విక్రయించేవారు సైతం తక్కువలో తక్కువ రూ.10 వేల నుంచి రూ.20 వేల దాకా ముట్టజెబుతారు. ఇవి అధనం. ఇదిలా ఉండగా రూ.20–30 లక్షల నుంచి రూ.అరకోటికి పైగా స్టేషన్ మామూళ్లు వచ్చిపడతాయి. పలు స్టేషన్ల పరిధిలో పెద్దవి, చిన్నవి కలిపి 20కు తగ్గకుండా శిబిరాలు ఉన్నాయి.

**పశ్చిమలోనూ..**గతంలో పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోనే పెద్దబరులు ఉండేవి. ఈ సారి ఆచంటలోనూ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో రెండు సిద్ధం చేస్తున్నారు. ఇవి కాక చిన్నాచితక గ్రామాల్లోనూ వెలిశాయి. ఇవి ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వెళ్తాయనేది జాబితాలు సిద్ధం చేసుకున్నారు. వీటి దగ్గర గతేడాది వచ్చిన లాభాలను దృష్టిలో ఉంచుకుని కొందరు వాటాలు నిర్ణయించుకున్నారు. గుండాట, పేకాట బోర్డులు పంచుకున్నారు. మద్యం, తాగునీటి సీసాలు, ఆహారానికి సంబంధించిన దుకాణాలను మద్యం సిండికేట్లకు అప్పగించారని చెబుతున్నారు.

# పడకేసిన గ్రామీణ వైద్యం



పుత్తూరు : పలమనేరు ప్రాంతీయ ఆసుపత్రిలోని నూతన భవనంలో అన్ని వసతులున్నా లిఫ్ట్ లేదు. దాంతో గర్భిణులు, బాలింతలకు ఇబ్బందిగా ఉంది. పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంది. గతంలో నగరి ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ఒకరిని డిప్యుటేషన్‌పై నియమించినా గడువు ముగియడంతో ఆమె వెనక్కు వెళ్లారు. చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు నుంచి ఇద్దరిని మూడు రోజుల చొప్పున డిప్యుటేషన్‌పై పంపినా వారు సక్రమంగా విధులకు రావడం లేదు. దీంతో ప్రతినెలా 50- 60 డెలివరీలు జరిగే ఆసుపత్రిలో 15 కావడం లేదు. వి.కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు వైద్యులను నియమించాలి. అనస్తీషియా ఒకరు, మరో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేరు. శస్త్రచికిత్సల కోసం రోగులను కుప్పం ప్రాంతీయ ఆసుపత్రికి పంపుతున్నారు.

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యుటేషన్‌పై గుడుపల్లెకు పంపించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ వ్యాధి వచ్చినా ముందుగా ఆశ్రయించేది పీహెచ్‌సీలనే. ప్రతి వైద్యశాలలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరూ పనిచేస్తున్నవి వేళ్ల మీదే లెక్కించవచ్చు. జిల్లా, మండల కేంద్రాలు, జాతీయ రహదారులకు అనుకుని ఉన్న చోట మాత్రమే నిబంధనలకు అనుగుణంగా వైద్యులున్నారు. మిగతాచోట్ల ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. వీరైనా సకాలంలో వస్తారా? అంటే అదీ లేదు. బయట విజిట్‌కు వెళ్లినట్లు సిబ్బందితో సమాధానం చెప్పిస్తున్నారు. మధ్యాహ్నం వరకు ఓపీ చూడాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. రాత్రి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సమీపంలోనే నివాసం ఉండాలనే అంశం అమలు కావడంలేదు. పాలసముద్రం, పెద్దపంజాణి, ఐరాల, విజయపురం, వరదయ్యపాళెం, నాగలాపురం, ఏర్పేడు తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి.

**గైనకాలజిస్టు, అనస్తీషియా, జనరల్ మెడిసన్‌లో..**

మరోవైపు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో గైనకాలజిస్టు, జనరల్ మెడిసన్, అనస్తీషియా విభాగంలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 24 వరకు పోస్టులను భర్తీ చేయాలి. గైనకాలజిస్టులను డిప్యుటేషన్‌పై నియమించినా వారు తూతూమంత్రంగానే విధులు వస్తున్నారు. దాంతో ఎక్కువ మంది చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, పలమనేరుకు వెళ్తున్నారు. మత్తు వైద్య నిపుణుడు అందుబాటులో లేక శస్త్రచికిత్సలకు సమీపంలో ఉన్న వైద్యశాలలకు పంపుతున్నారు. వైద్యుడి సూచనల మేరకు ఫార్మసిస్టు మందులు అందించాల్సి ఉన్నా ఈ విభాగంలోనూ సిబ్బంది కొరత ఉంది. రెండు జిల్లాల్లో 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**పీహెచ్‌సీల్లో బి కాంప్లెక్స్ మాత్రలు లేవు**

ఈ నెల 2న గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేశారు. ఇద్దరు వైద్యులకు ఒకరు సెలవులో ఉండగా మరొకరు విధులకు రాలేదని గుర్తించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గ్రామీణ ప్రజలు ఎక్కువగా వచ్చే పీహెచ్‌సీలలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. స్టాఫ్‌నర్సులే రోగులకు చికిత్స అందించడం రివాజుగా మారింది.

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, తొట్టంబేడు పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# పండగలో సడేమియా.. నిర్మాణంలో మహా మాయ!!



విశాఖపట్నం : సంక్రాంతి పండగ వేళ అధికారులతో కుమ్మక్కై కొందరు పెద్ద ప్రణాళికే వేశారు. అనుమతులు పొందిన ప్లాన్‌ను మించి అదనపు అంతస్తులు రాత్రికిరాత్రే నిర్మించేస్తున్నారు. అవి బయటకు కనిపించకుండా చుట్టూ పరదాలు కట్టేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఇలాంటి భవన నిర్మాణాలు వందల సంఖ్యలో సాగుతున్నాయి. మధురవాడ జోన్–2 పరిధిలోని 5,6,7,8 వార్డుల పరిధిలో చిన్నా పెద్ద 40 వరకు నిర్మాణాలు చాలా వేగంగా నిర్మిస్తున్నారు. ఇది సీతంపేట పరిధిలోనిది. నిబంధనలు ఉల్లంఘించి కడుతున్నారు. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు వదలకుండా సెల్లార్, జీప్లస్2 నిర్మాణం చేపట్టారు. దీనిపై ప్రజా పరిష్కార వేదికలో రెండు, మూడుసార్లు ఫిర్యాదు చేయగా అక్రమ నిర్మాణం అని కొంత పడగొట్టి అధికారులు నోటీసు ఇచ్చారు. అయితే మళ్లీ నిర్మాణ పనులు యథవిధిగా సాగుతున్నాయి.

ఈ భవనం పీఎం పాలెం ప్రధాన రహదారిలోనిది. జీప్లస్2 భవన నిర్మాణానికి ప్లాన్ అనుమతి పొంది నిబంధనలకు విరుద్ధంగా భూగర్భంలో సెల్లార్ నిర్మాణం చేశారు. సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో అనుమతుల్లేకుండా అదనపు అంతస్తు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది బయటకు కనిపించకుండా గ్రీన్ షేడ్ నెట్ చుట్టూ కట్టారు. రహదారి విస్తరణ పరిధి దాటి... ముందుకు వచ్చి నిర్మాణం చేపట్టారు. సెట్‌బ్యాక్ నిబంధనలు విస్మరించారు. ఈ అక్రమ నిర్మాణాన్ని బీపీఎస్‌లో పెట్టి సక్రమం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ భవనం తారకరామానగర్‌లోని ఓ కార్ల షోరూం సమీపంలో ఉంది. జీప్లస్2 అనుమతి తీసుకున్నారు. మరో రెండు అదనపు అంతస్తుల కోసం 15 రోజుల క్రితం టీడీఆర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పరిశీలనలో ఉండగానే ఆ రెండంతస్తులు నిర్మాణం పూర్తి చేశారు. అనుమతి పొందిన తర్వాతే నిర్మాణం ప్రారంభించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. పట్టణ ప్రణాళిక అధికారులు సైతం ఇటు దృష్టిసారించలేదు. మరో వైపు టీడీఆర్‌లకు దరఖాస్తు చేసుకోకుండానే చాలా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఒకవేళ దరఖాస్తు అనుమతి రద్దయితే నిర్మాణం పూర్తిచేసిన వారిపై ఏం చేస్తారో చూడాలి.మధురవాడ పోర్టు కాలనీలో జీప్లస్2 నిర్మాణానికి అనుమతి పొందారు. ఏకంగా బఫర్ జోన్ నిబంధనలు పక్కనపెట్టి గెడ్డను ఆనుకుని ఈ నిర్మాణం చేపట్టారు. అంతేకాదు ఎలాంటి అనుమతుల్లేకుండా మరో అదనపు అంతస్తు దాదాపు పూర్తి కావస్తోంది. తుదిదశలో ఉన్న అదనపు అంతస్తును పండగ తర్వాత బీపీఎస్‌లో పెట్టి క్రమబద్ధీకరించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. వాస్తవానికి బీపీఎస్ గతేడాది ఆగస్టు 31లోపు నిర్మించిన భవనాలకే వర్తిస్తుంది.

# తీరంలో.. ఇసుక దొంగలు!



అనకాపల్లి: ఇసుక దొరకడమే తరువాయి.. వాగైనా, వంకైనా, చివరకు సముద్రపు తీరమైనా దోచుకోవడమే అన్నట్లు జిల్లాలో తవ్వకాల మాఫియా తయారైంది. రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలోని సముద్రతీరంలో ఇసుక తవ్వి.. నది ఇసుకలో కలిపి అమ్మేస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ, మైనింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడంలేదు.

జిల్లాలో నిర్మాణరంగం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇదే అవకాశంగా చేసుకుని అక్రమార్కులు తీర ప్రాంతాల్లో తవ్వకాలు ప్రారంభించారు. సముద్రపు ఇసుక నిర్మాణాలకు వినియోగిస్తే గోడలు బీటలు వారుతాయి. భవనాల జీవన కాలం తగ్గిపోతుంది. కానీ ఇవేవీ అక్రమార్కులకు పట్టడంలేదు. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీరానికి రక్షణగా ఉండే దిబ్బలు కాస్తా కరిగిపోతున్నాయి. తీరం వెంట భారీ గుంతలతో రాత్రివేళల్లో వేటకు వెళుతున్నప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నామని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

నక్కపల్లి మండలం డి.ఎల్.పురం, అమలాపురం గ్రామాల పరిధిలో తవ్వకాల గురించి మత్స్యకారులు స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పాయకరావుపేట మండలం రాజానగరం, స్నానాలరేవు, రత్నాయంపేటలో తీరం వద్ద వేసిన జీడి మొక్కలను తొలగించి ఇసుక తిన్నెలను తరలించేస్తున్నారు.

రాంబిల్లి మండలంలోని వాడపాలెం, వాడ నర్సాపురం, కొత్తపట్నం, సీతపాలెం గ్రామాల వద్ద తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

తీరంలో తవ్వితే చర్యలు : శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి

అనుమతులు లేకుండా సముద్రపు ఇసుకను తవ్వడం నేరం. దీనిని నిర్మాణాలకు వినియోగిస్తే.. భవనాలు స్వల్పకాలంలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. నది ఇసుకలో.. సముద్రపు ఇసుక కలిపి అమ్మడం నేరం. ఇలాంటి అక్రమాల్లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. సముద్ర తీర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో నిఘా ఉంచుతాం.

# కట్టడి లేదు.. కత్తి దూసుడే!

మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాలో పందెం ఆటగాళ్లు కోడి పందేలకు కాలు దువ్వుతున్నారు. పుంజులు సమరానికి సై అంటున్నాయి. దాదాపు అన్ని చోట్లా బరులు సిద్ధమయ్యాయి. బారికేడ్లు.. వీఐపీ గ్యాలరీలు, ఫ్లడ్‌లైట్లు.. మైక్ అనౌన్స్‌మెంట్లు.. స్టేజీలు.. భారీ ఎల్ఈడీ తెరలు.. మందు.. విందు.. చిందు.. వంటి అన్ని వసతులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. శీతల గదులు.. కార్డ్స్ ఆడేందుకు ప్రత్యేక తెరలు పెడుతున్నారు. ఫంక్షన్ హాళ్లు.. హోటళ్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో తిరువూరు, విస్సన్నపేట, కేసరపల్లి, గుడివాడ, ఈడుపుగల్లు, ఉప్పులూరు, లక్ష్మీపురం, పులిగడ్డ, అంబాపురం, పి.నైనవరం, రామవరప్పాడు తదితర ప్రాంతాల్లో హైటెక్ బరులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో రూ.కోట్లలో పందేలు ఉండనున్నాయి. నేతలు, పోలీసుల అనుమతులు.. నోట్ల కట్టలు చేతులు మారే ఒప్పందాలు దాదాపు పూర్తయ్యాయి.

**డబ్బులెట్టు.. స్టాల్ పెట్టు..**

ఒక్కో శిబిరం నిర్వహించేందుకు రూ.10లక్షల నుంచి రూ.కోటికి పైగా నిర్వాహకులు పెట్టుబడి పెడుతున్నారు. అంతకు నాలుగైదు రెట్లు తిరిగి రాబట్టేందుకు పందెం రాయుళ్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నాపెద్ద బరుల వద్ద మద్యం బెల్టు స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు విపరీత డిమాండ్‌తో నిర్వాహకులకు కాసుల వర్షం కురుస్తోంది. వీటికి స్థానిక నేతలు.. ఎక్సైజ్‌శాఖ,



పోలీసుల వద్ద లోపాయికారి ఒప్పందాలు జరిగాయి. బరుల వద్ద బహిరంగంగానే మద్యం అమ్మకాలు ఉండనున్నాయి.

బిరియానీ, ఫాస్ట్‌ఫుడ్ వివిధ రకాల ఆహారపు స్టాల్స్.. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, పాన్ మసాలాలు.. సిగరెట్లు తదితర కౌంటర్లు పెట్టుకునేందుకు పలు పార్టీల చోటామోటా నేతలు పోటీ పడుతున్నారు.

**వీరికి ఎక్కువ డిమాండ్**

పందెం పుంజులకు కత్తులు కట్టేవారికి డిమాండ్ పెరిగింది. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల నుంచి కత్తులు కట్టేవారిని ముందే బుక్ చేసుకున్నారు. గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున రప్పిస్తున్నారు.

**బౌన్సర్లు.. సెక్యూరిటీలు.. పార్కింగ్ రుసుం వసూళ్లు ఉండనున్నాయి.**

కోడి పందేలతో పాటు కార్డ్స్, కాయ్‌రాజాకాయ్, గుండాట తదితర జూద క్రీడలు నిర్వహించేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కార్డ్స్ ఆడేందుకు ప్రత్యేకంగా ప్రవేశ రుసుం రూ.5వేల వరకు పెడుతున్నారు.గుడివాడ, కేసరపల్లి, ఉప్పులూరు, ఈడుపుగల్లు, విజయవాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఒక్కో పందెం రూ.లక్షల్లో ఉంటుందని ప్రచారాలు చేస్తున్నారు.

# జగన్మాత సేవలో.. కొత్త శకం!

అమరావతి : 'దుర్గగుడిలో దర్శనాలు, ఇతర సేవల టికెట్ల చెల్లింపుల్లో 'సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌ల' శకం ఆరంభం కానుంది. ఇకపై అన్నీ పూర్తిగా డిజిటల్ పేమెంట్లలోకి మార్చేయనున్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా టికెట్లన్నీ అత్యంత తేలికగా తీసుకునే సౌలభ్యం రాబోతోంది. కరూర్ వైశ్యా బ్యాంకు ఆధ్వర్యంలో తొలిదశలో నాలుగు యంత్రాలను ఏర్పాటు చేయనుండగా.. ఇవి ఆలయానికి వచ్చేశాయి. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్, లిఫ్ట్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఉండేచోట వీటిని పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదించగా.. సంక్రాంతి తర్వాత కియోస్క్‌లను బిగించనున్నారు.'

**సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి...**

దుర్గగుడిలో అన్ని సేవల వివరాలు, ధరలతో సహా టికెట్లను కియోస్క్‌లలో నిక్షిప్తం చేస్తారు. వాటిలో క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి.. అన్నిరకాల ఆన్‌లైన్ పేమెంట్లను చేసి.. తేలికగా టికెట్లను పొందేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ బాధ్యతను ప్రస్తుతం టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలందిస్తున్న డిజిసాఫ్ట్ ఇన్‌సైట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కే అప్పగించారు.

**తిరుపతి తరహాలో మార్పు...**

తిరుపతిలో ఇప్పటికే ఈ కియోస్క్‌ల ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అక్కడ దాతల నుంచి విరాళాల సేకరణకూ వీటిని వాడుతున్నారు. తొలిగా నాలుగు యంత్రాలను పెట్టి.. దశల వారీగా పూర్తిగా డిజిటల్ పేమెంట్లు చేసేలా మార్చనున్నారు. అందుకే.. ప్రస్తుతానికి డబ్బులు చెల్లించి టిక్కెట్లు కొనేందుకు పరిమితంగా ఒకటి రెండు మాత్రమే



సింగిల్ విండో కౌంటర్లు ఉంచుతారు.

**అందరికీ అనువుగా..**

సెల్‌ఫోన్‌ను భక్తులు కౌంటర్లలో భద్రపరచడానికి ముందే టికెట్లను తీసుకునే ప్రాంతాల్లోనే ఈ కియోస్క్‌లను పెట్టనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. భక్తులు సులభంగా చేరుకునేలా, అందరికీ స్పష్టంగా కనిపించేలా రద్దీ ప్రాంతాల్లో వీటిని పెట్టనున్నారు.

**విస్తృత ప్రచారం..** సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌లు, డిజిటల్ చెల్లింపుల గురించి ఇకనుంచి భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా నిరంతరం ఆలయ పరిసరాల్లో ప్రచారం చేస్తారు. కియోస్క్‌ల వద్ద వాలంటీర్లను నియమించి.. భక్తులకు మార్గనిర్దేశం చేయనున్నారు.

చురకలు



## సంప్రదాయ రుచులకు.. సై!!

విశాఖపట్నం : అరిసెలు.. బెల్లం పొంగడాలు.. కజ్జికాయలు.. గవ్వలు.. జంతికలు.. చెగోడీలు.. పెద్ద పండగ పేరు చెప్పగానే ఈ సంప్రదాయ రుచులే గుర్తొస్తాయి. ఒకప్పుడు పల్లెటూళ్లలో ఇంటి ముందు మహిళలంతా కూర్చుని వీటిని తయారు చేసేవారు. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే ఇళ్లలో పిండి వంటలు ఘుమఘుమ లాడేవి. మిగిలిన రోజుల్లో కేకులు, ఇతర స్వీట్లు ఎన్ని తిన్నా.. పండగ రోజుల్లో సంప్రదాయ వంటల రుచి చూడాల్సిందే. పుట్టింట్లో ఎంతో ఆప్యాయంగా ఇచ్చేవాటిని అత్తింట్లో అందరికీ పంచాల్సిందే. సంప్రదాయ వంటలు రుచి చూడాలని ఉన్నా.. తీరిక లేక వాటి గురించి చాలా మంది ఆలోచించట్లేదు. అయిదు కిలోల బియ్యంతో అరిసెలు తయారు చేయాలంటే గంటల తరబడి కనీసం ఇద్దరు కుస్తీలు పట్టాల్సిందే. పైగా చాలా మంది సరిగా చేయడం రాక వాటి తయారీ వైపు వెళ్లట్లేదు. నగరంలోని మిఠాయి దుకాణాలు, హోంఫుడ్స్ నిర్వాహకులు ప్రస్తుత అవకాశాన్ని వినియోగించు కుంటున్నారు. ఇంట్లో మాదిరిగా అన్ని



రకాల సంప్రదాయ వంటలు తయారుచేసి వినియోగ దారులకు అందిస్తున్నారు. మామూలు రోజులతో పోలిస్తే పండగ సమయంలో రెండు, మూడు రెట్లు ఎక్కువగా కొనుగోళ్లు జరుగుతాయని చెబుతున్నారు.ఓ దుకాణ యజమాని తమ ఉత్పత్తులకు ఆదరణ లభించేందుకు తమ కుటుంబ సభ్యులతోనే ప్రత్యేకంగా వీడియో ప్రకటనలు రూపొందించారు. కొందరు రాయితీలు సైతం అందిస్తున్నారు. దీంతో ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, జగదాంబ, సీతంపేట, అక్కయ్యపాలెం, గోపాలపట్నం, ఎన్ఏడీ, గాజువాక తదితర ప్రాంతాల్లోని దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి.
వివిధ దుకాణాల్లో వినియోగదారులను ఆకర్షించేలా ప్రత్యేక ప్యాకింగ్‌లు అందుబాటులోకి తెచ్చి విక్రయిస్తున్నారు.
విదేశాల్లో ఉంటున్న బంధువులకు పంపేలా కొందరు నిర్వాహకులు ప్యాకింగ్ చేయిస్తున్నారు. ఫుడ్ డెలివరీ యాప్‌ల ఇంటి ముంగిటకే మిఠాయిలు, స్నాక్స్‌ను చేరవేస్తున్నాయి.
వేపగుంటలోని ఓ దుకాణ నిర్వాహకులు స్నేహితులు, బంధువులకు బహుమతిగా ఇచ్చేందుకు రూ.499కే సంక్రాంతి కానుక పేరిట స్వీట్ బకెట్ విక్రయిస్తున్నారు. నగరంలోని ఓ హోంఫుడ్ నిర్వాహకులు.. మూడు ప్రత్యేక ప్యాకేజీలుగా పిండి వంటలు అందిస్తున్నారు. రూ.799కి అయిదు రకాలు, రూ.1499కి పది రకాలు, రూ.5999కి ఇరవై రకాలు విక్రయిస్తున్నారు.

## స్వర్ణ నారావారిపల్లె సాకారమే లక్ష్యంగా

తిరుపతి: చంద్రగిరి మండలంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె ఉన్న కందులవారిపల్లె పంచాయతీతో పాటు ఎ.రంగంపేట, చిన్న రామాపురం పంచాయతీల సమగ్రాభివృద్ధికి అడుగులు పడ్డాయి. గతేడాది జులై నాటికే అన్ని గృహాలకు సౌర విద్యుత్తు కనెక్షన్లు అమర్చగా.. ఇప్పుడు ఈ మూడు పంచాయతీల్లోని 2,161 గృహాల్లోనూ గ్యాస్, కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. గతేడాది సంక్రాంతికి సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చినప్పుడు 'స్వర్ణ నారావారిపల్లె' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించి ఒక్కోటిగా అమలు చేస్తూ వస్తోంది.

**పాడిరైతులకు రూ.4.6 కోట్ల లబ్ధి..**

2024 జూన్ నాటికి మూడు పంచాయతీల్లో ప్రతిరోజూ 4,246 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుండగా.. ప్రస్తుతం అది 6,236 లీటర్లకు



పెరిగింది. గ్రామాల్లో 100 శాతం చెత్త సేకరణ, వ్యర్థాల విభజన చేస్తున్నారు. 1,420 టన్నుల వారసత్వ వ్యర్థాల శుద్ధితో పాటు వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు ఇస్తున్నారు. ఇళ్లలో వినియోగించిన సౌర విద్యుత్తు పోనూ గ్రిడ్‌కు ప్రతినెలా సగటున 2,54,956 యూనిట్లు సరఫరా చేస్తున్నారు.ఈ-ఆటోలు, ట్యాక్సీల పంపిణీ, టైలరింగ్, కుట్టు శిక్షణ తదితరాలు ప్రోత్సహించడం ద్వారా 312 మందికి ఉపాధి కల్పించారు.

**నీటి ఎద్దడి తీరేలా..**

మరోవైపు నేడు సీఎం చంద్రబాబు తిరుపతి నగరం, తిరుమలలో 5 లక్షల మంది తాగునీటి ఎద్దడి తీర్చే పనులకు రూ.126 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారు. తద్వారా నారావారిపల్లె సమీప మూలపల్లె చెరువుతో పాటు మరో నాలుగు చెరువులు నిండనున్నాయి. 1,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

## కొత్తవలస కొండపై హిల్‌రిసార్ట్

భీమిలి : భీమిలి మండలం కొత్తవలస కొండపై 15 ఎకరాల స్థలాన్ని హిల్ రిసార్ట్ అభివృద్ధి కోసం పర్యాటక శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.54.45 కోట్ల విలువైన ఈ ప్రభుత్వ స్థలాన్ని పర్యాటక శాఖకు ఉచితంగా అప్పగిస్తున్నట్లు పేర్కొంది. భీమిలిని ఆనుకుని కొత్తవలస కొండపై సర్వే నంబరు 102-2లో 7.70 ఎకరాలు, 103లో 7.30 ఎకరాలు కేటాయించింది. సముద్రానికి అభిముఖంగా ఉన్న ఈ కొండపై రిసార్ట్ నిర్మాణంతో పాటు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించింది. గత ప్రభుత్వం ఈ భూమిని పెందుర్తి సమీప చినముషిడివాడ కేంద్రంగా ఉన్న శారదాపీఠానికి కారుచౌకగా అప్పగించింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ స్వామీజీకి చాటుకుంటూ వీఎంఆర్‌డీఏ నిధులతో కొండపైకి రహదారులు ఏర్పాటు చేయడం విమర్శలకు దారితీసింది. కొన్ని ధార్మిక సంస్థలు, కొందరు పీఠాధిపతులు, సామాజిక ఉద్యమకారులు నాటి కేటా యింపులను తప్పుపట్టారు. శారదా పీఠానికి అడ్డగోలుగా చేసిన కేటాయింపులను కొన్ని నెలల కిందట కూటమి ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

# మట్టిని తినేస్తున్నారు



తాడిపత్రి : తాడిపత్రి నియోజకవర్గంలో మట్టి బకాసురులు చెలరేగిపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాత్రింబవళ్లు సాగిన దందాతో కొండలు, గుట్టలు కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వంలోనూ వారి ఆగడాలు సాగుతూనే ఉన్నాయి. రాత్రివేళలో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలించి సొమ్ము చేసుకొని జేబులు నింపుకొంటున్నారు. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామంలో సర్వే నంబరు 1281లో ఉన్న ప్రభుత్వ భూమిలోని కొండను తవ్వేసి నల్ల, ఎర్రమట్టిని అనుమతి లేకుండా తరలించారు. ఈక్రమంలో కొండ పైనున్న పచ్చని చెట్లను పెకిలించి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

**ట్రాక్టర్లతో డంప్.. టిప్పర్లకు లోడ్**

గ్రామంలోని కొండపైకి వెళ్లేందుకు దారి ఇరుగ్గా ఉండడంతో పొక్లెయిన్లు వినియోగించి, ట్రాక్టర్లతో మట్టిని తరలించి ఓ ప్రాంతంలో మట్టిని డంప్ చేశారు. అనంతరం టిప్పర్లలో మట్టిని నింపి తరలించి విక్రయిస్తున్నారు. ఎవరైనా అడిగితే కొందరు రైతుల పేర్లు అడ్డుపెట్టుకొని దోచేస్తున్నారు. తవ్విన ఎర్ర, నల్లమట్టిని తాడిపత్రి, యాడికి ప్రాంతాల్లోని ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధికి వినియోగిస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.9వేల నుంచి రూ.10వేలు పలుకుతోంది. రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్లర్లు, టిప్పర్లలో మట్టి వెళుతోంది. చిన్నయక్కలూరు, శింగనగుంటపల్లి సమీపంలోనూ మట్టి దందా కొనసాగుతోంది.

**కఠినచర్యలు తీసుకుంటాం** -బాలాజీరాజు, తహసీల్దారు, పెద్దపప్పూరు

అనుమతులు లేకుండా ఎర్ర, నల్లమట్టిని తరలిస్తే కఠినచర్యలు తప్పవు. ఎక్కడైతే మట్టిని తవ్వేస్తున్నారో ఆ ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచుతాం. దందా నియంత్రణకు శాయశక్తులా కృషి చేస్తాం. అనమతులు లేకుండా మట్టి తరలిస్తూ వాహనాలు పట్టుబడితే క్రిమినల్ కేసులు పెడతాం.

# రంగరంగా.. రక్షించుకోవా!



గుత్తి : ఉమ్మడి జిల్లాలో గుత్తి మండలం తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వందలాది సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. ఏటా జరిగే స్వామి ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఇదే అక్రమార్కుల పాలిట వరంగా మారింది. దేవుడి సొమ్మును బొక్కేస్తున్నారు.ఉత్సవాలతో పాటు వివాహాల ద్వారా వచ్చే సొమ్ము దేవుడి ఖాతాలో చేరడంలేదు.

మౌలిక వసతుల కల్పన పేరిట..

ఉత్సవాల్లో వీధిదీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనుల పేరిట పంచాయతీ ఖాతాల్లోని సొమ్మును ప్రజాప్రతినిధులు డ్రా చేస్తుంటారు. గతేడాది ఈ మొత్తంతో చేపట్టే పనులు తామే చేయాలంటే నాయకులు పోటీపడ్డారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకుని పంచాయితీ చేశారు. పంచాయతీ పాలకులు రూ.3లక్షల విలువైన, మిగిలిన నాయకులు రూ.2లక్షల విలువైన పనులను చేసుకునేలా తీర్మానం జరిగింది. మరోవైపు ఆలయంలో 30 గదులున్నాయి. వివాహ కార్యక్రమాలకు పెద్ద హాలు ఉంది. పెళ్లి తరఫు వారి నుంచి ఓ నాయకుడు రూ.8వేలు దండుకుంటుండగా, ఒక్కో గదికి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ సొమ్మూ దేవాదాయ శాఖకు చేరడం లేదు. లక్షలాది రూపాయల ఆదాయం అటు పంచాయతీ ఇటు దేవాదాయ శాఖకు అందకపోగా. నాయకుల పెత్తనం, ఆధిపత్య పోరు అ'ధనం'.

**జమ కొంతే.. దిగమింగుడే ఎక్కువ**

స్వామి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయి. సుమారు 600 దుకాణాలు ఏర్పాటవుతాయి. మరోవైపు వ్యాపారులు ఊయలలు, రంగులరాట్నాలు అమర్చుతారు. ఒక్క ఊయల వ్యాపారులే రూ.10లక్షల వరకు పాలకులకు ఇస్తారు. పంచాయతీకి నామమాత్ర సొమ్ము దక్కుతోంది. ఒక్కో దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి పంచాయతీ అధికారులు గజం చొప్పున నిర్ణీత మొత్తం వసూలు చేస్తారు. ఇందులోనూ నాయకులు వాటాలు పంచకుంటున్నారు. 2023లో రూ.3.90లక్షలు, 2024లో రూ.5లక్షలు, 2025లో రూ.5.10లక్షలు వసూలైనట్లు లెక్కల్లో చూపారు. పంచాయతీ ఖాతాకు కొంత మొత్తమే జమచేసి మిగిలింది జేబులో వేసుకుంటున్నారు. గతేడాది దుకాణాల నిర్వహణకు 5శాతం రుసుం పెంచిన విషయం తెలిసిందే. ఏటా ఉత్సవాల్లో పెద్దఎత్తున సొమ్ము స్వాహా అవుతున్నా పట్టించుకునే నాథులు ఒక్కరూ కనిపించడం లేదు.

**అక్రమాల గురించి తెలియదు**

-నరసింహారెడ్డి, ఈవోఆర్డీ, గుత్తి

ఉత్సవాల సందర్భంగా దుకాణాల ఏర్పాటు దారులతో ఎంత సొమ్ము వసూలు చేస్తున్నారో నాకు తెలియదు. కార్యదర్శులతో మాట్లాడతాను. అక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటాం.

# కొండల్ని కొల్లగొట్టి.. కాసులు కూడబెట్టి



పుట్టపర్తి : భారీగా తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో ఏడీ మైనింగ్‌శాఖకు లేఖ రాశాం. మరోసారి మాట్లాడి సంయుక్తంగా తనిఖీలు చేస్తామని నల్లమాడ తహసీల్దార్ మనోజ్‌కుమార్ తెలిపారు.కొత్తచెరువు మండలం పెనుకొండ రోడ్డులో నల్లకొండ, పుట్టపర్తి రోడ్డులో పొలిమేరగుండు వద్ద కొండ పోరంబోకు భూముల్లో, ధర్మవరం రోడ్డులో మైలేపల్లి చెరువులో, నాగిరెడ్డిపల్లి సమీపంలో దాసరిపాముగుట్టపై అనుమతి లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు రెండు మూడ్రోజులు హడావుడి చేసి వదిలేశారు.
ముదిగుబ్బలోని బైపాస్ సమీపంలో గత వైకాపా ప్రభుత్వంలో గుట్టలను చదునుచేసి ఆక్రమించిన భూముల్లో ఇప్పుడు మట్టితోలి చదును చేసి ప్లాట్లుగా మార్చారు. కొండ గుట్టల్లో తవ్విన మట్టిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి బైపాస్ చివరి వరకు రోడ్డుకిరువైపులా గుట్టలు తవ్వేశారు. చదునుగా ఏర్పడిన ప్రాంతాల్లో ప్లాట్లు వేసుకున్నారు. వీటిపై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. ల్లాలో సహజసిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. ప్రకృతి వనరులను కొందరు కొల్లగొడుతున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. పైగా అడ్డుకోవాల్సినవారే అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రాత్రీ పగలు తోడేస్తున్నా..**

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల కోసం పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడలో సర్వే నంబరు 1,368లో ఉన్న కొండపై ఒక హెక్టారులో 25 వేల మెట్రిక్ టన్నుల వరకు తవ్వుకోడానికి సదరు గుత్తేదారు సంస్థకు రెవెన్యూ, గనులశాఖ అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. గుత్తేదారు సంస్థ రికార్డుల కోసం అన్నట్లు రాయల్టీ కింద కొంత సొమ్ము చెల్లించింది. హెక్టారు స్థానంలో దాదాపు 50 హెక్టార్లకుపైగా తవ్వకాలు చేశారు. దీనిపై 'అనుమతి గోరంత.. దోపిడీ కొండంత' శీర్షికన గత డిసెంబరు 5న 'కథనం ప్రచురితమైంది. జనసేన నాయకులు రెవెన్యూ, గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఏడీ మైనింగ్‌శాఖను ఆదేశించినా చర్యలు శూన్యం.

# వేమన యదార్థవాదం.. సమాజ జాగృతం

కదిరి : ప్రజాకవి, యోగివేమన యదార్థవాదం.. ప్రజల ఆరాధ్యునిగా పూజింపజేస్తోంది. భోగాలను వదిలి సమాజ రుగ్మతులపై సామాన్యులకు సైతం అర్థమయ్యే పరిభాషలో పద్యాలతో కత్తికట్టారు. తన పాండిత్యంతో పామర జనంలో చెరగని ముద్ర వేసుకున్నారు. దేశాటనతో మూఢనమ్మకాలను ఎత్తిచూపుతూ కదిరి ప్రాంతానికి వచ్చారు. ఈ ప్రాంతంలోనే ఎక్కువ రోజులు ఉండిపోయి కటారుపల్లిలో జీవసమాధి అయ్యారు. వేమన చెప్పిన యదార్థ సత్యాలను హృదయాల్లో ముద్ర వేసుకున్న జనం ఆయన్ను ఆరాధ్యుడిగా పూజిస్తున్నారు. అందుకే ఈ ప్రాంతంలో వేమన పేరు కలిగిన వారు ఎక్కువగా కనిపిస్తారు. యోగివేమన జయంతిని రాష్ట్ర పండగలా జరిపేందుకు ప్రభుత్వం ఈనెల 19న నిర్ణయించటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.పద్యాలతో సామాన్యుల్లో చైతన్యంసామాజిక రుగ్మతలు, మూఢనమ్మకాలను ఎండగట్టిన వేమన తన పద్యాలతో సమాజాన్ని జాగృతం చేశారు. అంతరాలు చూపే కులవ్యవస్థ, గుడ్డిగా నమ్మే ఆచార వ్యవహారాలను ఆయన తప్పుబట్టారు. దురాచారాల అడ్డుకట్టకు కటారుపల్లిలోని సమాధి వద్ద వేమన విహారంలో గోడలపై చెక్కిన పద్యాలు అద్దం పడుతున్నాయి.

## దేవుడి మాగాణి.. 'గుత్తా'ధిపత్యం

ఆలూరు : ఆలయ భూములు అక్రమార్కులకు ఆదాయ మార్గాలుగా మారాయి. మాన్యం భూములను స్థానిక నాయకులు గుప్పిట్లో పెట్టుకొని జేబులు నింపుకొంటున్నారు. వారే ఇతరులకు కౌలు(గుత్త)కిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాల పరిధిలో దాదాపు 64.5 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానిక నాయకులు పెత్తనం చేస్తున్నారు.

**పచ్చని పొలాలపై కన్ను**

హొళగుంద మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం మండల కేంద్రానికి రెండు కి.మీ. దూరంలో ఉంటుంది. పచ్చని పొలాల మధ్య కోవెల కొలువుదీరి ఉంది. 667(ఏ), 667(బీ) సర్వేనంబర్లలో 33.31 ఎకరాల మాగాణి ఉంది. ఇందులో రెండెకరాల విస్తీర్ణంలో ఆలయం, మండపం ఉంది. మిగిలిన పొలం హొళగుందకు చెందిన కొందరు నేతల చేతుల్లో ఉంది. వారు ఇతరులకు కౌలుకు ఇస్తున్నారు.కౌలుకు తీసుకొన్న వారు పక్కనే ఉన్న తుంగభద్ర దిగువ కాల్వ నుంచి నీటిని తీసుకొంటున్నారు. 90 శాతం మంది వరి సాగు చేస్తున్నారు. నేల సారవంతంగా ఉండటంతో ఎకరాకు 30 నుంచి 40 సంచుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఎకరానికి 10 నుంచి 14



సంచుల వడ్లు సదరు నేతకు ఇస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే ఆయా పొలాలపై అజమాయిషీ చేస్తున్నారు. అగ్రహారం ఆంజనేయస్వామికి చెందిన 33.31 ఎకరాల మాన్యం నుంచి వచ్చే ఆదాయం దేవాదాయశాఖకు చేరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డబ్బంతా నాయకుల జేబులోకి వెళ్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. చేసేది లేక కొందరు యువకులు విరాళాలు సేకరించి ఆలయ నిర్వహణ చేపడుతున్నారు.పట్టించుకోని దేవాదాయశాఖ

దేవాదాయ శాఖ చట్టం ప్రకారం ఆలయ భూముల కౌలు వేలం పాటలు ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాలి. ముందస్తుగా సంబంధిత గ్రామాల్లో దండోరా వేయించాలి. పత్రికల్లో ప్రకటనలు, మాన్యం వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలి.. కానీ ఇవేవీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహిస్తూ గతంలోని కౌలు కన్నా రూ.వందల్లో ఎక్కువ చూపించి పాత వారికే తిరిగి కట్టబెడుతున్నారు. జిల్లా పరిధిలోని 1,856 దేవాలయాల పరిధిలో 43,455 ఎకరాలు ఉండగా అర్చకులు, భజంత్రీ, పల్లకీ సేవకుల పరిధిలో 33,300 ఎకరాలున్నాయి. మిగిలిన భూములు సర్వీస్ ఇనాంగా ఉన్నాయి. 7,600 ఎకరాలకు ఏటా రూ.1.92 కోట్లు కౌలు రూపంలో వస్తుంది.

**ఇక్కడ వారి పరిధిలోనే..**

హొళగుంద మండలంలో మరో మూడు ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో మరో 64.50 ఎకరాల పొలం ఉంది. ఇవన్నీ తుంగభద్ర దిగువ కాల్వ చెంతనే ఉంటాయి. కాల్వ నుంచి పైపుల ద్వారా నీటిని మళ్లించుకొని వరి సాగు చేస్తుంటారు. ఏటా రెండు పంటలు సాగవుతాయి. ఎవరికి వారు ఆయా భూములు తమవే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వందల ఎకరాల భూమి ఉన్నా దేవాదాయ శాఖకు చెందిన అధికారులెవరూ ఇటు వైపు రావడం లేదు. " ఆలయాల భూములు ఎవరుపడితే వారు తమ ఆధీనంలో ఉంచుకొని వాటిని అనుభవిస్తున్నారు. ఇనాం భూములపై వస్తున్న ఆదాయం వారే ఆరగిం చేస్తున్నారు. ఇలాంటి వారిపై దేవాదాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని" రైతు వెంకటేశ్ వాపోయారు.

## ఉచితానికి చెల్లుచీటీ

ఆదోని : ఆదోని పట్టణంలో కొందరు ఉచిత ఇసుకు తూట్లు పొడుస్తున్నారు. పట్టణ శివారులో నిల్వ చేసి విక్రయిస్తున్నారు. ఏకంగా కార్యాలయం తెరిచారు.. వినియోగదారులకు రసీదులు ఇస్తున్నారు. లెక్కల పంపకాల్లో తేడా రాకుండా బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. రీచ్‌ల వద్ద టన్ను ఇసుక రూ.40కి తెచ్చి ఇక్కడ రూ.1200లకు అమ్ముతున్నారు. నిత్యం 40-50 ట్రాక్టర్లు, 5-8 టిప్పర్ల ఇసుక బేరం జరుగుతోంది. నిత్యం రూ.2.50 లక్షల వరకు సొమ్ము చేసుకొంటున్నారు.

తక్కువకు తెచ్చి.. ఎక్కువకు విక్రయం

తుంగభద్ర నదిలో సి.బెళగల్ మండల పరిధిలో ఐదు చోట్ల రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక తీసుకెళుతున్నారు. కౌతాళం మండలంలోని గుడికంబాలి, నదిచాగి, మరళి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోవడంతో తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు.రీచ్‌ల వద్దకు వెళ్లి రూ.40 చెల్లిస్తే టన్ను ఇసుక వస్తుంది. ఒక టిప్పర్‌లో 20 టన్నుల మేర పడుతుంది. అంటే ఒక టిప్పర్ ఇసుక ధర రూ.800, రవాణా కింద మరో రూ.6-7 వేలు చెల్లిస్తే సరిపోతుంది. పట్టణానికి చెందిన ఎవరు కూడా నేరుగా రీచ్‌ల నుంచి తెచ్చుకోవడానికి వీల్లేదు. అందరూ పట్టణంలోని ప్రైవేటు నిల్వ కేంద్రానికి వెళ్లాల్సిందే.
గత నాలుగు నెలల కింద ప్రైవేటు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక ట్రాక్టరు ఇసుకను రూ.3,600కి విక్రయిస్తున్నారు. ఒక దాంట్లో మూడు టన్నులు పడుతుంది.

**నేరుగా తెచ్చుకొంటే బెదిరింపులు**

ప్రస్తుతం పట్టణంలో నిర్మాణాల వేగం పెరిగింది. వినియోగదారులు నేరుగా రీచ్‌ల వద్ద తెచ్చుకొనే పరిస్థితి లేదు. తెచ్చు'కొంటే' అక్రమార్కులు బెదిరింపులకు దిగుతున్నారు. ఆదోని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల రీచ్ వద్ద టిప్పర్ ఇసుక తెచ్చుకొన్నారు. సదరు డ్రైవర్‌ను పోలీసులతో అరెస్టు చెయించారు. నిబంధనల పేరుతో రవాణాశాఖాధికారులతో దాడులు చేయించి ఇబ్బంది పెట్టారు.
పొలాలు, వంకలు, వాగులు తదితర ప్రాంతాల్లో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వ ఆదేశాలున్నా.. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల కార్మికులు వాటి జోలికి వెళ్లకుండా తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు. ఎవరైనా సాహసం చేసి ఇసుకను తెస్తే ఆ వాహనాన్ని ఏదో ఒక సాకుతో నేరుగా పోలీసు స్టేషన్లో పెట్టిస్తున్నారు.

## అక్కడ అందరూ.. 'తాపీ'గుంటారు..!

పుత్తూరు :అద్భుతమైన ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలంటే నేటి కాలంలో అందరూ ఇంజినీర్లను సంప్రదించి నిర్మాణాలు చేస్తున్నారు. కానీ పుత్తూరు, పలమనేరుకు చెందిన తాపీమేస్త్రీలు ఇంజినీర్లకు తీసిపోని విధంగా నిర్మాణాలు చేపడుతూ ఔరా అనిపిస్తున్నారు.

**గోవిందపాళెం మేస్త్రీలకు డిమాండు ఎక్కువే..**

పుత్తూరు మున్సిపాలిటీలోని గోవిందపాళెంలోని తాపీమేస్త్రీలకు భలే డిమాండ్. ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. అందరూ తాపీమేస్త్రీలే. పుత్తూరులో వందల భవనాలు వీరి చేతుల మీదుగా నిర్మించినవే. నగరిలో ఎన్ఎంసీ థియేటర్, తిరుపతి సంధ్య థియేటర్, కేఎస్ఆర్ కల్యాణ మండపం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితాయే



ఉంది. వంశపారంపర్యంగా ఇదే వృత్తిలో కొనసాగుతుండటంతో అందులోని మెలకువలు నేర్చుకుని ఆ రంగంలో రాణిస్తుండటం విశేషం.

**ఇంటికొకరు..**సాధారణంగా గ్రామాల్లో అందరూ ఒకే మాటకు కట్టుబడి ఉండటం చూశాం. కానీ ఆ గ్రామంలో మాత్రం అందరూ ఒకే పనిని ఎంచుకోవడం విశేషం. పలమనేరు మండలంలోని గొబ్బిళ్లకోటూరులో సుమారు 500 గృహాలు ఉన్నాయి. ఇక్కడ ఇంటికొకరు తాపీ పనివారు ఉంటారు. అయితే ఎందుకు అందరూ ఒకే రకం పని నేర్చుకున్నారంటే వారి దగ్గర సమాధానం లేదు. సమీప బెంగళూరులో నిర్మాణ పనుల కూలీలకు డిమాండు ఉండటంతో ఉపాధి నిమిత్తం వీరంతా ఎక్కువగా అక్కడికే వెళ్తుంటారు. గంగవరం మండలం బండమీదజరావారిపల్లెలో కూడా 90 శాతం మంది ఈ పని చేస్తున్నారు. పలమనేరు

## కట్టాలంటే కాసులమోత.. వికటిస్తే కూల్చివేత

తిరుపతి : తిరుపతిలోని తిరుమల బైపాస్ సమీపంలో ఓ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రూ.5 లక్షల లంచం తీసుకొని నిర్మాణానికి అనుమతించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి అధికారులు వాలిపోయారు. మరో రూ.4 లక్షలు తీసుకొని పనుల కొనసాగింపునకు ఆమోదించారు. రెండోసారి లంచం తీసుకున్న అధికారి బదిలీ కావడం.. అతని స్థానంలో వచ్చిన మరో అధికారి రూ.4 లక్షలు తీసుకొని పనులను చూసీచూడనట్లు వదిలేశారు. సుమారు రూ.13 లక్షల లంచం ఇచ్చుకున్నా.. ఆ భవన నిర్మాణంపై తీవ్ర విమర్శలు రావడంతో నగరపాలక కమిషనర్ కూల్చివేతకు ఆదేశించారు. మామూళ్లు తీసుకున్న అధికారులే దగ్గరుండి ఆపని చేపట్టడం గమనార్హం.

తిరుపతిలో ఎవరైనా భవన నిర్మాణం చేపట్టారంటే కొంతమంది అధికారులు కాకుల్లా వాలిపోతున్నారు. ఏవేవో నిబంధనలు చెప్పి బెదిరిస్తారు. అడిగినంత ఇచ్చుకుంటే అటువైపు కన్నెత్తి చూడరు. బయటి వ్యక్తులు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే.. భవనం కూల్చినట్లు ఉన్నతాధికారులను ఫొటోలతో ఏమార్చుతారు. తప్పనిసరిగా కూల్చాల్సి వస్తే.. లంచం ఇచ్చిన వ్యక్తికి మొండిచేయి చూపించి కూలగొడతారు. ఈ తతంగం తిరుపతి నగరంలో సాధారణమై పోయింది.

**కక్కలేక.. మింగలేక..**

తిరుపతి నగరంలో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది అధికారులు దొడ్డిదారిన అనుమతులిస్తూ అడ్డగోలుగా జేబులు నింపుకొంటున్నారు. ఇన్నాళ్లు దర్జాగా సాగిన వీరి అవినీతి దందాకు ప్రభుత్వం కళ్లెం వేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ, అనధికారక భవనాలు, అంతస్తులను కూల్చివేయాలని ఆదేశించడంతో.. కొందరి పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్లుగా మారింది. దీంతో కొత్త నాటకాలు ప్రారంభించారు. ఇన్నాళ్లు అక్రమ నిర్మాణాలను



ప్రోత్సహించిన అధికారులే కూల్చివేతలకు ఎగబడుతుండటంతో అక్రమ భవన నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైంది. అప్పుడే అన్ని అనుమతులు తీసుకొని.. ప్రభుత్వానికి రుసుములు చెల్లించినా సరిపోయేదని ఇప్పుడు మదనపడుతున్నారు.

**అనుమతులు సాధ్యం కాదని..**

తిరుపతిలో నిషేధిత జాబితా భూములు, తితిదే భూములు, కాలువ పోరంబోకు స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో నిర్మాణాలకు అనుమతులు పొందడం సాధ్యం కాదు. ఇదే ఆ విభాగం అధికారులకు కలిసిస్తోంది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నారు.

**అవగాహన లేకే..**

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భవన నిర్మాణాలు, లేఅవుట్ల ఏర్పాటు కోసం సింగిల్ విండో విధానాన్ని తీసుకువచ్చింది. అనుమతులు సులభతరం చేసింది. ఆన్‌లైన్ విధానంలో పలు రకాల మినహాయింపులతో గంటల వ్యవధిలోనే అనుమతులు పొందే ఏర్పాట్లు చేసింది. ఐదు అంతస్తుల భవనాలకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన లైసెన్స్డ్ ఇంజినీర్ల ద్వారా దరఖాస్తు చేసి రుసుములు చెల్లిస్తే అనుమతులు సులువుగా వచ్చేస్తాయి. వీటిపై చాలామందికి అవగాహన లేకపోవడంతో అధికారులతో లాలూచీ పడుతున్నారు.

# 4.82 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి



అనంతపురం : జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలోని నాలుగు క్షేత్రాల్లో 4.82 కోట్ల చేప పిల్లలను పెంచారు. అందులో ఒక్క పీఏబీఆర్ మత్స్య క్షేత్రంలో 2.06 కోట్ల పిల్లలను అత్యధికంగా ఉత్పత్తి చేసి ప్రగతి సాధించారు. పెద్ద చేప పిల్లల సరఫరాకు రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలిచారు. ఒక్కో పిల్లను రూ.1.68 పైసలు చొప్పున టెండర్లు ఖరారు చేశారు. లైసెన్సు ఉన్న జలాశయాలకు ఉచితంగా పంపిణీ చేయగా, మత్స్య సహకార సొసైటీలకు రాయితీతో చేపల పిల్లలు అందించనున్నారు. 8 ఎం.ఎం. పొడవున్న 4.23 కోట్ల పిల్లలు, 100 ఎం.ఎం. 59.25 లక్షలు చొప్పున చేప పిల్లలు పెంచారు. అందులో పీఏబీఆర్ క్షేత్రంలో మత్స్య అభివృద్ధి అధికారి పెద్దబాబునాయక్ ప్రత్యేక చొరవతో 2,05,75,000 అత్యధికంగా పెంచారు. అనంతపురం క్షేత్రంలో 1.12 కోట్లు, ఎంపీఆర్ డ్యాం క్షేత్రంలో 93 లక్షలు, భైరవానితిప్ప క్షేత్రంలో 72.50 లక్షలు చొప్పున సిద్ధంగా ఉన్నాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద చేపపిల్లలను పంపిణీ చేయనున్నారు. మూడు జలశయాలకు ఉచితంగా: జిల్లాలోని మిడ్‌పెన్నార్ జలాశయానికి 12 లక్షలు, భైరవానితిప్పకు 10.50 లక్షలు, కడప జిల్లా గండికోట జలాశయానికి 36.75 లక్షలు చొప్పున ఉచితంగా 100 ఎం.ఎం. చేప పిల్లలను సరఫరా చేస్తారు.

జిల్లాలోని 22 చెరువులకు 14.83 లక్షలు చేప పిల్లలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.


**రాయితీలు ఇలా..** మత్స్య సహకార సొసైటీలకు, రైతులకు రాయితీతో పంపిణీ చేస్తారు. జనరల్‌కు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం చొప్పున రాయితీ ఇస్తారు. మిగిలిన వాటా చెల్లించాల్సి ఉంటుంది.

కలెక్టర్ నుంచి అనుమతి రాగానే..

చంద్రశేఖర్‌రెడ్డి, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి డీడీ

జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తిలో ముందున్నాం. ఈసారి కడప జిల్లా గండికోట జలాశయానికి 36.75 లక్షల చేప పిల్లలు, ఎంపీఆర్ డ్యాం, బీటీపీకి 22.50 లక్షలు సరఫరా చేయాలని రాష్ట్ర అధికారులు కేటాయించారు. ఆ ప్రకారం చేప పిల్లలు సిద్ధం చేశాం. కలెక్టర్ అనుమతి రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

# వారధి.. కష్టాలు తీరే దారేదీ?



రాయదుర్గం: వాగులు దాటేందుకు ప్రతిఏటా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. నివారణకు వారధులు నిర్మించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాయదుర్గం డివిజన్‌లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం కాజ్‌వేలపై వాగులు, వంకలు ఉద్ధృతంగా పొంగి పొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. నీటి ఉద్ధృతి తగ్గేవరకు ఒకటి రెండు రోజులు కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉండాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ఇతర మార్గాలను చుట్టేసి గమ్యస్థానాలు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**క్షణక్షణం భయంతో ప్రజలు**

కణేకల్లు మండలంలోని గరుడచేడు- మీనహళ్లి నడుమ లోతట్టు వంతెన శిథిలావస్థకు చేరింది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కిందటి జూన్‌లో వంతెన కోతకు గురైతే గ్రామస్థులే మట్టిపోసి తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నారు. బిదురుకొంత సమీపంలో వ్యాసాపురం దారిలో పీఆర్ కల్వర్టు కూలిపోగా.. తాత్కాలికంగా మట్టి వేసుకొని గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో కణేకల్లు- ఉరవకొండ ర.భ రోడ్డులో సొల్లాపురం వద్ద కాజ్‌వేపై వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో తరచుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**అధికారులకు విన్నవిస్తున్నా..**

హనకనహాళ్- సొల్లాపురం దారిలో వర్షాకాలంలో రెండుచోట్ల వంకలు ఉద్ధృతంగా ప్రవహంతో వాహనాలు, బస్సుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. హనకనహాళ్- బెళుగుప్ప నడుమ రోడ్డుపై వాగు వెళ్తుండటంతో అవస్థలు తప్పడం లేదు. హనకనహాళ్ గ్రామస్థులకు చుట్టుపక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. దీంతో ప్రజలది ఎటూ కదలని పరిస్థితి. నివారణకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన కరవైంది. లోతట్టు కల్వర్టుల వద్ద ప్రవాహం వల్ల బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఇటీవల ఓ ప్రైవేటు బస్సు రాత్రిపూట వాగులో ఇరుక్కుపోవడంతో స్థానికులు అప్రమత్తమై ట్రాక్టరు సాయంతో లాగి గట్టెక్కించడంతో ముప్పు తప్పింది. అత్యవసర సమయాల్లో ఉరవకొండకు వెళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ప్రతిపాదనలు పంపాం**

రవిశంకరరెడ్డి, ర.భ డీఈ

కణేకల్లు మండలంలోని లోతట్టు వంతెనలను ఇదివరకే గుర్తించాం. ఎత్తు వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభిస్తాం. మరికొన్ని ప్రాంతాల్లోనూ ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉంది.

# మీ హెల్మెట్.. నాణ్యమైనదేనా?

తిరుపతి : శిరస్త్రాణం (హెల్మెట్) ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా.. ఆపై కేసులు.. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని పోలీసు, రవాణా శాఖలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శిరస్త్రాణధారణ తప్పనిసరిగా మారింది. పట్టుబడిన ప్రతిసారీ రూ.వెయ్యి జరిమానా చెల్లించే కంటే ఒకసారి కొంటే సరిపోతుందనే భావన ద్విచక్ర వాహనదారుల్లో వచ్చింది.సరే.. కొందామని చూస్తే ప్రతి కూడలిలో వెలసిన దుకాణాల వద్ద రూ.500 చెప్పి.. చివరకు రూ.250కి ఇస్తున్నారు. నాణ్యమైనదేనా అని అనుమానం వ్యక్తపరిచేలోగా దుకాణదారు ఐఎస్ఐ మార్క్ చూపిస్తున్నారు. ఇదే ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ షోరూమ్‌లో రూ.700 - రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏది నిజమైన ఐఎస్ఐ మార్క్ శిరస్త్రాణమో తెల్చుకోలేక గందరగోళ పరిస్థితుల్లో ద్విచక్ర వాహనదారులు ఉన్నారు.

**ప్రాణాలకు ఎలాంటి రక్షణ**

ఫైబర్ గ్లాస్, పాలీ కార్బొనేట్, కంపోజిట్ పదార్థాలతో చేసిన హెల్మెట్ బయటి పొర మొదట దెబ్బను స్వీకరించి.. పదునైన వస్తువులను తలలోకి చొచ్చుకెళ్లకుండా అడ్డుకుంటుంది.

బయట పొర తర్వాత ఉంటే ఈపీఎస్ ప్రమాద సమయంలో మెదడుపై పడే దెబ్బ తీవ్రతను తగ్గిస్తోంది.

ఈపీఎస్ మీద ఉండే మృదువైన పొరే కంఫర్ట్ ప్యాడింగ్. హెల్మెట్ తలపై కదలకుండా ఉండేలా చూస్తుంది.


చిన్‌స్ట్రాప్ బిగువుగా లేకపోతే ఖరీదైన హెల్మెట్ కూడా పనికిరాదు.

గాలి, దుమ్ము, వర్షం, పురుగుల నుంచి కళ్లను విజర్ రక్షిస్తోంది.

శిరస్త్రాణం బయట కనిపించే కవచమే కాదు.. లోపలి పొరలూ రక్షిస్తాయి. హెల్మెట్లో గాలి ప్రసరణ, లోపల వేడి, చెమటను తగ్గించే సౌకర్యాలు వెంటిలేషన్ సిస్టమ్ సమకూర్చుతుంది.

**ఎలాంటివి పెట్టుకోవాలంటే..**

భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) రూపొందించిన ఐఎస్-



4151:2015 హెల్మెట్ను మాత్రమే పెట్టుకోవాలి. ః ఇది 1,500 గ్రాముల బరువు మించకూడదు.

అధిక బరువున్నవి మెడపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ః రోజువారీ వినియోగానికి ఫుల్ ఫేస్, లోయర్ ఫేస్ కవర్ ఉన్నవి వాడాలి.


సరైన పరిమాణం, బిగువైన చిన్ స్ట్రాప్ ఉండేలా చూసుకోవాలి. ః ప్రమాదానికి గురైన హెల్మెట్, లోపల పగుళ్లు ఉన్నవాటిని వాడకూడదు.

**అధీకృత డీలర్ల వద్ద కొనండి**

నాణ్యత లేని శిరస్త్రాణం ధరించినా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలకు భద్రత ఉండదు. రూ.రెండు, మూడు వందల కోసం నాసిరకం వాటిని కొన్నా ఫలితం ఉండదు. ప్రస్తుతం ఐఎస్ఐ మార్క్‌తో అందరూ మోసగిస్తున్నారు. తీసుకున్న డబ్బుకు బిల్లు ఇచ్చే అధీకృత డీలర్ల వద్ద హెల్మెట్లు కొనుగోలు చేయండి. లోపలి నిర్మాణం సరిగ్గా ఉన్న శిరస్త్రాణాలతో ప్రాణభద్రత లభిస్తుంది.

## రైట్ రైట్

తిరుపతి : తిరుపతిలోని ఏపీఎస్ ఆర్టీసీ కేంద్రీయ బస్టాండ్ స్థానంలో నూతనంగా ఇంటర్ మోడల్ బస్టాండ్(ఐఎంఎస్) నిర్మాణానికి దాదాపు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో శ్రీవారి భక్తులకు అంతర్జాతీయ ప్రమాణాలతో వసతులు కల్పించేలా బస్టాండ్ అభివృద్ధికి రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) సంస్థ ముందుకొచ్చింది. గతంలో ఇందుకు సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీతో ప్రాథమికంగా ఒప్పందం చేసుకుంది. ఆర్టీసీ బస్టాండ్, డిపోకు కలిపి 13 ఎకరాలు ఉండగా, అందులో కొంతభాగంలో ఆధునిక హంగులతో బస్టాండ్ నిర్మించనున్నారు.



**త్వరలో ఆర్టీసీ ఎండీ సమీక్ష**

ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి త్వరలో తిరుపతి లేదా విజయవాడ కేంద్రంగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఎన్‌హెచ్ఎల్ఎంఎల్, రైట్స్ ప్రతినిధులతో సమీక్షించనున్నారు. ఈ సమీక్ష ద్వారా టెండర్ ప్రక్రియ ఓ కొలిక్కి రానుంది.

**పూర్తిగా విద్యుత్తు బస్సులు నడిపేలా..**

గతంలో డీజిల్ బస్సులను దృష్టిలో ఉంచుకొని డీపీఆర్ సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో ఆర్టీసీలో పూర్తి స్థాయిలో విద్యుత్తు బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల కేంద్రం ఈ-బస్ సేవ పథకం కింద రాష్ట్రానికి 750 విద్యుత్తు బస్సులను కేటాయించింది. వీటికి అదనంగా తిరుమల-తిరుపతికి నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు 300 బస్సులను కోరగా అంగీకరించింది. నూతనంగా నిర్మించే ఇంటర్ మోడల్ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం వద్దే బస్సులకు ఛార్జింగ్ చేసుకునేలా, బస్టాండ్‌లో అత్యవసర నిమిత్తం మినీ డిపో గ్యారేజీ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

## ప్రకృతికి తిరిగి ఇచ్చేయాల్సిందే..!

శ్రీకాళహస్తి :'ప్రకృతి నుంచి తీసుకుంది.. మళ్లీ ప్రకృతికి ఇచ్చేయాల్సిందే' అన్న అంతర్ సూత్రంతో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను తయారు చేశారు. ఇటీవల నాయుడుపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో ఉత్తమంగా నిలిచి.. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. ఆ ప్రదర్శనలో పాల్గొనేందుకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

**పనితీరు ఇలా..**కూరగాయల వ్యర్థాలను ఏరోబిక్ కంపోస్టింగ్ పద్ధతి ద్వారా మొక్కలకు అనువైన ఎరువుగా మార్పు చేయడం ఈ ఆవిష్కరణ ప్రధాన లక్ష్యం. కూరగాయల ద్వారా వచ్చే వ్యర్థాలు బయట పడేస్తే




కుళ్లి పోవడంతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశముంది. అదే మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వ్యర్థాలు నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం ఎక్కువగా ఉన్న ఎరువుగా సిద్ధమవుతుంది. ఈ మూడు స్థూల పోషకాలు మొక్కల ఎదుగుదలకు ఎంతో అవసరం. ప్రకృతి నుంచి తీసుకున్నది మళ్లీ ఇలా తిరిగి ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని, ఇదే సూత్రంతో దీన్ని తయారు చేసినట్లు వివరించారు.

## మత్స్యకారులకు కూటమి తీపి కబురు

గూడూరు : కూటమి ప్రభుత్వం సముద్రంలో వేటకు వెళ్లే జాలర్లకు తీపి కబురు అందించింది. వారికి రాయితీతో కూడిన పడవలు, వలలు, ఇంజిన్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. అర్హులైన మత్స్యకారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా వెబ్‌సైట్ను రూపొందించారు. జిల్లాలోని వాకాడు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ప్రస్తుతం 479 దరఖాస్తులు వచ్చాయి.

వివరాలిలా.. జిల్లాలో తీర మండలాలు- వాకాడు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ. తీర గ్రామాలు-25

మత్స్యకారులు- 20 వేల మంది జాలర్లు- 3753



పడవలు- 800

దరఖాస్తులు- 479

**అందించేవి ఇవే..** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం రాయితీతో కూడిన పడవలు, వలలు, ఇంజిన్లు ఇవ్వనున్నారు. మత్స్యకారుల్లో బీసీలకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీతో ఇవ్వనున్నారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.5 లక్షలు. దీంతో పడవ, వల, ఇంజిన్ కొనుగోలు చేయవచ్చు. పడవ రూ.60 వేలు- రూ.2.50 లక్షలు, ఇంజిన్ రూ.90 వేలు - రూ.2 లక్షల వరకు ఉంటుంది. వల వంద కేజీల నుంచి 500 కేజీల వరకు రూ.1 లక్ష విలువ చేస్తుంది. ప్రభుత్వ రాయితీ పోనూ మిగిలిన మొత్తాన్ని మత్స్యకారులు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ వివరణ కోరగా రాయితీతో కూడిన పరికరాలు మత్స్యకారులకు అందిస్తున్నామన్నారు. దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తికాగానే త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు.

# చేయి తడిపితేనే చేను చూసేది!

కాకినాడ : రెవెన్యూలో కీలకమైన సర్వేశాఖ గొలుసు తప్పుతోంది. బాధితుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. పైసలిస్తేనే పొలంలోకి వస్తున్నారు. లేకుంటే నెలలు తరబడి కాలయాపన చేస్తూ రైతులను తిప్పుతున్నారు. కొందరు భూమిలోకి వెళ్లకుండానే సర్వే చేసినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సైతం తప్పుబడుతున్నారు. ఇటీవల వివిధశాఖల తీరుపై ప్రభుత్వం సేకరించిన సంతృప్తిస్థాయి నివేదికల్లో సర్వేయర్ల తీరుపై అంతటా పెదవివిరుపే వినిపిస్తుంది.

**వారికి ఇక్కట్లు.. వీరికి కాసులు**



గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే రైతులను చిక్కుల్లోకి నెట్టింది. సాగు విస్తీర్ణం తగ్గించి చూపడం, పట్టా భూములను అసైన్డ్ భూములుగా నమోదు చేయడంతో మరలా సర్వేలు చేయించాల్సి వస్తోంది. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లోని భూమి మొత్తం ఒకే రైతు పేరుపై చూపడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైపోతున్నారు. వీటిపై అర్జీలు ఎక్కువగా రావడంతో జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడే సర్వేయర్లు చేతివాటం చూపుతున్నారు. బిక్కవోలు మండలం బలబద్రపురం సచివాలయం పరిధిలో నిర్వహించిన సర్వేలో మీ అర్జీకి సర్వేయర్ నోటీసు ఇస్తున్నారా అని అడిగితే నూరు శాతం ఇవ్వలేదనే సమాధానం

# ఈవీ ఛార్జింగ్.. ఇకపై ఈజీగా..

రాజమహేంద్రవరం : కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీ(ఎలక్ట్రిక్ వాహన) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దానికి తగ్గట్లుగా ఇంధన ధరలకు భయపడి ప్రజలు విద్యుత్తు వాహనాల వైపు అడుగులేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యుత్తు వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వాటికి అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీ ఈపీడీసీఎల్ పీఎం ఈ-డ్రైవ్ పథకంలో కొత్తగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీస్థలాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నారు. కేటగిరీ-ఏ కిందకు వచ్చే కలెక్టరేట్, నగరపాలక సంస్థ, ఆర్టీసీ, ప్రభుత్వ కళాశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.

**వాహనాలు పెరిగినా.. ఛార్జింగ్ స్టేషన్లు లేక..**

జిల్లాలో గత అయిదేళ్లతో పోల్చితే ఈవీల వినియోగం విపరీతంగా పెరిగింది. అయిదేళ్ల క్రితం కేవలం 2వేల లోపే ఉన్న వాహనాలు ప్రస్తుతం అన్ని రకాలు కలిపి 9,009కు పెరిగాయి. ఈవీల కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నా బడ్జెట్ ధరల్లో వాహనాలు లేకపోవడం, ఛార్జింగ్‌కు ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలున్నాయి. ఇంటి దగ్గర ఛార్జింగ్ పెట్టుకుంటే అధిక విద్యుత్తు బిల్లుతో సంక్షేమ పథకాలు ఆగిపోతాయని కూడా కొందరు భయపడుతున్నారు. ఛార్జింగ్ స్టేషన్లు విరివిగా అందుబాటులోకి వస్తే ఈవీల వైపు అంతా



అడుగేస్తారు.

**ఈ ప్రాంతాల్లో..**

గతంలో 100 శాతం రాయితీ ఇస్తామని ప్రతిపాదించినా, ప్రస్తుతం 80 శాతం ఇస్తామని చెబుతున్నారు. జిల్లాలోని రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు, హకుంపేట పంచాయతీలు, రాజమహేంద్రవరం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, లూథర్‌గిరి సచివాలయం, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయం, లాలాచెరువు సబ్‌స్టేషన్, కంబాలచెరువులోని హైటెక్‌బస్టాండ్, నల్లజర్లలోని సబ్‌స్టేషన్, రాజానగరంలోని దివాన్‌చెరువు సబ్‌స్టేషన్, కోరుకొండలోని సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్
అన్నిరకాలు: 2,847
బ్యాటరీ ఆధారితం: 4,581
కొవ్వూరు డివిజన్ అన్నిరకాలు: 594
బ్యాటరీ ఆధారితం: 987
ఒక కారు ఛార్జింగ్‌కు
వినియోగించే విద్యుత్తు: సుమారు 30 యూనిట్లు
ఒక యూనిట్‌కు వసూలు చేసే ఛార్జి: రూ.21-23

# ఆలయాల ముస్తాబు

ఆత్రేయపురం : ఏకాదశి పర్వదినం సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర, అంతర్వేది లక్ష్మీనరసిం హస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆలయాల్లో స్వామివార్లు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాడపల్లిలో ఆలయ ప్రాకార మండపాలు, గోపురాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భక్తులు దర్శించు కునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం పల్లిపాలెం అగ్నికులక్షత్రియులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాల అభిషేకం చేస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# ఎస్సార్బీ 'ఛీ'



నంద్యాల : 1.90 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్సార్బీసీ పనులు మధ్యలో ఆగిపోయాయి. సుమారు 18 ఏళ్ల కిందటే ఎస్సార్బీసీకి చెందిన అత్యధిక పనులు పూర్తిచేయగా 36, 37, 38 ప్యాకేజీల్లోని పనులు అప్పట్లోనే పెండింగులో ఉంచారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా మూడు ప్యాకేజీల పనులు వదిలేశారు. ఇవి పూర్తయితే సుమారు 29,200 ఎకరాలు సాగులోకి వచ్చేది.

**ప్రతిపాదనతోనే సరి..**

పెండింగు పనులు పూర్తిచేయడానికి రూ.268 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనావేశారు. కేవలం 57 కి.మీ. మేర కాలువల నిర్మాణం చేస్తే మొత్తం 29,200 ఎకరాలకు నీరందుతుందని నిర్ధారించారు. గతంలో పంపిన ప్రతిపాదనలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా మార్చి వైకాపా హయాంలోనే నూతన ప్రతిపాదనలను పంపినా.. పనులకు మోక్షం కలగలేదు.

**క్రమంగా పెరుగుతూ..**

ఎస్సార్బీసీకి సంబంధించిన పనులన్నీ 2007లో పూర్తయ్యాయి. అప్పట్లోనే 57 కి.మీ.ల మేర కాలువలు నిర్మిస్తే కేవలం రూ.70 కోట్ల లోపు నిధులు సరిపోయేవి. నాడు ఆయా పనులు చేయకపోవడంతో వదిలేసిన కొద్దిపాటి పనుల విలువ క్రమంగా పెరుగుతూ ప్రస్తుతానికి రూ.268 కోట్లకు చేరింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోపాటు గుత్తేదారులకు బిల్లులన్నీ చెల్లించేశారు.

**అగచాట్లు**

ఎస్సార్బీసీ ప్రధాన కాలువ పనులు సంజామల మండలంలో పేరుసోముల గ్రామం వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి ప్రధాన కాలువ పనులు చాలాచోట్ల పూర్తిచేయకుండా నిలిపివేశారు. ఫలితంగా మైలవరం జలాశయానికి రావాల్సిన నీరు రావడంలేదు. సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లోని వేలాది ఎకరాలకు నీరందని దుస్థితి తలెత్తింది. అవుకు జలాశయం నుంచి ఎస్సార్బీసీకి పంపడానికి సాగునీరు అందుబాటులో ఉన్నా కాలువలు లేని కారణంగా ఆయకట్టుకు నీరివ్వలేని దుస్థితి నెలకొంది.

**నిధులు పక్కదారి**

ఎస్సార్బీసీ కింద కొన్ని పెండింగు పనులు ఉండగానే వాటిని అర్ధాంతరంగా నిలిపివేసి బిల్లులు చెల్లించడంపై పలు ఆరోపణలున్నాయి. గుత్తేదారుల నుంచి కొందరు నేతలు దండుకుని ఆయా చెల్లింపులన్నీ పూర్తయ్యేలా చేశారన్న విమర్శలు ఉన్నాయి. నాటి నేతల ధనదాహం కారణంగా నేడు సుమారు నాలుగువేల మంది రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**ఒట్టిపోయిన 12 వేల ఎకరాలు**

ప్యాకేజీ 36, 37ల పరిధిలో చేపట్టాల్సిన పనులన్నీ నంద్యాల జిల్లాలోనే ఉన్నాయి. సంజామల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఆయా కొద్దిపాటి పనులు పూర్తిచేస్తే 12 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. దీంతోపాటు 37వ ప్యాకేజీ కింద పనులు పూర్తిచేస్తే ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 17,200 ఎకరాలకు నీరందుతుంది.

# పునాదులు కూల్చిన 'భూ'తాలు



కర్నూలు : నగరంలో భూమాఫియా రెచ్చిపోతోంది.. ఏకంగా పక్కా గృహాలు, ప్రహరీలు కూల్చి ఆక్రమించేస్తున్నారు. కోడుమూరు రోడ్డులో ఎస్‌డబ్ల్యూసీ గోదాములకు ఎదురుగా ఉన్న రహదారికి ఆనుకుని ఉన్న 3.50 ఎకరాల భూమిని కబ్జా చేశారు. కల్లూరు మండల పరిధిలోని సర్వే నంబరు 292లో సుమారు 3.95 ఎకరాలను కొందరు దశాబ్దాల కిందట కొనుగోలు చేశారు. అందరికీ చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. కొనుగోలుదారుల్లో కొందరు ఇతరులకు స్థలాలు విక్రయించారు. కొందరు మాత్రం నగరపాలక సంస్థ అనుమతులు తీసుకుని భవనాలు నిర్మించుకున్నారు. మరికొందరు స్థలాల చుట్టూ ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా భూములు కోడుమూరు రోడ్డుకు కూతవేటు దూరం ఉండటం.. దాని వెనక భాగంలో పలు నిర్మాణాలు వెలియడంతో ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ.10 కోట్లకుపైగా పలుకుతోంది.

**బాధితుల గగ్గోలు**

ఆ భూముల్లోకి బుల్డోజర్లతో వెళ్లి అక్కడున్న ఓ ఇంటిని పూర్తిగా కూల్చేశారు. ప్రహరీని ధ్వంసం చేశారు. భూమిలో ఉన్న హద్దు రాళ్లను పెకిలించేశారు. పక్కాగా నిర్మించిన కొన్ని భవనాలను వదిలేసి మిగిలిన భూమి మొత్తానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. వారి మనుషులను అక్కడ కాపలాగా ఉంచి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆక్రమణదారులకు కొందరు తెదేపా నేతల అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

**నిందితులపై కేసులు**

సర్వే నెంబరు 292లో స్థలాలు కొనుగోలు చేసిన కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు అక్టోబరు 8న కేసు కూడా నమోదు చేశారు. ఆస్తులను ధ్వంసం చేయడం, ఇతరుల ప్రాంగణాల్లోకి అక్రమంగా చొరపడడంతోపాటు అడ్డువచ్చిన వారిపై దౌర్జన్యం చేశారన్న సెక్షన్లతో జనార్దన్ ఆచారి, తెలుగు మహేశ్, వడ్డే నాగేశ్వరరావు, దేవేంద్రకుమార్ తదితరులపై కేసు నమోదైంది.

**ఏళ్ల కిందట కొనుగోలు చేశామని....**

" 1913లో అహ్మద్ హుస్సేన్ ఖాద్రి నుంచి మా నాన్న కేశవ ఆచారి 3.95 ఎకరాలు కొనుగోలు చేశారు.. 1914లో ప్రభుత్వం రైతువారీ పట్టా ఇచ్చిందని " ఎస్.డి.చారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాన్న 1991లో చనిపోవడంతో ఆ భూమి తన ఆధీనంలో ఉందని.. ఆ భూమికి ఇన్‌జంక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తమ దగ్గరున్న దస్తావేజులు, భూమి తమదని నిరూపించే ఆధారాలను బాధితులు న్యాయస్థానానికి సమర్పించారు. ఎస్.డి.చారికి ఇచ్చిన ఇన్‌జంక్షన్ ఉత్తర్వులను జడ్జి రద్దు చేశారు.

**ఇల్లు నేలమట్టం : రాజు, బాధితుడు**

కల్లూరులో సర్వే నంబరు 292లో నాకున్న రెండున్నర సెంట్లలో చిన్న ఇల్లు కట్టించా. విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకు ఎక్కువ మొత్తం చెల్లించాలని డిమాండు చేయడంతో ఆ మొత్తం చెల్లించలేక ఆ ఇంటిని ఖాళీ చేశా. ఆ ఇంటిని మొత్తాన్ని అడ్డగోలుగా కూల్చేసి నా ప్లాటు ఆక్రమించారు. నాతోపాటు సుమారు 30 మందికి సంబంధించిన స్థలాలను సైతం ఆక్రమించుకున్నారు.

**ప్రహరీ పడగొట్టారు : కృష్ణమూర్తి, బాధితుడు**

నా సోదరుడు కె.శ్రీనివాసులు 80 సెంట్ల స్థలాన్ని 2007లో కొనుగోలు చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అతని పేరుతో అడంగల్, పాస్‌బుక్ ఉన్నాయి. వ్యవసాయ భూమి కావడంతో ప్రభుత్వానికి రూ.5 లక్షలు చెల్లించి వ్యవసాయేతర భూమిగా 2013లో మార్చుకున్నాం. ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేసుకున్నాం. ప్రహరీ ఆనవాళ్లు లేకుండా కూల్చేశారు.

# ఆరోగ్యం గజగజ

కర్నూలు : గతంలో ఎన్నడూలేనివిధంగా సీమలో కనిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.. వెన్నులో వణుకు పుట్టిస్తున్న చలితో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఊపిరి ఆడక ఉక్కిబిక్కిరి అవుతున్నారు. గత 20 రోజులుగా కర్నూలు, నంద్యాల సర్వజన వైద్యశాలల్లోని జనరల్ మెడిసిన్, చర్మ, గుండె తదితర విభాగాలకు వాచ్చేవారి సంఖ్య రెట్టింపు అయ్యింది. పలువురు ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు.

శిశువిలాపంచిన్నారుల విభాగం కిక్కిరిసిపోతోంది. ఇందులో ఎక్కువ మంది ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.. కొందరు న్యుమోనియాతో అల్లాడుతున్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో వస్తున్నారు. తక్కువ బరువుతో పుట్టిన చిన్నారులు.. అనారోగ్యంతో పుట్టినవారి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటుంది. నెలలోపు వయసున్న శిశువులకు హైపోథర్మియా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటన్నిటిని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్యాన్లు, ఏసీలకు దూరంగా పిల్లలను పడుకోబెట్టాలి. స్వెటర్లు తొడగటం, కాళ్లకు సాక్సులు, చేతులకు గ్లౌజులు వేయాలి. చిన్నారులకు ఎట్టి పరిస్థితిలోనూ బయటి ఆహారం పెట్టకూడదు. చల్లని పానీయాలను దూరంగా ఉంచాలని వైద్యులు పేర్కొంటున్నారు.చర్మ పొడిబారుతోందిచర్మ సంరక్షణకు ప్రత్యేకంగా మాయిశ్చర్స్ వాడాలి. ఆయిల్ సబ్బులు వినియోగించాలి. చలి రక్షణ దుస్తులు, మంకీ క్యాప్‌లు వాడాలి. వెరికోస్, సొరియాసిస్‌తో బాధపడేవారికి చర్మ సంబంధిత సమస్యలు అధికంగా వస్తాయి. ఈ నేపథ్యంలో ఉదయం, రాత్రివేళల్లో మాయిచర్స్ పూసుకోవాలి. చల్లని, వేడి నీటికంటే గోరు వెచ్చని నీటితో స్నానం చేస్తే మంచిది." వసతిగృహాల్లో ఉండేవారిలో ఎక్కువగా చర్మం పొడిబారుతూ ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకుంటే దురదలు, గజ్జి, తామర వంటి బారిన పడతారు. గోరు వెచ్చని నీటితో స్నానం చేస్తే మేలని" అసోసియేట్ ప్రొఫెసర్ డా.గౌతమి సూచించారు.వణుకుతున్న పెద్దలుఆస్తమా, సీవోపీడీ ఉన్న వృద్ధులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరింత ఇబ్బంది పడుతున్నారు. వీటిని నియంత్రణలో ఉంచుకోకుంటే బ్రెయిన్ స్ట్రోక్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. " వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉదయం, రాత్రి వేళల్లో చలిలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఊపిరి ఆడని సమస్యలతో బాధపడేవారు ఇన్‌హేలర్లు అందుబాటులో ఉంచుకోవాలి. దోమలు, కీటకాలతో డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడే ప్రమాదముంది తప్పనిసరిగా నియంత్రణలో ఉంచుకోవాలని" ప్రొఫెసర్ డా.లక్ష్మీబాయి తెలిపారు.

# మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్లు కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

# ఉపాధి పని దినాల పెంపు

రావులపాలెం : ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 100 రోజులు ఉండేవి. వీటిని 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, వేతనదారులకు మేలు చేకూరనుంది.

**3.36 లక్షల మందికి ప్రయోజనం**

అంబేడ్కర్ కోరసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 2.2 లక్షలు ఉండగా ఉపాధి శ్రామికులు 3.36 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పాడి పశువులకు గోకులం షెడ్లు, మ్యాజిక్



డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. రోజుకు శ్రామికులు గరిష్ట వేతనం రూ.307 పొందుతున్నారు.

**త్వరలోనే అమలు**

వంద రోజుల నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అమలు చేస్తాం. పనిదినాలు పెరగడం వల్ల వేతనదారులకు గరిష్ఠ ఆదాయం వస్తుంది. మధుసూదన్, డ్వామా పీడీ

# 'సూర్య'డర్

నంద్యాల : దేశవ్యాప్తంగా కోటి సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం 'సూర్యఘర్ యోజన'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పథకం వినియోగించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా బ్యాంకర్ల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. వివిధ కొర్రీలు పెట్టి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

**సదుద్దేశంతో శ్రీకారం చుట్టినా..**

కర్నూలు జిల్లాలో 6,46,025, నంద్యాల జిల్లాలో 5,21,518 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో 2,200, కర్నూలు జిల్లాలో 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులకు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ల కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు.

ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,67,543 మంది విద్యుత్తు వినియోగదారులు ఉండగా.. వారిలో కనీసం 0.5 శాతం మందికి కూడా 'సూర్యఘర్' అందని పరిస్థితి నెలకొంది.

**రూ.కోటి అవకాశం కోల్పోయినట్లే..**

గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది.

# నార్త్ - సౌత్ మధ్య తేడా ఇదే..

ప్రముఖ నటి ప్రియమణి తెలుగు, తమిళ్ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ అందుకుంది. ఇకపోతే ఈ మధ్యకాలంలో ఎక్కువగా నార్త్ ఇండస్ట్రీని ప్రియమణి టార్గెట్ చేస్తోందేమో అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిజానికి ఇప్పటికే ఎన్నో ఇంటర్వ్యూలలో పాల్గొన్న ప్రియమణి అప్పుడప్పుడు నార్త్ ఇండస్ట్రీని ఉద్దేశిస్తూ చేసే కామెంట్లు అలాగే అనిపిస్తున్నాయని సదరు నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. అలాంటి ఈమె ఇప్పుడు మరొకసారి నార్త్ ఇండస్ట్రీపై అలాగే నార్త్ సెలెబ్రిటీలపై చేసిన కామెంట్లు వైరల్ గా మారుతున్నాయి. మరి ఈసారి దేనిని ఉద్దేశించిందో కామెంట్స్ చేసిందో ఇప్పుడు చూద్దాం. విషయంలోకి వెళ్తే.. గత కొన్ని నెలలుగా సినీ ఇండస్ట్రీలో పారితోషకం విషయంలోనే కాదు పని గంటల విషయంలో కూడా వ్యత్యాసం చూపిస్తున్నారు అంటూ తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు నటి ప్రియమణి కూడా ఇదే విషయంపై మాట్లాడింది. ముఖ్యంగా సౌత్ కి నార్త్ కి తేడా అదే అంటూ కామెంట్లు చేసిన ఈమె.. అసలు ఇలా ఎందుకు అంది అనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చింది. ప్రియమణి మాట్లాడుతూ..” ఏ రోజు కూడా నేను డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎక్కడైనా సరే



మన స్టార్డంను బట్టి పారితోషకం ఇస్తారు. అందుకే దానిని దృష్టిలో పెట్టుకొని నేను కూడా దర్శక నిర్మాతలను పారితోషకం అడుగుతాను. ఒక్కొక్కసారి నాతోపాటు నటించిన వారి కంటే కూడా నేను తక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న రోజులు ఉన్నాయి. అందుకు నేనేమి బాధపడడం లేదు. ఒకవేళ నేను చేసే పాత్రను బట్టి, నిడివిని బట్టి అవసరం అనిపిస్తే నేనే డిమాండ్ చేస్తాను. అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచమని ఇప్పటివరకు ఎవరిని బలవంత పెట్టలేదు” అంటూ రెమ్యూనరేషన్ పై స్పందించింది. అలాగే పని గంటల పై మాట్లాడుతూ..”రెండు ప్రాంతాలలో చిత్రీకరణ టైమింగ్ చాలా భిన్నంగా ఉంటుంది. సౌత్ ఇండస్ట్రీలో ఉదయం 8 గంటలకే షూటింగ్ మొదలుపెడతాము అని షెడ్యూల్ ఇస్తే.. ఖచ్చితంగా ఆ సమయానికి షూటింగ్ ప్రారంభిస్తారు. అయితే నార్త్ లో ఇలా ఉండదు. ఎనిమిది గంటలకు షూటింగ్ అంటే ఆ సమయానికి నటీనటులు తమ ఇంటి నుంచి బయలుదేరుతారు. ఇదే నార్త్ కీ సౌత్ కి తేడా” అంటూ ప్రియమణి తెలిపింది. ఇక ప్రియమణి చేసిన కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ గా మారుతున్నాయి. ప్రియమణి కెరియర్ విషయానికి వస్తే.. రావణ్ అనే హిందీ చిత్రం ద్వారా నటన రంగ ప్రవేశం చేసిన ఈమె.. తెలుగులో ఎవరే అతగాడు అనే సినిమాతో పరిచయమైంది. ఈ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు. దాంతో తమిళ్ కి వెళ్ళిపోయి అక్కడే పలు చిత్రాలు చేస్తూ ప్రేక్షకులను అలరించింది. తర్వాత మళ్లీ తెలుగులో పెళ్లయిన కొత్తలో అనే సినిమా చేసి ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది ప్రియమణి. అప్పటినుంచి వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రియమణి ఒకవైపు సినిమాలు మరొకవైపు పలు షోలకు జడ్జిగా వ్యవహరిస్తూ ఆకట్టుకుంటుంది. ప్రియమణి అప్కమింగ్ సినిమాల విషయానికొస్తే.. విజయ్ జన నాయగక్ చిత్రంతో పాటు ది ఫ్యామిలీ మెన్ సీజన్ 3 లో కూడా నటిస్తోంది.

# విజయ్ ప్రేమలో నిజాయితీ లేదా? ఓపెనైన తమన్నా!

మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా కెరీర్ జర్నీ, లవ్ లైఫ్ గురించి తెలిసిందే. ఓవైపు సౌత్ లో నటిస్తూనే, బాలీవుడ్ లో అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు ఓటీటీల కోసం వెబ్ సిరీస్ లలో నటిస్తూ, తనలోని వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తోంది. అయితే తమన్నా వ్యక్తిగత లవ్ లైఫ్ లోని కుదుపు తనను నిజంగా భావోద్వేగానికి గురి చేస్తోంది. నటుడు విజయ్ వర్మతో లవ్ బ్రేకప్ తర్వాత తమన్నా ఆలోచనల్లో తీవ్ర మార్పులొచ్చాయి. అయితే బ్రేకప్ తర్వాతా విజయ్ తో స్నేహం కొనసాగిస్తున్నానని చెప్పిన తమన్నా, ఇప్పుడు అనూహ్యమైన కామెంట్ చేయడం చర్చగా మారింది. తమన్నా తాజా చాటింగ్ సెషన్ లో నిజాయితీ గురించి ఎక్కువగా మాట్లాడింది. నిజాయితీ అనేది అద్దం లాంటిది.. అద్దం బ్రేక్ అయితే అంటించవచ్చు కానీ, అది



ఎప్పుడూ ఒకేలా కనిపించదని నర్మగర్భంగా వ్యాఖ్యానించింది తమన్నా. సూటిగా తన మాజీ ప్రియుడి పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించినా కానీ, ఆ టైమింగ్ రైమింగ్ కచ్చితంగా తన మాజీ గురించేనని అర్థమవుతోంది. ఎవరైనా హత్య చేస్తే.. నేను ఇంకా సహాయం చేయగలను. కానీ ఎవరైనా అబద్ధం చెబితే..అస్సలు తట్టుకోలేను! అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఈ సూటి విమర్శ ఎవరిని ఉద్దేశించి? తమన్నా ఎవరిని టార్గెట్ చేసింది?.. అర్థం చేసుకునేవారికి చేసుకున్నంత. రిలేషన్ షిప్స్ లో ఆనందం కంటే నిజం చాలా ముఖ్యం. ముఖ్యంగా గ్లామర్ రంగంలో కొన్ని నిజాలను డైజెస్ట్ చేసుకోవడం ఎప్పటికీ అంత సులువు కాదు. చాలా మంది కథానాయికలు అలాంటి కొన్ని కఠిన విషయాలను ఇక్కడ ఎదుర్కోవడం చూస్తున్నదే.




# అనిల్ రావిపూడి.. తారక్ తో సినిమా ఎందుకు సెట్ అవ్వలేదు?





టాలీవుడ్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా డైరెక్టర్ అనిల్ రావిపూడి పేరు మారుమోగిపోతోంది. మెగాస్టార్ చిరంజీవితో ఆయన తీసిన ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమా థియేటర్ల వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే బుక్ మై షోలో ఈ సినిమా 10 లక్షల కంటే ఎక్కువ టికెట్లు అమ్ముడై సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం వినోదాన్ని మాత్రమే నమ్ముకుని వరుసగా 9 హిట్లు కొట్టిన అనిల్ రావిపూడి, తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఒక ‘సక్సెస్ ఫుల్ బ్రాండ్’గా మారిపోయారు. అపజయం అనేది లేకుండా దూసుకుపోతున్న అనిల్, ఒకవైపు కమర్షియల్ హిట్లు కొడుతూనే మరోవైపు టాలీవుడ్ అగ్ర హీరోలతో పనిచేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే మహేష్ బాబుతో ‘సరిలేరు నీకెవ్వరు’ వంటి బిగ్గెస్ట్ హిట్ అందుకున్న ఆయన, బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో నిరూపించారు. అయితే, ప్రతి దర్శకుడికి ఒక డ్రీమ్ హీరో ఉన్నట్లే, అనిల్ రావిపూడికి కూడా యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఒక భారీ ప్రాజెక్ట్ చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రేజీ కాంబినేషన్ కు సంబంధించి గతంలో ఒక ఇంటర్వ్యూలో అనిల్ కొన్ని ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు. నిజానికి జూనియర్ ఎన్టీఆర్ తో ఒక ప్యాన్ ఇండియా మూవీ చేయాలని తాను రెండు మూడు సార్లు ప్రయత్నించినట్లు ఆయన వెల్లడించారు. తారక్ అంటే తనకు చాలా ఇష్టమని, ఆయనను ఎగ్జైట్ చేసేలా ఒక అదిరిపోయే కథ కూడా సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. కానీ కొన్ని ప్రాక్టికల్ కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్ పైకి వెళ్లలేకపోయింది. ఒక ప్యాన్ ఇండియా సినిమా తీయాలంటే దానికి తగ్గ స్కేల్, పర్ఫెక్ట్ వరల్డ్ క్రియేషన్ ఉండాలని అనిల్ రావిపూడి నమ్ముతారు. కేవలం అనుకుంటే సరిపోదని, నేషన్ వైడ్ ఆడియన్స్ కు నచ్చేలా కంటెంట్ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాను ఉన్న ఫేజ్ లో చాలా కంఫర్టబుల్ గా ఉన్నానని, భవిష్యత్తులో ఖచ్చితంగా తారక్ తో పాటు మిగతా స్టార్ హీరోలందరితో సినిమాలు చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ పెరిగినప్పుడు దానికి తగ్గట్లుగా కొత్త కథలతో వస్తానని ప్రామిస్ చేశారు. ప్రస్తుతం ‘మన శంకర వరప్రసాద్ గారు’ సక్సెస్ తో అనిల్ రావిపూడి రేంజ్ మరింత పెరిగింది. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవిని వింటేజ్ లుక్ లో చూపిస్తూనే, తన మార్క్ కామెడీతో మ్యాజిక్ చేశారు. విక్టరీ వెంకటేష్ గెస్ట్ రోల్ నయనతార హీరోయిన్ గా ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ అయింది. ఈ సినిమా ఇస్తున్న బూస్ట్ తో, అనిల్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్స్ విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. రాజమౌళి తరువాత 100% సక్సెస్ రేటుతో అనిల్ రావిపూడి టాప్ లో నిలిచారు. త్వరలోనే ఎన్టీఆర్ కు సరిపోయే ఒక వైల్డ్ స్క్రిప్ట్ తో ఆయన ముందుకు వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. సంక్రాంతి సీజన్ లో బాక్సాఫీస్ వద్ద ‘మీా+’ హవా కొనసాగుతుండటంతో, అనిల్ రావిపూడి తన తదుపరి ప్లాన్స్ ఎప్పుడు అనౌన్స్ చేస్తారో అని అందరూ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# మత్తెక్కించే కళ్ళతో ఆకట్టుకుంటున్న ఐశ్వర్య మీనన్!





ఐశ్వర్య మీనన్..ఈ పేరు పెద్దగా తెలుగు వారికి తెలియకపోవచ్చు. ఎందుకంటే టాలీవుడ్ లో పేరున్న సినిమాలేవి ఈ హీరోయిన్ కి ఇంకా పడలేదు. టాలీవుడ్ లో గుర్తింపు కోసం పాకులాడుతూనే ఉంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా సోషల్ మీడియా ఖాతాలో పెట్టిన హాట్ ఫోటోలు కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. తాజాగా ఐశ్వర్య మీనన్ అద్దం ముందు నిల్చొని ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఐశ్వర్య మీనన్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు కుర్రకారుని మెస్మరైజ్ చేస్తున్నాయి. ఈ ఫోటోలలో అద్దం ముందు నిల్చున్న ఐశ్వర్య మీనన్ హాట్ ఫోజులు పెట్టి నడుము అందాలను హైలెట్ చేసింది.. పైన చిన్న టాప్ కింద జీన్స్ ప్యాంట్ తో ఫోటోలకు ఫోజులిచ్చిన ఐశ్వర్య మీనన్ అందాలకు చాలామంది నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ హీరోయిన్ హాట్ ఫోజులకు హాట్ హాట్ కామెంట్స్ కూడా పెడుతున్నారు. అలా సింపుల్ డ్రెస్ లో హెయిర్ లీవ్ చేసి సాదాసీదా లుక్ తోనే ఐశ్వర్య మీనన్ తన చూపులతో మత్తెక్కిస్తుంది. కిల్లింగ్ లుక్స్ తో ఈ హీరోయిన్ ఉన్న ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. అలాగే మిర్రర్ ఒక గొప్ప మిత్రుడు అలాగే విమర్శకుడు అన్నట్లుగా ఓ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఐశ్వర్య మీనన్ ఫోటోలు నెట్టింట్లో వైరల్ గా మారడంతో ఈ ఫోటోస్ చూసిన నెటిజన్లు ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ చాలా అందంగా ఉన్నావు అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఐశ్వర్య మీనన్ ఫోటోల గురించి పక్కన పెడితే..ఆమె తమిళ ఇండస్ట్రీ ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా కాదలిల్ సోదుప్పువదు ఎప్పడి అనే సినిమాతో తమిళ్ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత తెలుగులో లవ్ ఫెయిల్యూర్ అనే సినిమా చేసినప్పటికీ ఈ మూవీ ఐశ్వర్య మీనన్ కి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. దాంతో తెలుగులో ఆఫర్స్ రాకపోవడంతో మళ్లీ తమిళ, కన్నడ,మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేసింది. అలా చివరికి తెలుగులో మళ్లీ రవితేజ హీరోగా నటించిన ఖిలాడి మూవీ లో ఆఫర్ వచ్చింది. ఈ సినిమా తర్వాత నిఖిల్ హీరోగా చేసిన స్పై, ఆర్ఎక్స్ 100 ఫేమ్ కార్తికేయ హీరోగా చేసిన భజే వాయువేగం సినిమాలో నటించింది.

కానీ ఐశ్వర్య మీనన్ ఇన్ని సినిమాలు చేసినా ఇప్పటివరకు అయితే హీరోయిన్ గా అంత గుర్తింపు అయితే రాలేదు. మరి ముందు ముందు ఈ హీరోయిన్ ఎంచుకునే సినిమాలైనా ఈమెకు పేరు తెచ్చి పెడతాయో లేదో చూడాలి. ఐశ్వర్య మీనన్ కేవలం సినిమాలు మాత్రమే కాకుండా సీరియల్స్, పలు వెబ్ సిరీస్ లలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఇక ఈ హీరోయిన్ అప్ కమింగ్ సినిమాల విషయానికి వస్తే.. మలయాళం లో భజూకా అనే సినిమా తప్ప ఈ హీరోయిన్ చేతిలో వేరే సినిమాలు లేవని తెలుస్తోంది.అలా సినిమాల్లో ఆఫర్స్ కోసం సోషల్ మీడియాలో తన హాట్ ఫోటోలతో పిచ్చెక్కిస్తోంది.

# క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న రష్మిక!

రష్మిక మందన్న.. నేషనల్ క్రష్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈమె ఇటీవల ది గర్ల్ ఫ్రెండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో నిర్మాత చేత రష్మిక కాదు పాన్ ఇండియా క్రష్మిక అని పిలిపించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. తన అందం తోనే కాదు అద్భుతమైన పర్ఫామెన్స్ తో కూడా అందరిని మెప్పించింది రష్మిక. పాత్ర ఏదైనా సరే డీ గ్లామరస్ పాత్ర మొదలుకొని మహారాణి పాత్ర వరకు ఇలా ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి నటించడంలో ఈమె తర్వాతే ఎవరైనా.. అలా తన అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకుంటున్న ఈమె .. ఇటు సోషల్ మీడియాలో కూడా అలరిస్తూ అభిమానులకు చేరువవుతోంది. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేసింది రష్మిక. అందులో థామా మూవీకి సంబంధించిన బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ ధరించి కళ్ళకు మస్కారా వేసుకుంటున్నట్లు సెల్ఫీ ఫోటోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. మరొక ఫోటోలో ది గర్ల్ ఫ్రెండ్ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా చుడిదార్ లో దర్శనమిచ్చి కళ్లద్దాలు పెట్టుకొని మరీ కనిపించింది ఇంకొక ఫోటోలో కొంటెగా ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇలా వరుసగా ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



రష్మిక అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. రష్మిక విషయానికి వస్తే.. ఛలో సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె ఆ తర్వాత పలు చిత్రాలలో నటించి భారీ పాపులర్ కి సొంతం చేసుకుంది..అతి తక్కువ సమయంలోనే సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా సరిలేరు నీకెవ్వరు సినిమాలో అవకాశానందుకొని భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈమె ఆచితూచి అడుగులు వేస్తూ పలు సక్సెస్ లను అందుకుంటోంది. ఇక గత మూడు నాలుగు సంవత్సరాలుగా పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, కుబేర, థామా అంటూ వరుస సినిమాలతో భారీ బ్లాక్ బస్టర్ విజయాలను తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ మధ్యలో సల్మాన్ ఖాన్ తో సికందర్ అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా డిజాస్టర్ అయినా.. దీని ప్రభావం పెద్దగా రష్మిక కెరియర్ పై పడలేదు అని చెప్పవచ్చు. ఇప్పుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేసింది. నవంబర్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేయగా.. అందులో రష్మిక నటనకు అభిమానులు ఫిదా అవుతున్నారు. అటు సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. దీక్షిత్ శెట్టి హీరోగా, రావు రమేష్ కీలక పాత్ర పోషించారు. ఇక భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.మొత్తానికైతే రష్మికకు మహర్దశ పట్టింది అని చెప్పడంలో సందేహం లేదు.

# బీచ్ ఒడ్డున గ్లామర్ తో ఆకట్టుకుంటున్న వేదిక!

నటి వేదిక ఎప్పుడు తన బోల్డ్ అందాలతో ఫాలోవర్స్ ని ఆకట్టుకునే పనిలోనే ఉంటుంది. అలా తాజాగా వేదిక సముద్రం వ్యూతో ఉన్న అందాలతో కుర్రకారుకి వలవేస్తోంది. ఈ మధ్యకాలంలో వేదిక ఎక్కువగా వెకేషన్ లోనే సందడి చేస్తోంది.రీసెంట్ గా వేదిక ఇన్స్టా ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందులో ఎక్కువగా సముద్రం, బీచ్ ఫోటోలే కనిపిస్తున్నాయి. తాజాగా వేదిక ఏజియన్ సముద్రం ఒడ్డున కూర్చున్న ఓ బికినీ ఫోటోని షేర్ చేసుకుంది. వైట్ కలర్ డ్రెస్ లో వేదిక తన అందాలతో కుర్రకారుకి గత్తర లేపుతోంది. ప్రస్తుతం వేదిక తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఆ ఒక్క ఫోటో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోలో వేదిక ఆత్మవిశ్వాసం ఆమె ఫిట్నెస్ చాలా క్లియర్ గా కనిపిస్తోంది. అలా తాజాగా సముద్రం ఒడ్డున కూర్చున్న వేదిక ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఈ ఫోటోకి క్యాప్షన్ గా “సూర్యుడు నా ఏకైక ఫిల్టర్” అని రాసుకొచ్చింది.. ప్రస్తుతం వేదిక గ్రీక్ వెకేషన్ లో ఉన్నట్టు అర్థమవుతుంది. రీసెంట్



గానే ఆమె మాల్దీవులకి వెకేషన్ కి వెళ్ళిన ఫోటోలను పంచుకుంది. తాజాగా గ్రీక్ వెకేషన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. అలా సమయం దొరికితే చాలు వెకేషన్ లకు చెక్కేస్తూ అక్కడ వివిధ ప్రాంతాల్లో దిగిన ఫోటోలను తన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటుంది.అలాంటి వేదిక తాజా ఫోటో క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు ఆమె అందానికి చాలామంది అభిమానులు కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. వేదిక సినిమాలు, పర్సనల్ విషయానికి వస్తే.. మహారాష్ట్రకు చెందిన వేదిక లండన్ లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ఎం.ఎస్.సి పూర్తి చేసి సినిమాల మీద ఉన్న ఇంట్రెస్ట్ తో ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా మొదట వేదిక కాలేజ్ డేస్ లో ఉన్నప్పుడు ఒక వీడియో ఆల్బమ్ చేసింది. ఆ ఆల్బమ్ ద్వారా వేదికకి తమిళ సినిమాలో ఆఫర్ వచ్చింది. అలా తమిళంలో మద్రాసి,ముని సినిమాల ద్వారా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గర అయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536